జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

కృష్ణ | సోమవారం 12 జనవరి 2026 | సంపుటి : 01 | సంచిక : 12 | పేజీలు : 12 | వెల : 4/- | PRGI No. APTEL/26/A0119,

విక్రం సంవత్సరం – పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ – 1946, ఆషాఢము 17 పూర్ణిమంతా – 2081, ఆషాఢము 16 అమాంత – 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from KRISHNA, GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.


అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు 9440231967, 7989694528

## విజన్ 2047, ఆదాయార్జన మార్గాలపై

# కీలక సమీక్ష



- నేడు మంత్రులు, శాఖల కార్యదర్శులతో సీఎం చంద్రబాబు కీలక సమావేశం
- రెవెన్యూ శాఖ సేవలు, ఆస్తుల భద్రతపై అధికారులకు దిశానిర్దేశం
- ఫిర్యాదులకు వెంటనే పరిష్కారం చూపాలి
- వర్చువల్‌గా హాజరుకానున్న జిల్లా కలెక్టర్లు
- సమావేశం అనంతరం సంక్రాంతికి నారావారిపల్లెకు సీఎం


**అమరావతి**

రాష్ట్ర పాలన, ప్రభుత్వ లక్ష్యాల అమలును వేగవంతం చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా సోమవారం నాడు మంత్రులు, శాఖల కార్యదర్శులతో ఆయన సచివాలయంలో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించనున్నారు. ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ భేటీ జరగనుంది. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్లు కూడా వర్చువల్ విధానంలో హాజరుకానున్నారు. సమావేశం ప్రారంభంలో, రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తి (జీఎస్‌డీపీ), 2047 విజన్‌లోని 10 సూత్రాలపై అధికారులు ప్రజంటేషన్ ఇవ్వనున్నారు. అనంతరం ఆదాయార్జన మార్గాలు, కేంద్ర ప్రాయోజిత పథకాల పురోగతి, ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య (పీపీపీ) ప్రాజెక్టులు, పెట్టుబడుల ఆకర్షణ, ఫైళ్ల పరిష్కారం, ఆన్‌లైన్ సేవలు, వాట్సాప్ గవర్నెన్స్ వంటి కీలక అంశాలపై సీఎం సమీక్ష జరుపుతారు. ముఖ్యంగా రెవెన్యూ శాఖ పనితీరుపై ఈ సమావేశంలో ప్రత్యేకంగా చర్చించనున్నారు. పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ, భూముల సర్వే, రిజిస్ట్రేషన్ సేవలు, ఫిర్యాదుల పరిష్కారం వంటి అంశాలపై మంత్రులు, అధికారులకు సీఎం దిశానిర్దేశం చేయనున్నారు. బ్లాక్‌చైన్ టెక్నాలజీతో ప్రజల ఆస్తులకు పటిష్ఠ భద్రత కల్పించే విధానంపైనా చర్చిస్తారు. వీటితో పాటు కేంద్రం కొత్తగా తీసుకొచ్చిన 'వీబీ జీ రామ్ జీ' పథకంపై కూడా సమీక్షించనున్నారు. సమావేశం ముగిసిన అనంతరం తన స్వగ్రామం నారావారిపల్లెకు బయలుదేరి వెళతారు.



## 2026లో తొలి ప్రయోగానికి ఇస్రో సిద్ధం

- కొనసాగుతున్న కౌంట్ డౌన్
- పీఎస్ఎల్వీ-సీ62 రాకెట్‌తో 'అన్వేష' ఉపగ్రహం ప్రయోగం
- శ్రీహరికోట నుంచి సోమవారం ఉదయం 10:17 గంటలకు నింగిలోకి
- రక్షణ, విపత్తు నిర్వహణలో కీలకపాత్ర పోషించనున్న 'అన్వేష'
- 'అన్వేష'తో పాటు మరో 15 ఉపగ్రహాలను మోసుకెళ్లనున్న రాకెట్



## భారత్‌పై దాడులకు వేలమంది బాంబర్లు సిద్ధం

- కలకలం రేపుతున్న మసూద్ అజహర్ ఆడియో!
- భారత్‌పై దాడులకు సిద్ధంగా వేలాది మంది బాంబర్లు
- జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజార్ పేరిట ఆడియో క్లిప్ వైరల్
- నిజమైన సంఖ్య చెబితే ప్రపంచం షాకవుతుందంటూ హెచ్చరిక
- సోషల్ మీడియాలో తీవ్ర ఆగ్రహావేశాలు



## తమిళనాట కొత్త రాజకీయం?

- డీఎంకే-కాంగ్రెస్ పొత్తు లేనట్లేనా..
- రాబోయే ఎన్నికల్లో ఈ రెండు పార్టీలు కలిసి పని చేసే అవకాశాలు తక్కువగా కనిపిస్తున్నాయి.
- సీట్ల షేరింగ్ తోపాటు, అధికారంలో కూడా భాగస్వామ్యం కల్పించాలని కాంగ్రెస్ డిమాండ్
- అధికారాన్ని పంచుకునేందుకు తమ పార్టీ అధినేత, సీఎం స్టాలిన్ సిద్ధంగా లేరని ఆయన వ్యాఖ్య

## తెలంగాణతో న్యాయపోరాటానికి

# ఏపీ సిద్ధం



- పోలవరం-నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్ట్...
- పోలవరం-నల్లమల లింక్ ప్రాజెక్టుపై సుప్రీంకోర్టులో తెలంగాణ పిటిషన్
- విచారణ నేపథ్యంలో న్యాయ బృందంతో మంత్రి నిమ్మల రామానాయుడు సమీక్ష
- వృథాగా పోయే గోదావరి నీటిని వాడుకోవడమే లక్ష్యమని ఏపీ వాదన
- ఇది ట్రైబ్యునల్ అవార్డుకు విరుద్ధమంటూ తెలంగాణ తీవ్ర అభ్యంతరం
- అన్ని అనుమతుల తర్వాతే ప్రాజెక్టు చేపడతామని స్పష్టం చేసిన ఏపీ

**అమరావతి**

పోలవరం-నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టును సవాలు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో సోమవారం (జనవరి 12న) విచారణ జరగనున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం న్యాయపోరాటానికి పూర్తిస్థాయిలో సన్నద్ధమవుతోంది. ఈ కేసులో రాష్ట్రం తరపున బలమైన వాదనలు వినిపించేందుకు సిద్ధం కావాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు న్యాయ బృందాన్ని, ఉన్నతాధికారులను ఆదేశించారు. ఆదివారం ఆయన ఈ అంశంపై సీనియర్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సుప్రీంకోర్టులో ఆంధ్రప్రదేశ్ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించనున్నారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ.. - మిగతా3లో



## పంతంగి టోల్ ప్లాజా వద్ద భారీ రద్దీ

- సంక్రాంతి పండుగ నేపథ్యంలో పల్లెబాట
- పట్టిన పట్నం వాసులు
- నిన్న ఒక్క రోజే ఏపీకి 60 వేల వాహనాలు
- ఆదివారం కావడంతో ఈరోజు మరింత రద్దీ



## పవన్ కల్యాణ్‌కు 'టైగర్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్'

# బిరుదు

### డిప్యూటీ సీఎంకు అంతర్జాతీయంగా దక్కిన గౌరవం

**అమరావతి**

ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అరుదైన ఘనత సాధించారు. మార్షల్ ఆర్ట్స్‌లో ప్రావీణ్యులైన ఆయన.. ప్రాచీన జపనీస్ కత్తిసాము కళ 'కెంజుట్సు'లో అధికారికంగా ప్రవేశం పొంది అంతర్జాతీయ గౌరవాన్ని సాధించారు. మూడు దశాబ్దాలకు పైగా సాగించిన సాధన, పరిశోధన, అంకితభావానికి నిదర్శనంగా ఈ అరుదైన ప్రపంచ స్థాయి గుర్తింపు లభించింది. కరాటే, యుద్ధకళల పట్ల ఆసక్తి కలిగిన పవన్.. చెన్నైలో ఉండగానే కఠినమైన శిక్షణతో పాటు నిరంతర సాధన చేశారు. శారీరక సాధనకే పరిమితం కాకుండా, జపనీస్ సమురాయ్ మార్షల్ సంప్రదాయాలపై లోతైన అధ్యయనం చేసి, పరిశోధించి వాటిని అనుసరించారు. పలు సినిమాల్లో మార్షల్ కళలను తెరపై ప్రదర్శిస్తూ, వాటికి విస్తత గుర్తింపు, ప్రజాదరణ తీసుకొచ్చారు. జపాన్ సంప్రదాయ యుద్ధకళల్లో అత్యంత గౌరవనీయమైన సంస్థలలో ఒకటైన 'సోగో బుడో కన్‌రి కై' నుంచి ఆయనకు ఫిఫ్త్ డాన్ (ఐదో డాన్) పురస్కారం లభించింది. జపాన్ వెలుపల 'సోకే మురమత్సు సెన్సై'లోని 'టకెడా షింగెన్ క్లాన్'లో ప్రవేశం పొందిన తొలి తెలుగు వ్యక్తిగా ఆయన నిలిచారు. గోల్డెన్ డ్రాగన్స్ సంస్థ ఆయనకు 'టైగర్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్' (ఖీజీఙ్భటౌ జ ఫ్వీట్టఙ్ఙీఅట్టట) అనే విశిష్ట బిరుదు అందించింది. ప్రముఖ బుడో నిపుణుడు - మిగతా3లో





## విశాఖ పోలీసుల పనితీరు

# ప్రశంసనీయం

- అభినందించిన సీఎం చంద్రబాబు
- పోలీసుల అదుపులో మహిళపై దాడి కేసు నిందితుడు
- స్పష్టమైన ఆధారాలు లేకున్నా కేసు ఛేదించిన పోలీసులు
- మానసిక స్థితి సరిగ్గా లేదని ప్రాథమికంగా నిర్ధారణ

# ఫిబ్రవరిలో డీఎస్సీ నోటిఫికేషన్

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉపాధ్యాయ కొలువుల కోసం నిరీక్షిస్తున్న నిరుద్యోగులకు ప్రభుత్వం తీపి కబురు చెప్పనుంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఫిబ్రవరి మొదటి వారంలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసేందుకు పాఠశాల విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తోంది. ఈ దఫా సుమారు 2500 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కేవలం ఖాళీలను భర్తీ చేయడమే కాకుండా విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చే దిశగా పరీక్ష విధానంలో కూడా మార్పులు చేస్తోంది.రాష్ట్రంలో గతే ఏడాది ప్రభుత్వం డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేసింది. అయినా ఇంకా ఉపాధ్యాయుల కొరత ఉండనే ఉంది. దీనికి తోడు ఈ ఏడాది కూడా భారీగా ఉపాధ్యాయులు ఉద్యోగాల నుంచి రిటైర్ కానున్నారు. పాఠశాల విద్యాశాఖ జరిపిన తాజా సమీక్షలో మొత్తం ఖాళీలు 2500 వరకు ఉన్నట్టు తేల్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో బోధన నాణ్యత తగ్గకుండా ఉండాలంటే ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. విద్యారంగంలో సంస్కరణల్లో భాగంగా గతంలో వివాదాస్పద జీవో 117ను ప్రభుత్వం రద్దు చేసింది. దీని స్థానంలో తొమ్మిది కొత్త విధానాలను అమలులోకి తీసుకొచ్చింది. ఈ కొత్త విధానం ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా 9200 ప్రాథమిక పాఠశాలలను మోడల్ ప్రైమరీ స్కూళ్లుగా తీర్చి దిద్దారు. ఈ పాఠశాలల్లో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా నిబంధనలు మార్చారు. ఇటీవల చేపట్టిన ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియ ముగిసిన తర్వాత క్షేత్రస్థాయిలో వాస్తవ ఖాళీలపై స్పష్టత వచ్చింది. బదిలీల అనంతరం సుమారు 1146 మంది ఉపాధ్యాయులు అదనంగా అవసరం ఉన్నట్టు అధికారులు గుర్తించారు. ప్రస్తుతం ఈ స్థానాల్లో తాత్కాలికంగా అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించారు. అయినా శాస్వత ప్రాతిపదికన డీఎస్సీ ద్వారా వీరిని భర్తీచేయాలని మరో నోటిఫికేషన్ వేయనున్నారు.



ఈసారి డీఎస్సీ రాసే అభ్యర్థులకు ఒక కొత్త సవాలు ఎదురుకానుంది. మారుతున్న కాలానికి అనుగుణంగా డిజిటల్ విద్యను ప్రోత్సహించే ఉద్దేశంతో ఉపాధ్యాయులకు ఆంగ్లభాషా ప్రావీణ్యం, కంప్యూటర్ అవగాహనపై ఒక ప్రత్యేక పేపర్‌ను ప్రవేశ పెట్టాలని విద్యాశాఖ ప్రతిపాదించింది. ఇప్పటి వరకు కేవలం సబ్జెక్ట్ నైపుణ్యాలకే పరిమితమైన డీఎస్సీ, ఇకపై ఏపీపీఎస్సీ తరహాలో అభ్యర్థుల బహుముఖ నైపుణ్యాలను పరీక్షించనుంది. ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులకు ఆంగ్ల భాషపై పట్టు సాధించేలా చేయాలంటే బోధించే ఉపాధ్యాయులకు ఆ నైపుణ్యం ఉండాలనేది ప్రభుత్వ ఆలోచన, అందుకే ఈ కొత్త పేపర్‌ను డీఎస్సీలో అంతర్భాగం చేయనున్నారు. ఇది అభ్యర్థుల ఎంపికలో కీలక పాత్ర పోషించనుంది. గత నెలలో నిర్వహించిన టెట్ లితాలను జనవరి 19న విడుదల చేయనున్నారు. ఇప్పటికే ప్రాథమిక కీ విడుదల చేశారు. దీనిపై అభ్యంతరాలను కూడా పరిశీలిస్తున్నారు. అనంతరం ఫైనల్ కీ విడుదల చేస్తారు. తర్వాత ఫలితాలను రిలీజ్ చేస్తారు. డీఎస్సీకి టెట్ అర్హత ప్రాధాన్యత కలిగినది కావడంతో ఈ ఫలితాల కోసం లక్షల మంది ఎదురు చూస్తున్నారు.

# రాజధాని రచ్చ...

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ లో మరోసారి రాజధాని అమరావతి హాట్ టాపిక్ గా మారింది. రెండో విడత భూ సమీకరణ జరుగుతున్న నేపథ్యంలో వైఎస్ జగన్ చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. మరోసారి ఏపీ రాజకీయాల్లో వేడిని పుట్టించాయి. వైఎస్ జగన్ ఈ సమయంలో రాజధాని అమరావతిపై వ్యాఖ్యలు చేయడం కొంత ప్రభుత్వాన్ని కూడా ఇబ్బందుల్లోకి నెట్టినట్లయింది. దీంతో వైఎస్ జగన్ కు మంత్రులు కౌంటర్ ఇస్తున్నారు. . విజయవాడ, గుంటూరుకు నలభై కిలోమీటర్ల దూరంలో రాజధాని అమరావతి ఉందని తెలిపారు. రాజ్యాంగంలో రాజధాని అనే పదం ఎక్కడా లేదని జగన్ అన్నారు. నదీపరీవాహక ప్రాంతంలో రాజధాని నిర్మాణం చేయడం సరికాదని వైఎస్ జగన్ వ్యాఖ్యానించారు. అక్కడ నగరం నిర్మించాలనుకోవడం సరికాదని జగన్ వ్యాఖ్యానించారు. అమరావతిలో మౌలిక సదుపాయాలు లేవని జగన్ అన్నారు.అక్కడ నీరు, విద్యుత్తు, రహదారి సౌకర్యం కూడా లేదని వైఎస్ జగన్ అన్నారు. ముఖ్యమంత్రి ఎక్కడ కూర్చుని పనిచేస్తే అదే రాజధాని అవుతుందని వైఎస్ జగన్ అన్నారు. అమరావతి రాజధానిగా అనువైన ప్రదేశం కాదని వైఎస్ జగన్ అన్నారు. అసలు మౌలిక సదుపాయాలు లేని చోట రాజధాని నిర్మాణం చేయడం సరికాదని తెలిపారు. రివర్ బేసిన్ లో నిర్మాణాలు చేపట్టడం సరికాదని జగన్ వ్యాఖ్యానించారు. భవనాలు కట్టుకోవాలన్నా అనుమతి కావాల్సి ఉంటుందని జగన్ వ్యాఖ్యానించారు. గుంటూరు - విజయవాడ మధ్య రాజధాని నిర్మాణం చేపట్టి ఉంటే బాగుండేదని జగన్ అభిప్రాయపడ్డారు. అయితే మంత్రి



నారాయణ మాట్లాడుతూ జగన్ కు రాజధాని పై అవగాహన లేదని అన్నారు.నదీ గర్భంలో నిర్మాణాలు చేపడతామని మంత్రి నారాయణ ప్రశ్నించారు. గతంలో శాసనసభలో అమరావతి లో రాజధాని నిర్మాణంపై జగన్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ఉపయోగించుకోవడం కోసమేనన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. దీంతో మరోసారి రాజధాని రచ్చ మొదలయింది. రైతుల్లో నెలకొన్న అసంతృప్తి రెండో విడత భూ సమీకరణ నేపథ్యంలో మొదటి సారి చేసిన భూ సమీకరణ చేసిన దాంట్లోనే అభివృద్ధిచేయలేన్న అభిప్రాయం వినిపిస్తున్న సమయంలో ఈ వ్యాఖ్యలు కలకలం రేపాయి. అమరావతి పనులు వేగం పుంజుకున్న సమయంలో ఓర్చుకోలేక జగన్ ఈ రకమైన దాడికి రాజధానిపై దిగారని మంత్రులు విరుచుకుపడుతున్నారు. మొత్తం మీద మరోసారి అమరావతి రాజధాని రాజకీయంగా రచ్చగా మారింది.

# రప్పా..రప్పా... రక్తాభిషేకాలు.. అండగా ఉంటామంటున్న జగన్

**అనంతపురం :** వైసీపీ కార్యకర్తలపై నమోదు అవుతున్న కేసుల అంశం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరోసారి తీవ్ర చర్చకు దారి తీసింది. ఈ పరిణామాల నేపథ్యంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఒక కీలక నిర్ణయం తీసుకున్నారు. కూటమి ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుని వైసీపీ శ్రేణులపై నమోదు చేస్తున్న కేసులకు పార్టీ తరఫున పూర్తిస్థాయి న్యాయ సహాయం అందించాలని ఆయన నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు బుధవారం మాజీ హోంమంత్రి తానేటి వనిత నేతృత్వంలో తనను కలిసిన కార్యకర్తలకు జగన్ స్పష్టమైన భరోసా ఇచ్చారు.కార్యకర్తలు ఎట్టి పరిస్థితుల్లోనూ భయపడాల్సిన అవసరం లేదని, తమపై నమోదైన కేసుల విషయంలో పార్టీ లీగల్ టీం పూర్తిగా అండగా నిలుస్తుందని ఆయన తెలిపారు. రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే ఈ కేసులు నమోదు అవుతున్నాయని, న్యాయపరంగా పోరాడి కార్యకర్తలకు రక్షణ కల్పిస్తామని జగన్ చెప్పినట్లు సమాచారం. ఈ భరోసాతో పార్టీ శ్రేణుల్లో కొంత ఊరట కనిపిస్తున్నదని అంటున్నారు.ఈ వివాదానికి కారణమైన సంఘటన ఏలూరు జిల్లా గోపాలపురం నియోజకవర్గం లో చోటుచుకుంది. గత నెలలో జగన్ పుట్టినరోజు సందర్భంగా కొందరు వైసీపీ కార్యకర్తలు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అందులో "2029లో



అధికారంలోకి వచ్చాక ఒక్కొక్కడికి రప్పా.. రప్పా" అనే పదాలు ఉండటంతో ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. ఫ్లెక్సీ ముద్రించిన కార్యకర్తలను అరెస్ట్ చేయడంతో పాటు, ప్రింటింగ్ షాపును కూడా సీజ్ చేసినట్లు వైసీపీ ఆరోపిస్తోంది. అంతేకాదు, నిందితులను బహిరంగంగా రోడ్డుపై నడిపించారని, ఇది ఉద్దేశపూర్వక అవమాన చర్య అని పార్టీ నేతలు మండిపడుతున్నారు.ఇలాంటి ఘటనలు ఒక్క గోపాలపురం వరకే కాకుండా అనంతపురం సత్యసాయి జిల్లాల్లో కూడా చోటుచుకున్నాయని చెబుతున్నారు. అక్కడ కొందరు కార్యకర్తలు కత్తులు ప్రదర్శించడం, జంతు బలులు ఇచ్చి జగన్ పోస్టర్లకు రక్తాభిషేకం చేయడం వంటి ఘటనలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. జంతు సంరక్షణ చట్టాలు, ఆయుధాల చట్టం కింద కేసులు నమోదు చేసి పలువురిని అరెస్ట్ చేసింది. ఈ కేసులలోనూ నిందితులను కోర్టులకు తరలించే సమయంలో రోడ్డుపై నడిపించారని వైసీపీ శ్రేణులు ఆరోపిస్తున్నాయి.ఈ వ్యవహారంపై జగన్ తీసుకున్న నిర్ణయాన్ని పార్టీ కార్యకర్తలు స్వాగతిస్తున్నారు. తమ అభిమానాన్ని వ్యక్తపరిచినందుకే ప్రభుత్వం అణచివేస్తోందని వారు భావిస్తుండగా, అధినేత నుంచి న్యాయ సహాయం హామీ రావడంతో ధైర్యం వచ్చిందని చెబుతున్నారు. మరోవైపు ప్రభుత్వ అనుకూల వర్గాలు మాత్రం "రప్పా.. రప్పా" వంటి నినాదాలు ప్రజాస్వామ్య రాజకీయాలకు విఘాతమని, హింసను ప్రోత్సహించేలా ఉన్నాయని విమర్శిస్తున్నాయి. ఈ నేపథ్యంలో జగన్ నిర్ణయం రాజకీయంగా, న్యాయపరంగా మరింత పెద్ద చర్చకు దారి తీసినట్లు రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

## పవన్ కల్యాణ్‌కు 'టైగర్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్' బిరుదు

-మొదటిపేజీ తరువాయి

హాన్షి ప్రొఫెసర్ డాక్టర్ సిద్ధిక్ మహ్మూదీ మార్గ దర్శకత్వంలో పవన్‌కల్యాణ్ 'కెండో'లో సమగ్ర శిక్షణ పొంది, ఉన్నత స్థాయి సాంకేతిక నైపుణ్యం పొందారు. సినిమా, శాస్త్రీయ యుద్ధకళలు, యుద్ధ తత్వశాస్త్రాలను అంతర్జాతీయ వేదికపై సమన్వయం చేయగలిగిన అతి కొద్దిమంది భారతీయ ప్రముఖుల్లో ఒకరిగా పవన్ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. ఇక సినిమాల విషయానికొస్తే, ప్రస్తుతం ఆయన నటించిన 'ఉస్తాద్ భగత్ సింగ్'చిత్రీకరణ పూర్తయింది. హరీశ్ శంకర్ దర్శకుడు. శ్రీలీల కథానాయిక. త్వరలోనే ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మరోవైపు సురేందర్‌రెడ్డి దర్శకత్వంలో ఓ సినిమా చేసేందుకు పవన్‌కల్యాణ్ సిద్ధమవుతున్నారు. ఇటీవల ఇందుకు సంబంధించిన ప్రకటన కూడా వెలువడింది.

## విశాఖ పోలీసుల పనితీరు ప్రశంసనీయం

అమరావతి

విశాఖపట్నంలో ఓ మహిళపై జరిగిన దాడి వెనుక వాస్తవాలను ఛేదించి, నిందితుణ్ని అదుపులోకి తీసుకున్న విశాఖ నగర పోలీసులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందించారు. రెండు రోజుల క్రితం విశాఖలో విజయదుర్గ అనే మహిళను జగదాంబ సెంటర్‌లో ఓ వ్యక్తి దాడి చేసి, దుర్భాషలాడినట్టు ఆమె సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. దీనిపై తక్షణమే స్పందించిన పోలీసులు... ఈ ఘటనకు కారణమైన వ్యక్తిని వెంటనే అదుపులోకి తీసుకున్నారు. అయితే అతని మానసిక పరిస్థితి బాగోలేదని ప్రాథమిక విచారణలో తేలింది. సంఘటన సమాచారం అందిన వెంటనే పోలీసులు స్పందించి, వ్యక్తిని అదుపులోకి తీసుకోవడం, నిందితుడి గుర్తింపు వివరాలు తెలియకపోయినా, కేసును ఛేదించడంపై బాధిత మహిళ సంతప్తి వ్యక్తం చేశారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు స్పందించారని చెప్పారు. సదరు మహిళ స్వయంగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి, ఆ వ్యక్తి మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నారని నిర్ధారించుకున్నారు. అతన్ని మానసిక ఆసుపత్రిలో చేర్పించాలని కోరారు. అలాగే నిందితుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవద్దని బాధితురాలు విజ్ఞప్తి చేశారు. విశాఖలో శాంతిభద్రతలు అద్భుతంగా ఉన్నాయనేందుకు ఇది నిదర్శనమని ముఖ్యమంత్రి చంద్రబాబు పోలీసుల పనితీరును ప్రశంసించారు. ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ ప్రజల భద్రతకు కట్టుబడి పనిచేస్తోందన్నారు. మహిళలకు రక్షణ విషయంలో దేశంలోనే విశాఖ మొదటి స్థానంలో ఉందని, భవిష్యత్‌లోనూ ఎటువంటి ఘటనలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని పోలీస్ ఉన్నతాధికారులకు సీఎం సూచించారు. ఇదే సమయంలో ఇలాంటి ఘటనలపై రాజకీయం చేస్తూ, ప్రభుత్వంపై బురద జల్లాలని ప్రయత్నించేవారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విశాఖ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతీస్తే సహించేది లేదని స్పష్టం చేశారు.

## తెలంగాణతో న్యాయపోరాటానికి ఏపీ సిద్ధం

-మొదటిపేజీ తరువాయి

ఈ కేసుకు సంబంధించిన అన్ని రికార్డులను, కీలకమైన సమాచారాన్ని వెంటనే న్యాయవాదుల బృందానికి అందించాలని అధికారులను ఆదేశించారు. జలవనరుల శాఖ ప్రత్యేక కార్యదర్శి సాయి ప్రసాద్, సలహాదారు వెంకటేశ్వరరావు, ఇంజినీర్-ఇన్-చీఫ్ నరసింహమూర్తి, అంతర్రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు, న్యాయవాదులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఏటా గోదావరి నది నుంచి సుమారు 3000 టీఎంసీల నీరు సముద్రంలోకి వృథాగా పోతోందని, అందులో నుంచి కేవలం 200 టీఎంసీల నీటిని మాత్రమే ఈ ప్రాజెక్టు ద్వారా రాయలసీమకు తరలించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి వివరించారు. దిగువ రాష్ట్రంగా మిగులు జలాలను వాడుకునే హక్కు గోదావరి జల వివాదాల ట్రైబ్యునల్ (+ఔఱు) అవార్డు ప్రకారమే ఆంధ్రప్రదేశ్‌కు ఉందని ఆయన స్పష్టం చేశారు. "మేం స్నేహ హస్తం అందిస్తుంటే, తెలంగాణ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం చేసేలా కోర్టుకు వెళ్లడం విచారకరం" అని మంత్రి నిమ్మల వ్యాఖ్యానించారు. సముద్రంలో కలిసిపోతున్న నీటిని కరవు పీడిత ప్రాంతమైన రాయలసీమను సస్యశ్యామలం చేయడానికి వాడుకోవడంలో తప్పేంటని ఆయన ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఇతర రాష్ట్రాల హక్కులకు ఎలాంటి భంగం వాటిల్లదని, కేవలం మిగులు వరద జలాలను మాత్రమే వినియోగించుకుంటామని ఆయన పునరుద్ఘాటించారు. ఇప్పటికే ప్రాజెక్టు సాధ్యాసాధ్యాల నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించామని, వారి సూచనల మేరకు మార్పులు చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం డీపీఆర్ (వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక) కోసం పిలిచిన టెండర్లు కేవలం ప్రాథమిక సన్నాహక చర్యలు మాత్రమేనని, అన్ని చట్టపరమైన అనుమతులు పొందిన తర్వాతే ప్రాజెక్టు పనులను ప్రారంభిస్తామని మంత్రి నిమ్మల స్పష్టం చేశారు. మరోవైపు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న పోలవరం-నల్లమల సాగర్ ప్రాజెక్టు నిర్మాణాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గతవారం తేల్చిచెప్పారు. ఏపీ ప్రతిపాదనలు గోదావరి జల వివాదాల ట్రిబ్యునల్-1980 అవార్డుకు, అంతర్రాష్ట్ర జల నిబంధనలకు స్పష్టమైన ఉల్లంఘన అని ఆయన ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఇరు రాష్ట్రాల వాదనల మధ్య సుప్రీంకోర్టు విచారణ కీలకంగా మారింది.

## వివాదాల్లో రఘురాముడు..



**ఏలూరు :** ఏపీ రాజకీయాల్లో మరోసారి హాట్ టాపిక్‌గా మారింది డిప్యూటీ స్పీకర్ రఘురామరాజువ్యవహారం. రాజ్యాంగ పదవిలో ఉంటూ ఆయన చేస్తున్న రాజకీయ వ్యాఖ్యలు, ఇటు టీవీ అటు యూట్యూబ్ డిబేట్లలో పాల్గొని ప్రత్యర్థి పార్టీలపై విమర్శలు చేయడంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో జైభీమ్ పార్టీ నేతలు నేరుగా రాష్ట్రపతి దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లడం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో చర్చకు దారి తీసింది.డిప్యూటీ స్పీకర్ హోదాలో ఉండి రాజకీయ విమర్శలు చేయడం రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధమని జైభీమ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరసా సురేష్ కుమార్ రాష్ట్రపతికి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును పరిశీలించిన రాష్ట్రపతి కార్యాలయం తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. ఈ లేఖ ముఖ్యమంత్రి కార్యదర్శి విజయానంద్ )కు చేరడంతో, ఈ అంశం మరింత సంచలనంగా మారింది.ఇదిలా ఉండగా, జైభీమ్ పార్టీ అధ్యక్షుడు జడ శ్రవణ్ కుమార్ కూడా డిప్యూటీ స్పీకర్ ప్రవర్తనపై తీవ్రంగా స్పందించారు. స్పీకర్ డిప్యూటీ స్పీకర్ వంటి ఉన్నత పదవుల్లో ఉన్నవారు పార్టీ రాజకీయాలకు దూరంగా ఉండాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. అలాంటి పదవులు చేపట్టే సమయంలో పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేయాలనే ఆచారం ఉందని గుర్తు చేశారు. కానీ రఘురామరాజు ఆ నిబంధనలను పట్టించుకోకుండా విపక్షంపై వ్యాఖ్యలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ విషయంలో కోర్టు ను కూడా ఆశ్రయించనున్నట్లు ప్రకటించారు.ఈ పరిణామాల నేపథ్యంలో ఏపీ రాజకీయ వాతావరణం వేడెక్కింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీతరఫున ఎమ్మెల్యేగా గెలిచిన రఘురామరాజు, మంత్రి పదవిని ఆశించినప్పటికీ, చివరకు డిప్యూటీ స్పీకర్ పదవి దక్కింది. ఆయన మాటల దూకుడే ఇందుకు కారణమని అప్పట్లో రాజకీయ వర్గాల్లో చర్చ జరిగింది. సభాపీఠంపై ఉండటం వల్ల ఆయన రాజకీయ వ్యాఖ్యలకు కట్టడి పడుతుందన్న అంచనాతోనే ఈ పదవి ఇచ్చారని కూటమినేతలు భావించినట్లు సమాచారం.అయితే ఆ అంచనాలకు భిన్నంగా రఘురామరాజు వ్యవహరిస్తున్నారని అంటున్నారు. గతంలో వైసీపీ ఎంపీగా ఉన్న సమయంలోనే స్వపక్షంపై విరుచుకుపడి సంచలనంగా మారిన ఆయన, ఇప్పుడు కూడా అదే తరహా ధోరణి కొనసాగిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. అప్పట్లో తనపై నమోదైన రాజద్రోహం కేసులపై ఇప్పటికీ న్యాయపోరాటం చేస్తున్న ఆయన, మీడియా వేదికగా రాజకీయ ప్రత్యర్థులను టార్గెట్ చేస్తున్నారని విపక్షం అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ఈ మొత్తం వ్యవహారంలో వైసీపీ నేరుగా రంగంలోకి దిగకపోయినా, జైభీమ్ పార్టీ ద్వారా ఫిర్యాదు చేయించడమే రాజకీయంగా ఆసక్తికరంగా మారింది. డిప్యూటీ స్పీకర్ నోటికి నిజంగానే తాళం పడుతుందా? లేక ఈ వివాదం మరింత ముదిరుతుందా? అన్నది ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో అందరూ ఎదురుచూస్తున్న ప్రశ్నగా మారింది.

# మోసాలు అవినీతి రౌడీయిజం పాలనతో సాగిన గత వైసీపీ ప్రభుత్వం

**అబద్దాలతో ప్రజల్ని నమ్మించాలన్న వైసీపీ నాయకుల ఆశలు ఎప్పటికీ నెరవేరవు**

**చంద్రబాబు లోకేష్ పని తీరును జగన్ జీర్ణించుకోలేకపోతున్నారు**

**గాజుల ఖాదర్ బాషాతెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కుప్పం పరిశీలకులు**



**రాయచోటి జనవరి 11 ప్రజా జ్యోతి :** చంద్రబాబు లోకేష్ పని తీరును జగన్మోహన్ రెడ్డి జీర్ణించుకోలేకపోతున్నారని గాజుల ఖాదర్ భాషా పేర్కొన్నారు.ఆదివారంనాడు ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూఅమరావతిపై జగన్ వ్యాఖ్యలు ప్రజలను మోసం చేసేందుకు యత్నమే గతంలో అమరావతికి మద్దతు అంటూ అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు రాజధానులు నాటకాన్ని మొదలుపెట్టిన జగన్ మాటలను నమ్మే స్థితిలో ప్రజలు లేరని తెలిపారు రాజధానిపై జగన్ ఎన్ని కుట్రలు చేసినా ఫలించవు వైసిపి పార్టీకి సిద్ధాంతాలు లేవు అరాచకమే వాళ్ళ సిద్ధాంతం అమరావతిలో అభివృద్ధిని చూసి జగన్మోహన్ రెడ్డి ఓర్వలేక పోతున్నారు రాష్ట్రం గురించి నిత్యము ఆలోచిస్తూ రాష్ట్ర ప్రయోజనాలు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారికి ముఖ్యమని తెలిపారు గత ప్రభుత్వంలో సజ్జల ప్రధాన సలహాదారునిగా ఉండేవారని సొంత పార్టీ వాళ్లే సజ్జల ను చీ కొట్టిన సిగ్గు లేదని సజ్జల చేస్తున్న వ్యాఖ్యల పట్ల ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని తెలిపారు కూటమి ప్రభుత్వానికి ప్రజల నుంచి వస్తున్న మద్దతును చూసి ఓర్వలేక సజ్జల మరియు వారి యొక్క వైసీపీ బ్యాచ్ అవాకులు చివాకులు మాట్లాడటం సరికాదని చెప్పారు సజ్జల సలహాలు తీసుకున్న జగన్మోహన్ రెడ్డి 151 సీట్ల నుండి పదకొండు సీట్లు దిగారని చెప్పారు అయినా వైసిపి నాయకులకు సిగ్గు రాలేదని చెప్పారు.

# కాలభైరవునికి విశేష పూజ కార్యక్రమం



**ఆళ్లగడ్డ జనవరి 11 ప్రజా జ్యోతి న్యూస్ :** ఆదివారం బహుళ అష్టమి సందర్భంగా చిన్న కందుకూరు గ్రామంలో వెలసిన కాలభైరవ స్వామికి,కాళికామాత అమ్మవారికి ఉదయం అధిక సంఖ్యలో భక్తులు, మహిళా మాతృమూర్తులు చేత అభిషేకాలు,విశేష పూలలంకరణ జరిగినది వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు మధ్యాహ్నం ఒంటిగంటకు అన్న ప్రసాద వితరణ దేవాలయ నిర్వహకులు నిర్వహించారు. శ్రీరామదండు భజన సంఘం (పుల్లయ్య )వారిచే భజన కార్యక్రమం నిర్వహించడం జరిగినది . ఈ కార్యక్రమం లో చిన్న కందుకూరు గ్రామ ప్రజలు మరియు దేవాలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొనడం జరిగింది.

# ఆళ్లగడ్డ లో ఫుట్బాల్ క్రీడాకారుల జట్ల ఎంపిక



**ఆళ్లగడ్డ ప్రజా జ్యోతి న్యూస్ జనవరి 11 :** ఆరోగ్య మే మహాభాగ్యం అని వ్యాయామం క్రీడల వల్ల దేహదారుద్యంతోపాటు ఆలోచన శక్తి మానసిక ఉల్లాసం పెరుగుతాయని ఆళ్లగడ్డ సర్వే డిప్యూటీ తహసిల్దార్ నర్సిరెడ్డి పేర్కొన్నారు ఈరోజు ఆళ్లగడ్డ పట్టణంలోనే వైపియం హై స్కూల్ క్రీడా మైదానంలో ఆంధ్రప్రదేశ్ ఫుట్బాల్ అసోసియేషన్ ఆదేశాల మేరకు నంద్యాల ఫుట్బాల్ అసోసియేషన్ వారు అండర్ 12 ఫుట్బాల్ క్రీడాకారుల ఎన్నిక ప్రక్రియను నిర్వహించారు ఆళ్లగడ్డ ఆర్ఆర్ అకాడమీ ఆధ్వర్యంలో దాదాపు ఆళ్లగడ్డ పట్టణంలోని 75 మంది విద్యార్థుల క్రీడా పరీక్షలు నిర్వహించి వారిలో నుండి 25 మంది క్రీడాకారులను గుర్తించారు వారికి ఆంధ్రప్రదేశ్ ఫుట్బాల్ అసోసియేషన్ ఆదేశాల మేరకు,, ఆర్ ఆర్ అకాడమీ ద్వారా ఉచిత క్రీడా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని సుబ్బరాయుడు తెలిపారు ఈ సందర్భంగా నంద్యాల జాంబో క్రీడా పరిషత్ స్టేట్ చైర్మన్ బాయకాటి ప్రహ్లాద, నంద్యాల ఫుట్బాల్ అసోసియేషన్ కోచ్ లు అఖిల్, సీనియర్ ఫుట్బాల్ గోల్ కీపర్ హుస్సేన్ లో పాల్గొని విద్యార్థులకు క్రీడా పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న డిప్యూటీ తహసిల్దార్ నర్సిరెడ్డి, అపుస్మ అధ్యక్షుడు అమిర్ భాషలు మాట్లాడుతూ విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో క్రీడలు కూడా అంతే ముఖ్యమని ఆళ్లగడ్డలో మెరికల్లాంటి క్రీడాకారులను తయారు చేస్తున్న ఆర్ఆర్ అకాడమీ కోచ్ సుబ్బారాయుడు నువారు సభాముఖంగా అభినందించారు. క్రీడల వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని ముఖ్యంగా ఇప్పుడు ప్రభుత్వం కూడా స్పోర్ట్స్ కోట కింద ఎన్నో ఉద్యోగాలను అందజేస్తుందని తెలిపారు. ఈ సెలక్షన్ పోటీలలో ఆరాధ అకాడమీ జాయింట్ సెక్రటరీ భువన శేఖర్ ,ఫిజికల్ డైరెక్టర్స్ పీవీఎం ప్రసాద్ రెడ్డి, ఎల్ ప్రతాప్, శ్రీనివాస్ రెడ్డి, బి శ్రీనివాసులు( సీనియర్ ఫుట్బాల్ క్రీడాకారుడు ) దివాకర్,, బాబు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రిని కలిసిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు

**బీరం జయరాం రెడ్డి**



**గోపవరం జనవరి 11 ( ప్రజా జ్యోతి న్యూస్) :** ఆదివారం మంగళగిరి లోని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కేంద్ర కార్యాలయంలో బద్వేలు తెలుగుదేశం పార్టీ మాజీ మండల అధ్యక్షుడు పూట్టాయిపల్లె పంచాయతీ బీరం జయరామిరెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా బద్వేలు నియోజకవర్గంలో ఉన్న ప్రస్తుత నాయకత్వ వైఫల్యం కారణంగా పార్టీని భూస్థాపితం చేసేలా పరిస్థితులు ఏర్పడ్డాయని ముఖ్యమంత్రిగారి దృష్టికి తీసుకువెళ్లారు.దీని ఫలితంగా బద్వేలు నియోజకవర్గంలో టిడిపి కార్యకర్తలు, నాయకులు, ఉద్యోగాలు చేసుకుంటున్న యువతపై రాజకీయ కక్షతో తప్పుడు, అక్రమ కేసులు నమోదు చేసి తీవ్రంగా వేధింపులకు గురిచేస్తున్న పరిస్థితి నెలకొని ఉందని వివరించారు.గత ˜ాుజా ప్రభుత్వ కాలంలో ఎదురైన ఇబ్బందుల కంటే, మన తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత బద్వేలు నియోజకవర్గంలో టిడిపి నాయకులపై పెట్టే అక్రమ కేసులు మరింతగా పెరిగిపోయిన దురదృష్టకర పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.అలాగే, బద్వేలు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ మనుగడ సాగాలంటే ప్రస్తుత నాయకత్వాన్ని మార్చి, సౌమ్యులు, టిడిపి కార్యకర్తలకు, నాయకులకు అండగా నిలుస్తున్న. ప్రజా నాయకుని ఎన్నుకుంటే మంచిది అని వివరించారు. బద్వేలు నియోజకవర్గంలో ఇలాగే కొన సాగితే టిడిపి పార్టీకి మనుగడ లేకుండా పోతుందని. టిడిపి సానుభూతిపరులు కార్యకర్తలు నాయకులు మన పార్టీకి దూర మవుతారని. టిడిపి కార్యకర్తలు మీద నాయకుల మీద టిడిపి వారే అక్రమంగా కేసులు బన యించే కార్యక్రమం ఇంతటితో ఆపితే. మంచిదని ఆయన అభిప్రాయం తెలియజేశారు. ఒకే పార్టీలో ఉండే కార్యకర్తలు ఒకరి మీద ఒకరు రాగ ద్వేషాలు రెచ్చగొట్టుకుంటూ. ఒకరంటే ఒకరికి గిట్టునట్టుగా ఉంటే.ప్రతిపక్ష పార్టీకి కార్యకర్తలకు నాయకులకు మన పై చులకన భావన ఏర్పడుతుంది ప్రజల్లో మన పార్టీపై నమ్మకాన్ని సన్నగిల్లుతాయి. భవిష్యత్తు లో మన పార్టీ బలోపేతానికి మనుగడ చాలా ఇబ్బందికరంగా ఏర్పడుతుంది. టిడిపి క్యాడర్ లో ఒకరంటే ఒకరు పోరుకు తలపడకుండా. సమస్యలు కాని ఉంటే సానుకూలంగా పరిష్కరించుకొని. టిడిపి పార్టీని నియోజకవర్గంలోని ప్రజల్లోకి తీసుకువెళ్లి. పార్టీని బలోపేతం చేయాలి. అంతేకానీ. మనమే మన పార్టీ వాళ్ళని ఇబ్బందులకు గురి చేస్తూ పోతుంటే. రేపు మన పార్టీ భవిష్యత్తు కార్యాచరణకు చాలా కష్టకాలంగా ఉంటుందని వివరించడం జరిగింది.ఈ అంశంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు సానుకూలంగా స్పందించి, బద్వేలు నియోజకవర్గంలో నమోదైన అక్రమ కేసులు, అలాగే ఇంచార్జి అంశంపై పూర్తిగా పరిశీలించి,పార్టీ ప్రతిష్టను కాపాడేలా, కార్యకర్తలకు న్యాయం జరిగేలా తగిన చర్యలు తప్పకుండా తీసుకుంటానని స్పష్టంగా హామీ ఇచ్చారు..

# జనసేన పార్టీలో చేరిన 50 కుటుంబాల సభ్యులు





**రుద్రవరం ప్రజా జ్యోతి న్యూస్ జనవరి 11 :** రుద్రవరం మండలం పెద్ద కంబలూరు, మజర గోనం పల్లె గ్రామానికి చెందిన నల్లబోతుల పెద్ద పుల్లయ్య వెంకటేశ్వర్లు శ్రీనివాసులు మల్లయ్య బాల మల్లయ్య, శీలం నర్సింహులు దాదాపు 50 కుటుంబాల సభ్యులు ఇరిగెల సోదరులకు మేళ తాళాలతో పూల వర్షంతో మహిళల సైతం స్వాగతం పలకడం జరిగింది. ఆళ్లగడ్డ తాలూకా జనసేన పార్టీ అధికారప్రతినిధి శ్రీ ఇరిగెల సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరడం జరిగింది. ఈ సందర్భంగా ఇరిగెల బ్రదర్స్ మాట్లాడుతూ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి వర్యులు శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలను నమ్మి మా పై నమ్మకంతో స్వచ్ఛందంగా జనసేన పార్టీలో చేరారని పార్టీలోకి చేరిన కుటుంబాలకు అండగా ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అలాగే త్వరలో జరగనున్న పంచాయతీ మున్సిపల్ జడ్పిటిసి ఎంపిటిసి ఎన్నికలలో జనసేన పార్టీ అభ్యర్థులను బరిలో నిలిపి తాలుకలో జనసేన పార్టీని బలోపేతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు ఇరిగెల రామచంద్రారెడ్డి, ఇరిగెల ప్రతాపరెడ్డి,ఇరిగేల సుధాకర్ రెడ్డి, జున్ను ప్రసాద్ రెడ్డి,రంగస్వామి, రుద్రవరం మండలం నాయకులు నాగలింగమయ్య గౌడ్,తాలూకా జనసేన పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు డాలు రత్నమయ్య, కౌన్సిలర్ గురుమూర్తిగారు మిద్దె రామ పుల్లయ్య తదితర జనసేన పార్టీ కార్యకర్తలు నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వీరుడికి ఘన నివాళులు



**డోన్ ప్రజాజ్యోతి :** ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామానికి ముందే బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడినరీ వీరుడు, గేరిల్లా యుద్ధ నిపుణుడు వడ్డే ఓబన్న వర్ధంతిని పురస్కరించుకొని, ఆయన త్యాగాన్ని స్మరించుకుంటూ ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన జయంతిని అధికారికంగా నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శాశ్వత ప్రభుత్వ ఉత్తర్వులు జీవో జారీ చేయడంతో ప్రతి సంవత్సరం జనవరి 11వ తేదీన నిర్వహించనున్నారు. వడ్డే ఓబన్న జనవరి 11న కర్నూలు జిల్లా రేనాటి ప్రాంతంలో జన్మించారు. ఓబన్న సంచార జాతి వడ్డెర కూలానికి చెందినవారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి ప్రధాన సేనాధిపతిగా, అనుచరుడిగా ఓబన్న కీలకపాత్ర పోషించారు. బ్రిటిష్ ఖజానాలపై దాడులు చేసి, గేరిల్లా పద్ధతుల్లో పోరాటం సాగించారు. బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ ఆధీనంలో ఉన్న సమయంలో, రేనాటి పాలేగాళ్లకు మరియు కంపెనీకి తవర్జీ అధికారాన్ని కంపెనీకి ఇచ్చినందుకు ప్రాధాన్యత.స్వాతంత్ర్య సమరయోధుడు, రేనాటి వీరుడు వడ్డె ఓబన్న తెల్లదొరల అణచివేతకు ఎదురొడ్డి సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచింది. ఓబన్న జయంతి సందర్భంగా వడ్డే సంఘం కార్యాలయం లో కుల సంఘము నాయకులు ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయన దేశభక్తి, త్యాగస్ఫూర్తిని భావితరాలకు గుర్తు చేయాలన్నారు. ఈ కార్యక్రమం లో ఆర్ డి ఓ నరసింహులు, డి.ఎస్.పి శ్రీనివాసులు, పట్టణ సిఐ ఇంతియాజ్ భాష, వడ్డే సంఘం అధ్యక్షుడు నాగరాజు, వడ్డే మారాజ్, వడ్డే వీరాంజనేయులు, మరియు వడ్డెర సంఘము నాయకులు, కుల బంధువులు అధికారులు పాల్గొన్నారు.

# కళాశాల పేద విద్యార్థులకు వసుధ ఫౌండేషన్ రూ.50వేల ఆర్థిక సాయం



**పాలకొల్లు. ప్రజాజ్యోతి రిపోర్టర్ కొట్టి రామం.జనవరి 11. :** పాలకొల్లు పరిసర గ్రామాలకు చెందిన కాలేజీ విద్య అభ్యసిస్తున్న ఎనిమిది మంది పేద విద్యార్థులకు రూ. 50వేల ఆర్థిక సాయంను వసుధ ఫౌండేషన్ అందచేసింది. వసుధ ఫౌండేషన్ ఇచ్చిన ఈ ఆర్థిక సాయం ను పాలకొల్లు క్షత్రియ పరిషత్ అధ్యక్షులు చేకూరి సూరిబాబు, వసుధ ఫౌండేషన్ కన్వీనర్ పెనుమత్స బుద్ధరాజు , మహమ్మద్ జానీ, చెరుకూరి సత్యనారాయణరాజు చేతుల మీదుగా ఆదివారం పాలకొల్లులో లబ్ధిదారులైన విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా క్షత్రియ పరిషత్ అధ్యక్షులు చేకూరి సూరిబాబు మాట్లాడుతూ పేద విద్యార్థులు, పేద రోగుల కోసం వసుధ ఫౌండేషన్ నిరంతరం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని అందిస్తూ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకటరామరాజుకు సూరిబాబు, జానీ, చెరుకూరి సత్యనారాయణరాజు, ఆర్థిక సహాయం అందుకున్న విద్యార్థులు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

# జనజీవన స్రవంతిలోకి మహిళా మావోయిస్టు మడకం మూడే

**మావోయిస్టు సిద్ధాంతాలపై విరక్తి**

**ఎటపాక పోలీస్ స్టేషన్‌లో అడిషనల్ ఎస్పీ (ఓఎస్‌డి) పంకజ్ కుమార్ మీనా ఎదుట లొంగుబాటు**

**అభివృద్ధి పథకాలకు ఆకర్షితురాలై నిర్ణయం**



**ఎటపాక,జనవరి 11 ప్రజాజ్యోతి:** మావోయిస్టు పార్టీ సిద్ధాంతాలు కాలగర్భంలో కలిసిపోతున్నాయని, అగ్రనేతల వివక్షను భరించలేకే బయటకు వచ్చానని సిపిఐ (మావోయిస్టు) పార్టీ సభ్యురాలు మడకం మూడే (25) పేర్కొన్నారు.ఆదివారం ఆమె అల్లూరి సీతారామరాజు జిల్లా అడిషనల్ ఎస్పీ (ఓఎస్‌డి) పంకజ్ కుమార్ మీనా ఎదుట పోలవరం జిల్లా,ఎటపాక పోలీస్ స్టేషన్లో లొంగిపోయారు.ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా కిందేర్లపాడ్ గ్రామానికి చెందిన మూడే గత ఐదేళ్లుగా పార్టీలో కీలక బాధ్యతలు నిర్వర్తించారు.2020లో కుంట ఏరియా కమిటీ ద్వారా మావోయిస్టు పార్టీలో చేరిన మూడే, తన పనితీరుతో 2021లో రెగ్యులర్ సభ్యురాలిగా పదోన్నతి పొందారు. అనంతరం మాడ్ డివిజన్‌లోని 32వ ప్లాటూన్, సప్లయ్ కంపెనీలో దళ సభ్యురాలిగా పనిచేశారు.2021 జూలైలో జరిగిన జీరగూడ (టేకులగూడెం) ఎన్‌కౌంటర్‌లో ఆమె పాల్గొన్నారు.31 మంది భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోయిన ఆ భీకర ఘటనలో ఈమె కీలక పాత్ర పోషించినట్లు పోలీసులు గుర్తించారు.లొంగుబాటుకు గల కారణాలను వివరిస్తూ..పార్టీలో గిరిజనేతర నాయకుల ఆధిపత్యం పెరిగిందని, అమాయక గిరిజన యువతను కేవలం వ్యక్తిగత పనుల కోసం వాడుకుంటున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు,ముఖ్యంగా ఏపీ పోలీసులు నిర్వహిస్తున్న 'పరివర్తన', 'స్ఫూర్తి--ప్రేరణ' వంటి కార్యక్రమాలు తనలో మార్పు తెచ్చాయని తెలిపారు."తుపాకీ గొట్టం ద్వారా ఏ మార్పు రాదని అర్థమైంది. అభివృద్ధి చెందుతున్న సమాజంలో గౌరవంగా బతకాలని నిర్ణయించుకున్నాను"అని మడకం మూడే అన్నారు.ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ పంకజ్ కుమార్ మీనా మాట్లాడుతూ,లొంగిపోయిన వారికి ప్రభుత్వం తరపున అన్ని పునరావాస సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.ఎవరైనా మావోయిస్టులు హింసను వీడి జనజీవన స్రవంతిలో కలవాలనుకుంటే నేరుగా లేదా బంధువుల ద్వారా పోలీసులను సంప్రదించవచ్చని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఎస్పి హేమంత్,ఎటపాక సీఐ యం.కన్నపరాజు,ఎస్సై జి.అప్పలరాజు,సిఆర్పిఎఫ్ 141 బెటాలియన్ అధికారులు,ఇతర పోలీస్ అధికారులు,ఎటపాక పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# జీపు జాతను బైకు ర్యాలీతో ఘనంగా స్వాగతం పలికిన సిపిఐ





**డోన్ ప్రజాజ్యోతి :** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 100 సంవత్సరాల వార్షికోత్సవాల సందర్భంగా నంద్యాల జిల్లాలో ప్యాపిలి నుండి ప్రారంభమైన ప్రచార జీపుజాత కు డోన్ లో బైక్ ర్యాలీతో ఘన స్వాగతం పలికిన పార్టీ శ్రేణులు. స్థానిక పాత బస్టాండ్ లో బహిరంగ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షతన సిపిఐ మండల కార్యదర్శి బి నారాయణ నిర్వహించారు.సిపిఐ ప్రచారజీపు జాతను ప్రారంభించిన ముఖ్య అతిధులు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ రామాంజనేయులు సిపిఐ ప్రచార జీపు జాతకు నాయకత్వం నిర్వహిస్తున్న సిపిఐ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ రంగ నాయుడు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కామ్రేడ్ బాబా ఫక్రుద్దీన్ జిల్లా కార్యవర్గ సభ్యులు పి సుంకయ్య రాధాకృష్ణ పాల్గొన్నారు.సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ రామాంజనేయులు మాట్లాడుతూభారతదేశాన్ని పాలిస్తున్న బ్రిటిష్ తెల్ల దొరల పాలనకు వ్యతిరేకంగా స్వాతంత్ర పోరాట కాలంలోనే 1925 డిసెంబర్ 26న కాన్పూర్ నగరంలో ఆవిర్భవించి సిపిఐ బ్రిటిష్ పాలకుల నిర్బంధాలను ఎదిరించి అనేక కుట్ర కేసులను ఎదుర్కొని ప్రాణత్యాగ్యాలు చేసి సంపూర్ణ స్వాతంత్రం కోసం పోరాటాలు చేసిన ఘనత సిపిఐ పార్టీకి ఉందని అన్నారు. నేడు దేశంలో కమ్యూనిస్టు పార్టీల ప్రజాస్వామ్యాన్ని కోరుకునే లౌకిక పార్టీలు పార్లమెంట్లో అసెంబ్లీలో ప్రాతినిధ్యం పూర్తిగా తగ్గిపోవడం వల్ల దేశ స్వతంత్ర పోరాట స్ఫూర్తి కి వ్యతిరేకంగా స్వాతంత్ర పోరాటంలో ఏమాత్రం పాల్గొనకుండా ఎలాంటి పాత్రలేని బిజెపి నేడు మతోన్మాద మనువాద భావజాలంతో దేశ ప్రజలు ఏర్పాటు చేసుకున్న భారత రాజ్యాంగం కు వ్యతిరేకంగా అన్ని ప్రభుత్వ రంగ సంస్థలను దేశ సహజ వనరులను దేశంలో కార్పొరేట్ కంపెనీలకు అప్పగించి శ్రమదోపిడీ చేసేందుకు సహకరిస్తున్న బిజెపి ప్రభుత్వ నికి వ్యతిరేకంగా సిపిఐ పార్టీ పోరాటాలకు సిద్ధం కావాలని ప్రతి సిపిఐ కార్యకర్త తెలంగాణ రాష్ట్రంలోఖమ్మం నగరములో జరిగే బహిరంగ సభకు తరలి రావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు మాట్లాడుతూ రైతాంగ కార్మిక పేద బలహీన దళిత గిరిజన మైనార్టీ మహిళలకు వ్యతిరేకంగా చట్టాలు చేస్తున్నారు. పోరాడి సాధించుకున్న అనేక చట్టాలను కాలరాస్తున్నారు. అందుకే ఈ నేపథ్యంలో సిపిఐ 100 సంవత్సరాల ముగింపు సభ పోరాటాల ఖిల్లా ఖమ్మం నగరంలో ఈనెల 18న లక్షలాది మందితో బహిరంగ సభ జరుగుతుంది అన్నారు. దేశంలో నెలకొని ఉన్న అత్యంత ప్రమాదకర మతోన్మాద కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య రాజ్యాంగాన్ని రక్షించుకోవడానికి సిపిఐ లక్షలాది మనతో బహిరంగ సభ నిర్వహించి అనంతరం ప్రజా ప్రయోజనాల పరిరక్షణ కోసం భారీ బహిరంగ సభ జరుగుతుందని అందుకే ప్రజలు ఈ సభలో పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరుతూ ప్రజలను సన్నద్ధం చేయడానికి సిపిఐ నంద్యాల జిల్లా సమితి ఆధ్వరంలో 2026 జనవరి 11 .12. 13 తేదీల్లో సిపిఐ జీపు జాత నిర్వహిస్తు ఈ జాతకు ప్రజల స్వాగతం పలికిన మండల సిపిఐ పార్టీ శ్రేణులు ప్రజా సంఘాలకు నాయకులకు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సభ్యులు సానుభూతిపరులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ పట్టణ కన్వీనర్ మోటా రాముడు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు పులి శేఖర్,జిల్లా సమితి సభ్యురాలు లక్ష్మదేవి, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు వాసు, పట్టణ కన్వీనర్ పుల్లయ్య,రామ్మోహన్ ఏఐటీయూసీ డోన్ నియోజకవర్గం అధ్యక్ష కార్యదర్శులు అన్వర్, అబ్బాస్ సిపిఐ నాయకులు వరదరాజు చేతివృత్తిదారుల సమాఖ్య జిల్లా కార్యదర్శి రామ్మోహన్ అఖిల భారత యువజన సమాఖ్య మండల కార్యదర్శి పృథ్వి కుమార్ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మనోహర్ ఏఐటీయూసీ నాయకులు సురేంద్ర మహిళా సమాఖ్య మండల అధ్యక్షురాలు ప్రమీలమ్మ నాయకులు వనం లక్ష్మదేవి శేఖర్ కార్మిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రజకులకు కేటాయించిన ధోబి ఘాటు స్థలాన్ని రజకులకే ఇవ్వాలి- సిపిఐ



**గోపవరం జనవరి 11 (ప్రజా జ్యోతి న్యూస్) :** ఆదివారం భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ బద్వేల్ పట్టణ సమితి ఆధ్వర్యంలో స్థానిక శివాలయం దగ్గర ఉన్న ధోబి గాట్ ను పరిశీలించడం జరిగింది.ఈ సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ బద్వేల్ పట్టణ కార్యదర్శిపి.బాలు మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు బద్వేలు మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 150 కుటుంబాల రజకులకు జీవనోపాధి కోసం దోబీ ఘాటును అప్పటి కలెక్టర్ గారు స్థానిక ఎమ్మార్వో గారు ఎకరా 20 సెంట్లు స్థలాన్ని కేటాయించి అక్కడ దోబీగాట్ ఏర్పాటు చేసి ఇవ్వడం జరిగిందని నేడు దాన్ని అధికారులు ఇతర అవసరాల కోసం ఉపయోగిస్తామని చెప్పడం సిగ్గుచేటని ధోబిగాట్ లేకుండా ఇతర అవసరాల కోసం చేయడం వల్ల 150 కుటుంబాలు వీధిలో పడతాయని పట్టణంలో రజకులు బట్టలు ఉతకడానికి వేరే ప్లేస్ లేదని ఉన్నదాన్ని అధికారుల నిర్లక్ష్యం వల్ల ఉపయోగంలో లేదని తక్షణమే అధికారులు ఆ దోబిగాట్ ను అభివృద్ధి చేసి రజకుల జీవనోపాధిని దృష్టిలో పెట్టుకోవాలని అధికారులకు సూచించడం జరిగింది . కాదు కూడదు అంటే మాత్రం రజక సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టాల్సి వస్తుందని వారన్నారు ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి పొంగూరు నాగరాజు, మాడపూర్ వెంకటసుబ్బయ్య, వెంకటరమణ, గొడ్లవీటి పెద్ద వెంగమ్మ తదితర రజక సంఘ నాయకులు మరియు చేతి వృత్తిదారుల సంఘ నాయకులు వెంకటరామయ్య.కోటయ్య తదితరులు పాల్గొన్నారు

# వైభవంగా సాగిన గండికోట ఉత్సవాల శోభాయాత్ర..!!







**జనవరి 11 డాక్టర్ ప్రతాప్ ప్రజా జ్యోతి కడప స్టాఫ్ రిపోర్టర్** గండికోట ఉత్సవాలు-2026 లలో భాగంగా ఆదివారం సాయంత్రం గండికోట సాంస్కృతిక, చరిత్రక కళా వైభవాన్ని ఉట్టిపడేలా.. కన్నుల పండుగగా అత్యంత వైభవంగా ఉత్సవ వాతావరణంలో ప్రారంభమైన శోభాయాత్ర. శోభాయాత్రలో పాల్గొన్న జిల్లా ఇంచార్జి మంత్రి, బీసీ సంక్షమ శాఖమంత్రి, రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్, జిల్లా కలెక్టర్, టూరిజం కౌన్సిల్ చైర్మన్ డా.శ్రీధర్ చెరుకూరి తోపాటు రాష్ట్ర ప్రభుత్వ విప్ సి.ఆదినారాయణ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఆదినారాయణ రెడ్డి, యువ నాయకులు భూపేష్ రెడ్డి తదితరులు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, జిల్లా ఇంచార్జ్ జేసీ విశ్వేశ్వర నాయుడు, రాజంపేట సబ్ కలెక్టర్ భావన, జెడ్పి సీఈవో ఓబులమ్మ, కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్డీవోలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, చంద్రమోహన్, చిన్నయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు. ఈ నెల 11, 12, 13 తేదీలలో మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా, కన్నుల పండుగగా ఉత్సవాల నిర్వహణకు నాందిగా ఉత్సవాల వైబ్స్ ను ప్రజల్లో మరింత ఉత్సాహాన్ని నింపేలా వివిధ రకాల సాంస్కృతిక అంశాలను పురాతన రాచరిక సంస్కృతిని గుర్తుచేసే వేషధారణలతో శోభాయాత్ర సాగింది.మన గత చరితక వైభవాన్ని, సంస్కృతి సంప్రదాయాలకు దర్పణం పట్టే.. గండికోట ఉత్సవాలు - 2026 లకు తరలి వచ్చిన సందర్శకులు, పర్యాటక ప్రియులు.. కుటుంబ సమేతంగా, బంధు మిత్రులతో తరలి వచ్చిన ప్రతి ఒక్కరూ శోభాయాత్రలో భాగస్వామ్యమై పారవశ్యం చెందారు. గత గండికోట రాచరిక, చారిత్రక వైభవాన్ని, అప్పటి సంస్కృతిని చూసిన అనుభూతిని పొందారు.

# సంక్రాంతి పండుగకు ఊరేళ్లేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

### సీఐ వెంకటరామి రెడ్డి ... యస్ఐ నాగార్జున







**ప్యాపిలి జనవరి 11 ప్రజాజ్యోతి:** పట్టణంలో ని ప్రజలు సంక్రాంతి పండుగకు ఊరేళ్లే వారు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ వెంకటరామి రెడ్డి, యస్ ఐ నాగార్జున తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఊరేళ్ళే వారు ఇంట్లో విలువైన వస్తువులను, నగదు ఉంచొద్దని, బ్యాంక్ లాకర్లలో జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని సూచించారు. బయటగేటుకు లోపల నుంచి తాళం వేయాలన్నారు. ఇంటి ముందు గదిలో లైట్ వేసి ఉంచాలని తెలిపారు. ఇంటి లో బీరువాల్లో బంగారు అభరణాలు, నగదును పెట్టొద్దని సూచించారు. ఇంటి ముందు ముగ్గులు వేసేటప్పుడు బంగారు అభరణాలు కనిపించకుండ చూసుకోవాలన్నారు. ఊరు వెళ్ళే ముందు స్థానికులకు, నమ్మకస్తులకు, పోలీసుస్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు. కాలనీలలో గుర్తుతెలియని వ్యక్తులు అనుమానస్పదంగా సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, లేదా 100కు సమాచారం ఇవ్వాలని సీఐ సూచించారు.సంక్రాంతి పడుగ జరుపుకోవటానికి సొంత ఊరుకు వెళ్లే వారు తమ ఇళ్లలో దొంగతనాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.

# కోడి పందాలు, జూదం నిర్వహించినా, పందెం బరులు ఏర్పాటు చేసినా కఠిన చర్యలు

### వై.ఎస్.ఆర్ కడప జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐ.పి.ఎస్.





**జనవరి 11 డాక్టర్ ప్రతాప్ ప్రజా జ్యోతి కడప స్టాఫ్ రిపోర్టర్ :** సంక్రాంతి పండుగ సందర్భంగా జూదం, కోడి పందాలు మరియు గుండాట తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని వై.ఎస్.ఆర్ కడప జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐ.పి.ఎస్ హెచ్చరించారు. ఆదివారం జిల్లా ఎస్పీ ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. కోడిపందేలు, జూదం జరిగే అవకాశమున్న అనుమానిత ప్రాంతాల్లో అత్యాధునిక డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా ఉంచడం జరుగుతుందని, వారిపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయడం జరుగుతుందని జిల్లా ఎస్.పి తెలిపారు.జూదం, కోడి పందేలు, గుండాట, అక్రమ మద్య విక్రయాలు, మద్యం అక్రమ రవాణా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, మద్యం సేవించి వాహనాలు నడిపే వారి పైన కఠినంగా వ్యవహరించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కోడి పందేల బరులు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో గల పోలీసు అధికారులు, సిబ్బంది జూదం, కోడి పందాలు చట్టరీత్యా నిషేధం అని తెలియజేస్తూ అటువంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. కోడి పందేల నిర్వహణ వేదికలకు ఎవరైనా తోటలు, స్థలాలు ఇస్తే వారిపై కూడా కేసులు నమోదు చేయడం జరుగుతుందని జిల్లా ఎస్.పి హెచ్చరించారు. జిల్లాలో ఏ ప్రాంతంలోనైనా కోడి పందేలు జరుగుతున్నా, జరిగే వీలున్నా వెంటనే డయల్ - 112 కు ఫోన్ చేస్తే తక్షణం చర్యలు తీసుకుంటామన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. మండల స్థాయిలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించేందుకు అవకాశం ఉన్న ప్రాంతాలను ముందుగా గుర్తించి తనిఖీలు, దాడులు నిర్వహించనున్నట్లు ఎస్.పి తెలిపారు. ఇప్పటికే జిల్లాలో ఉన్న పోలీసు అధికారుల కు దాడులు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించడం జరిగిందని జిల్లా ఎస్.పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐ.పి.ఎస్ తెలిపారు.

# ఒంటిమిట్ట కోదండ రాముని దర్శించుకున్న పలువురు ప్రముఖులు!



**జనవరి 11 డాక్టర్ ప్రతాప్ ప్రజా జ్యోతి కడప స్టాఫ్ రిపోర్టర్ :** కడప జిల్లా ఒంటిమిట్ట శ్రీ కోదండరామలయాన్ని సందర్శించిన రాష్ట్ర పర్యాటక శాఖ మరియు సినిమాటోగ్రఫీ శాఖ మాత్యులు కందుల దుర్గేష్ అలాగే రాజంపేట జనసేన పార్టీ పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ. కడప జిల్లా ఒంటిమిట్ట మండలం నందు వైసిపి పార్టీకి చెందిన నాయకులు భారీ ఎత్తున రాజంపేట జనసేన పార్టీ పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ సారాధ్యంలో జనసేన పార్టీలో చేరుతున్న సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర పర్యాటక శాఖ, సినిమాటోగ్రఫీ శాఖ మాత్యులు మొదటగా జనసేన పార్టీ ఏర్పాటు చేసిన బైక్ ర్యాలీలో పాల్గొని తదనంతరం కోదండ రామాలయానికి చేరుకోగా పూజారులు మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు అలాగే కూటమి నాయకులు జనసేన కార్యకర్తలు పెద్ద ఎత్తున బైక్ ర్యాలీలో పాల్గొని ఆ యొక్క కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాలి...

### మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర.



**జనవరి 11 డాక్టర్ ప్రతాప్ ప్రజాజ్యోతి కడప స్టాఫ్ రిపోర్టర్ :** గ్రామీణ క్రీడలైన కబడ్డీ తదితర లాంటి క్రీడలను ప్రోత్స హించాలని మైదుకూరు మున్సిపల్ చైర్మన్ మాచు నూరు చం ద్ర పేర్కొ న్నా రు . సంక్రాంతి ఉత్సవా లు పురస్కరించుకొని ఆది వారం నుంచి మూడు రోజులు పాటు స్టార్ అసోసియన్ వారి ఆధ్వర్యంలో మైదుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో నిర్వహిస్తున్న కబడి క్రీడా పోటీలను మాచనూరు చంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో పా ల్గొనే ఆటగాళ్లు బేష జాలలకు పోకుండా క్రీడా స్ఫూర్తితో ఆడి రాణించాలని భవిష్యత్తులో మంచి క్రీడాకారులుగా ఎదగాలని ఆయన ఆకాంక్షంచారు భవిష్యత్తులో నిర్వహించే క్రీడా పోటీల్లో తన వంతు సహకారం అందిస్తాని మాచనూర్ చంద్ర తెలిపారు. అనంతరం ఉపా ధ్యాయుడు ఏపీ శ్రీనివాసులు మాట్లాడుతూ ఉత్సాహభరితంగా సాగే ఈ పోటీల్లో ఆటగాళ్లు మంచి క్రీడా నైపుణ్యం ప్రదర్శించాలని ఆకాంక్షంచారు .విజేతలకు దాత మున్సిపల్ చైర్మన్ మాచనూర్ చంద్ర ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేస్తారని ఆయన తెలిపారు. అనంతరం పోటీలను మాచనూరు చంద్ర చేతుల మీదుగా పూజా కార్యక్రమంలో నిర్వహించి పోటీలను ప్రారంభించారు ఈ సందర్భంగా క్రీడాకారులను ఆయన పరిచయం చేసుకొని వారితోపాటు ఆయన కొద్ది కబడ్డీ ఆడారు. కార్యక్రమంలో నిర్వాహకులు స్టార్ అసోసియేషన్ ప్రతినిధులు, షౌకత్ ఆలీ ,తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాకు వర్ష సూచనతో .. శనగ రైతుల గుండెల్లో దడ!!



**జనవరి 11 డాక్టర్ ప్రతాప్ ప్రజా జ్యోతి కడప స్టాఫ్ రిపోర్టర్ :** కడప జిల్లాలోని జమ్మలమడుగు పెద్దముడియం, రాజుపాలెం, కమలాపురం, వీరాపునాయని పల్లె, ముద్దనూరు, కొండాపురం తదితర మండలాలలో రబీ సీజన్లో వేలాది ఎకరాలలో రైతులు శనగ పంటలు సాగు చేశారు. పంటలు పైకి బాగా కనిపిస్తున్నా బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో చిరుజల్లులు కురుస్తున్నాయి. ఈ వర్షానికి ఈ పంటలకు పులుపు పోతుందని పూత, పిందె రాలుతుందని రైతులు దిగాలు చెందుతున్నారు.

## గుడిబండకు అన్న క్యాంటీన్ మంజూరు చేయాలి: ప్రజల వినతి

**మడకశిర, ఇంచార్జ్ జనవరి 11 (ప్రజా జ్యోతి):** గుడిబండ మండల కేంద్రానికి అన్న క్యాంటీన్ మంజూరు చేయాలని స్థానిక ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రతిరోజూ వందలాది మంది మహిళలు, పేద ప్రజలు బ్యాంకులు, తహసిల్దార్ కార్యాలయం, ఎంపీడీవో, పోలీస్ స్టేషన్, ఆర్డిటి వంటి కార్యాలయాల్లో పనుల నిమిత్తం గుడిబండకు వస్తున్నారు.అయితే, మధ్యాహ్న భోజనానికి హోటళ్లలో ఖర్చు చేయలేని స్థితిలో ఉన్న పేద ప్రజలు ఆకలితోనే తిరిగి వెళ్తున్న పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో, గుడిబండలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాలని ప్రజలు, విద్యావంతులు, మేధావులు సమావేశమై చర్చించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మడకశిర అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్న మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి ప్రత్యేక చొరవ తీసుకొని గుడిబండకు అన్న క్యాంటీన్ మంజూరుకు కృషి చేయాలని కోరారు. ఈ మేరకు ఆయనకు వినతిపత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో మండల మైనారిటీ నాయకుడు షబ్బీర్, తిప్పేస్వామి, రంగనాథ్, నాగరాజు, లోకేష్,హనుమంతరాయుడు, కరిలింగ, రాజ్ కుమార్, ఆనంద్ కుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## కంటైనర్లలో అక్రమంగా ఆవుల తరలింపు



**ఆళ్లగడ్డ ప్రజా జ్యోతి న్యూస్ జనవరి 11 :** శనివారం రాత్రి అక్రమంగా కంటైనర్లలో గోమాతలను తరలిస్తున్నారు అన్న సమాచారం రావడంతో రాత్రి 12 గంటలకు ఆళ్లగడ్డ ఆల్ఫా కాలేజ్ వద్ద ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ , మరియు భూమా జగత్ అక్కడికి వెళ్లి కంటైనర్లను ఆపి ఆవులను ఆళ్లగడ్డ రూరల్ స్టేషన్ కు తరలించడం జరిగింది.ఆళ్లగడ్డ టిడిపి యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి ఆదివారం ఉదయం ఆళ్లగడ్డ డిఎస్పి ప్రమోద్ ని కలిసి వివరాలు తెలుసుకుని కంటైనర్లతో ఆవులను నందికొట్కూరు గోశాలకు తరలించడం జరిగింది.ఈ రవాణా అనేది ఆళ్లగడ్డ హైవే లో ఎక్కువగా జరుగుతుందని గోవులను పూజించాల్సింది పోయి ఇలా హింసించడం తగదు అని, దీని వెనుక ఎంతటి వారు ఉన్నా కూడా కచ్చితంగా కఠిన చర్యలు తీసుకుంటామని, ఈ విషయంపై మంత్రి నారా లోకేష్ అన్న తో మాట్లాడడం జరిగిందని ఈ స్కామ్ లో ఉన్న ప్రతి ఒక్కరిని కఠినంగా శిక్షస్తామని టిడిపి యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి తెలిపారు.
ఆ కంటైనర్ లో దాదాపు 200 లకు పైగా ఆవులు ఉన్నాయని వీటన్నిటి సంరక్షణ కోసమే నందికొట్కూరు గోశాలకు తరలించడం జరిగిందని తెలియజేశారు.

## పెనుగొండ ఎస్వికెపి కళాశాలలో స్వర్ణోత్సవ వేడుకలు



**వాసవి పెనుగొండ, (ప్రజా జ్యోతి ) జనవరి 11:** పెనుగొండ ఎస్వికెపి కళాశాలలో స్వర్ణోత్సవ వేడుకలు రెండవ రోజు ఆదివారం ఘనంగా జరిగాయి. రాష్ట్ర నలుమూలలతో పాటు దేశ విదేశాలలో స్థిరపడిన పూర్వ విద్యార్థుల హాజరై ఆనాటి కళాశాల రోజులు స్మృతులను గుర్తుకు తెచ్చుకున్నారు. ఈ కార్యక్రమానికి వివిధ హోదాల్లో ఉన్నవారు వచ్చి తమ అనుభవాలను వెల్లడించారు. 1988-91 విద్యా సంవత్సరంలో బిఏ చదివిన ప్రస్తుత హైకోర్టు అసిస్టెంట్ రిజిస్టర్ కేజే. రాజబాబు, కాకినాడ ఇంటిలిజెన్స్ డి.ఎస్.పి. పి. ఈశ్వరుడు మాట్లాడుతూ ఆనాటి ప్రిన్సిపాల్ గుబ్బల తమ్మయ్య క్రమశిక్షణ తమ జీవితాలకు మార్గదర్శకంగా నిలిచిందన్నారు. అదే సమయంలో సంస్కరణ, సభ్యత, గౌరవం వంటి విలువలు నేర్చుకున్నామన్నారు. ఆ విలువలే నేటి ఉన్నత స్థాయికి చేరుకోవడంలో తోడ్పడ్డాయని అన్నారు. విద్యార్థి దశలో పొందిన క్రమశిక్షణ నైతిక విలువలు వృత్తి జీవితంలో ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఇప్పుడు చదువుతున్న విద్యార్థులు గురువులు, తల్లిదండ్రుల పట్ల గౌరవంతో మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమం పూర్వ విద్యార్థుల మధ్య ఆత్మీయతను పెంచుతూ జ్ఞాపకాలతో మధురంగా నిలిచాయని తెలిపారు.

# పులివెందుల బస్టాండ్ లో ఘనంగా ఏపీఎస్ఆర్టీసీ 68వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు.

### ఏపీఎస్ఆర్టీసీ ఫౌండేషన్ డే సందర్భంగా సారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి దివ్యాంగులకు దుస్తుల వితరణ.

### మహిళలకు ఉచిత ప్రయాణం -ఆర్టీసీ సంస్థ ఔదార్యం.

### -డిపోమేనేజర్ ప్రేమ్ కుమార్



**జనవరి 11 డాక్టర్ ప్రతాప్ ప్రజా జ్యోతి కడప స్టాఫ్ రిపోర్టర్** ప్రపంచంలోనే ప్రభుత్వ రంగంలో నడుస్తున్న అతిపెద్ద రోడ్డు రవాణాసంస్థగా గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ లో పేరు నమోదుచేసుకున్న ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రోడ్డురవాణా సంస్థను ప్రజలు ఆదరించాలని, ఉద్యోగులు కష్టపడి పనిచేసి, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి, తద్వారా రాబోయే తరాలకు, నూతన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించేలా , ప్రతి ఉద్యోగ, కార్మిక సోదరుడు శక్తివంచన లేకుండా కృషి చేయాలని, స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత రవాణా సదుపాయమే కాకుండా, ముఖ్యమంత్రి ఆదేశాలతో త్వరలో దివ్యాంగులకు కూడా ఉచిత రవాణా సౌకర్యం కల్పించబోతున్నామని, ఏపీఎస్ఆర్టీసీ పులివెందుల డిపో మేనేజర్ ప్రేమ్ కుమార్ పేర్కొన్నారు. ఏపీఎస్ఆర్టీసీ 68వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని, ఆర్టీసీ మాజీ ఉద్యోగి, ప్రముఖ వ్యాపారవేత్త సారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పులివెందుల ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఏర్పాటుచేసిన ఒక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిపో మేనేజర్, సహఉద్యోగులతో కలిసి సంస్థ ఫౌండేషన్ డే కేక్ కట్ చేసి కార్మికులకు, దివ్యాంగులకు అందించారు. అనంతరం సారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి సమకూర్చిన దుస్తులను వికలాంగులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా, సాధారణ ఉద్యోగిగా జీవితాన్ని ప్రారంభించి, స్వయంకృషితో ప్రముఖ రాజకీయ, వ్యాపారవేత్తగా ఎదిగిన చంద్రశేఖరరెడ్డిని ఉద్యోగులు దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. తదనంతరం ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులకు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ, 1932లో నిజాం రాష్ట్ర రైల్వే రోడ్డురవాణా సంస్థగా కేవలం మూడు డిపోలు, 27 బస్సులు, 166 మంది కార్మికులతో ప్రారంభమైన ఆర్టీసీ ప్రస్థానం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆవిర్భావంతో 1958 జనవరి 11న ఏపీఎస్ఆర్టీసీ గా రూపాంతరం చెంది, దినదినాభివృద్ధి చెందుతూ, నేడు 11 వేలకు పైగా బస్సులతో, 55 వేల మందికి పైగా సిబ్బందితో , 128 డిపో లతో, 12 రీజియన్లు, 4 జోన్లతో, రోజుకు 72 లక్షల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేస్తూ, సగటున రోజుకు 44 లక్షల కిలోమీటర్లు ప్రయాణిస్తూ, రోజుకు 1 కోటి, 84లక్షల ఆదాయం సంపాదిస్తూ, ప్రపంచంలోనే నెంబర్ వన్ స్థానంలో ఉన్న మాతృసంస్థను మనందరం కాపాడుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల నెట్ వర్క్ రాష్ట్రఅధ్యక్షులు డాక్టర్ ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ మేనేజర్ కుళ్లాయప్ప, ఆర్టీసీ ఉద్యోగ నాయకులు, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రమదాన యజ్ఞం... రూపు రేఖలు మారిపోయిన అహోబిలం కోనేరు







### స్వచ్ఛత కార్యక్రమాలలో స్వయంగా పాల్గొన్న ఎమ్మెల్యే అఖిలప్రియ

**ఆళ్లగడ్డ ప్రజా జ్యోతి న్యూస్ జనవరి 11 :** స్వచ్ఛ అహోబిలం కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ ఇలాంటి సామాజిక కార్యక్రమాల పట్ల ముందుకు రావాలని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పిలుపునిచ్చారు. ఆదివారం రోజు ఎగువ అహోబిలం ఆలయ కోనేరు శుభ్రత కార్యక్రమంలో ఆమె స్వయంగా విద్యార్థులు అధికారులతో కలిసి శ్రమదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పురాతన క్షత్రమైన అహోబిలంలో ఈ విధంగా అందరికీ ఉపయోగపడే కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో సంతృప్తిని ఇచ్చిందని తెలిపారు. అహోబిల మఠం అధికారులు స్వచ్ఛతా కార్యక్రమాల అనంతరం కోనేరు నిర్వహణను సక్రమంగా నిర్వహించే బాధ్యత తీసుకోవాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సూచించారు. తాము ఒక పిలుపు ఇవ్వగానే ఇంత పెద్ద సంఖ్యలో శ్రమదాన యజ్ఞంలో పాల్గొన్నవిద్యార్థిని విద్యార్థులకు డిగ్రీ కళాశాల ఉపాధ్యాయులకు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ కృతజ్ఞతలు తెలిపారు.

# గండి కోట ఉత్సవాల లో ఘనంగా...ప్రధాన వేదిక వద్ద ప్రారంభమైన ఉత్సవాల కోలాహలం!







### జ్యోతి ప్రజ్వలన.ప్రార్థనా గీతం తో ప్రారంభమైన కార్యక్రమాలు..

**జనవరి 11 డాక్టర్ ప్రతాప్ ప్రజా జ్యోతి కడప స్టాఫ్ రిపోర్టర్ :** గండికోట ఉత్సవాలకు ముఖ్య అతిధులు గా జిల్లా ఇంచార్జి మంత్రి, బీసీ సంక్షమ శాఖమంత్రి, రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్, జిల్లా కలెక్టర్, టూరిజం కౌన్సిల్ చైర్మన్ డా.శ్రీధర్ చెరుకూరి, ఎస్పీ విశ్వనాథ్ నచికేత్ తో పాటు రాష్ట్ర ప్రభుత్వ విప్ సి. ఆదినారాయణ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఆదినారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. వీరితో ప్రముఖ సినీ గీత రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు గేయాలాపన, చరిత్రకారులు డా. సగిలి సుధారాణి, తవ్వ ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రజలు కూడా పెద్ద ఎత్తున పాల్గొని గండికోట ఉత్సవాలలో తమ సంతోషాన్ని పాలుపంచుకుంటున్నారు.

# వచ్చే నెలలో సూర్యలంకలో టూరిజం హౌస్ బోట్లు ప్రారంభం

## ఫీల్డ్ సర్వే నిర్వహించిన జిల్లా కలెక్టర్ డా. వినోద్ కుమార్ వాసుదేవ



**బాపట్ల జనవరి 11 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి) :** ఏపీటిడీసీ ఆధ్వర్యంలో బాపట్ల మండలం సూర్యలంక బీచ్ పరిసరాల్లో టూరిజం హౌస్ బోట్లు త్వరలో ప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. వినోద్ కుమార్ వాసుదేవ ఐఏఎస్ తెలిపారు .హౌస్ బోట్ల ప్రారంభానికి ముందస్తు చర్యల్లో భాగంగా ఆదివారం సూర్యలంక ఆదర్శ నగర్ వంతెన నుంచి నిజాంపట్నం ఫిషింగ్ హార్బర్ వరకు మోటారైజ్డ్ బోటులో జిల్లా కలెక్టర్ ట్రయల్ రన్ నిర్వహించి ఫీల్డ్ సర్వే చేశారు. ఈ సందర్భంగా పేరాలి డ్రెయిన్, పొగరు, కెనాల్ పరిసర ప్రాంతాల పరిస్థితులను పరిశీలించారు. పర్యాటక, పంచాయతీ రాజ్, జలవనరులు, అటవీ, అగ్నిమాపక శాఖల అధికారులతో కలిసి బోటు ప్రయాణం సాగించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పొగరు వద్ద పర్యాటకుల కోసం వాక్‌వేలు ఏర్పాటు చేయాలని, ఆదర్శ నగర్ వద్ద జెట్టి నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదర్శ నగర్ నుంచి నిజాంపట్నం వరకు కెనాల్ చుట్టూ సుందరీకరణ పనులు చేపట్టి, పర్యాటకులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని టూరిజం అధికారులకు సూచించారు.ఫిబ్రవరిలో ఒక గంట ప్రయాణ సామర్థ్యం గల బోట్లతో పాటు ఆరు బెడ్స్ సామర్థ్యం గల ఒక హౌస్ బోటు, రెండు బెడ్స్ సామర్థ్యం గల మరో హౌస్ బోటును ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు.ప్రయాణ సమయంలో పెద్దపులుగువారిపాలెం వద్ద చేపల వేట సాగిస్తున్న కర్లపాలెం మండలం తుమ్మలపల్లి గ్రామానికి చెందిన మత్స్యకార దంపతులు నక్క శ్రీను--వెంకటేశ్వరమ్మలను కలెక్టర్ కలుసుకుని వారి జీవన పరిస్థితులు, ఆదాయం, వైద్య సదుపాయాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే నిజాంపట్నం ఫిషింగ్ హార్బర్‌లో మత్స్యకారులతో చేపల మార్కెటింగ్ సౌకర్యాలు, సముద్రంలో వేట సమయంలో ఎదురయ్యే సమస్యలు, భద్రతా అంశాలపై చర్చించారు.ప్రతిపాదిత ఆక్వా టూరిజం పార్క్‌ను వేగంగా అభివృద్ధి చేసి స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏపీటిడీసీ విజయవాడ జనరల్ మేనేజర్ నాంచారయ్య, డీపీఓ ఎల్. ప్రభాకర్ రావ్, జలవనరుల శాఖ ఈఈ ధనలక్ష్మి , జిల్లా అగ్నిమాపక అధికారి కె. వినయ్, బాపట్ల తహసీల్దార్ సలీమా, ఎంపీడీఓ బాబురావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎస్ వి కె పి కళాశాలలో గోల్డెన్ జూబ్లీ రెండవ రోజు వేడుకలు



**వాసవి పెనుగొండ,( ప్రజా జ్యోతి ) జనవరి– 11: ఆంధ్రప్రభ** పెనుగొండ ఎస్.వి.కె.పి విద్యాసంస్థల స్వర్ణోత్సవ స్వర్ణోత్సవ వేడుకలలో భాగంగా రెండవ రోజు సుమారు 6000 పైగా పూర్వ విద్యార్థులు హాజరు అయ్యారు. ఆదివారం కళాశాల సెమినార్ హాల్ నందు ఉన్నత విద్యారంగం ఎదుర్కొంటున్న సవాళ్లు పరిష్కారాలు అనే అంశంపై జాతీయ సదస్సు జరగగా దీనికి సభ అధ్యక్షులుగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.వి.వి. అప్పారావు అధ్యక్షత వహించి తొలి పలుకులుగా కాలశాల స్థాపించినది మొదలుకొని ఈరోజు వరకు కళాశాల అభివృద్ధికి మేనేజ్మెంట్ పూర్తి సహాయ సహకారాలు అందిస్తూ ప్రతీ కోర్సును అన్ని కళాశాల కంటే ముందుగా తీసుకొచ్చి ఈ కళాశాలలో ప్రవేశపెట్టడం జరుగుతోందని, ఉన్నత విద్యా బోధనకై ప్రిన్సిపాల్స్ మరియు అంకిత స్వభావం కలిగిన అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది కృషి వల్ల ఇది సాధ్యమైనదని తెలుపుతూ గతకాలానికి ఈ కాలానికి విద్యార్థుల ఆలోచన విధానం మార్పులు వల్ల ఉన్నత విద్య యందు కొన్ని సమస్యలు ఉన్నవని ప్రభుత్వ విధానంలో కూడా మార్పులు రావడంతో ప్రస్తుతం ఉన్నత విద్య రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు దానికి పరిష్కారాల సూచనకై సదస్సు ఏర్పాటు చేయడం జరిగిందని వక్కాణించారు. అంతకుముందు జ్యోతి ప్రజ్వలన చేయగా దానియందు ముఖ్య అతిథులుగా విచ్చేసినటువంటి కళాశాల పాలకవర్గ అధ్యక్షులు తాడి నాగిరెడ్డి, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ కె. రామచంద్రరాజు, రీజినల్ జాయింట్ డైరెక్టర్ చప్పడి కృష్ణ, ఏ.ఎస్.ఎన్.ఎమ్. గవర్నమెంట్ కాలేజ్ ప్రిన్సిపాల్ శ్రీమతి రాజేశ్వరి, కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ తంత్రవాది శ్రీనివాస్, శివనడార్ యునివర్సిటి ప్రొఫెసర్ జయదేవ్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కొల్లి వెంకట సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. తదుపరి రీజనల్ జాయింట్ డైరెక్టర్ చప్పడి కృష్ణ, మాట్లాడుతూ అందరికీ సమగ్ర విద్య అనే నినాదంతో 1974లో ఈ కళాశాల ప్రారంభించబడింది, ఉన్నత విద్యారంగంలో ఈ కళాశాల చాలా ముందుగా ఉంటూ వైవిధ్యభరమైన విద్యను అందిస్తూ నాణ్యత, మౌలిక సదుపాయాలు మెండుగాగల కళాశాల అని కొనియాడారు. ప్రస్తుత విద్యా రంగంలో కొన్ని సమస్యలు ఉన్నవని-నా ణ్యత గల అధ్యాపకుల కొరత, పరిశోధన రం గంలో ఆసక్తి లేకపోవడం, మౌలిక సదుపా యాల కొరత, ఆర్థిక ఇబ్బందులు వంటి సమస్యలను పేర్కొంటూ జాతీయ విద్యా విధానం-2020 తో దానిని అధిగమించవచ్చునని దానిలో భాగంగా మల్టిపుల్ ఎంట్రీ మరియు మల్టిపుల్ ఎగ్జిట్, నైపుణ్యాభివృద్ధి గల కోర్సులు, అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల స్థాపన తో పాటు స్వయం, మూక్స్ వంటి ఆన్-లైన్ కోర్సులు పెట్టినట్లయితే సమస్యలను అధిగమించవచ్చునని పేర్కొన్నారు. పాలకొల్లు ఏఎస్ఎన్ఎల్ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీమతి రాజేశ్వరి మాట్లాడుతూ స్వయం వంటి కోర్సులను ప్రవేశపెడుతూ డిజిటల్ విధానాల్లో విద్యాబోధన జరిగినట్లయితే విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని ప్రస్తావిస్తూ, క్వాంటం టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి కోర్సుల ప్రాముఖ్యతను వివరించారు. శివనాడార్ యూనివర్సిటీ ప్రొఫెసర్ జయదేవ్ మాట్లాడుతూ తాను 25 సంవత్సరాల క్రితం ఇదే కళాశాలలో చదివానని ఆ తర్వాత స్వర్ణోత్సవ వేడుకలలో భాగంగా మరలా ఇప్పుడు రావటం ఆనందదాయకంగా ఉందని చెబుతూ ప్రస్తుత ఉన్నత విద్యా విధానంలో తగిన సూచనలలో భాగంగా ప్రాథమిక విజ్ఞానం నైపుణ్యాభివృద్ధి , ప్రత్యేకత సాధనకై విద్యార్థులు కృషి చేస్తూ ఉపాధి అవకాశాల పొందటంలో ఎడాప్టబిలిటీ మరియు పరిశోధన నవ కల్పనలు సాగించాలని తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ మరియు సెక్రెటరీ డాక్టర్ కలిదిండి రామచంద్రారాజు మాట్లాడుతూ ఉన్నత విద్య యొక్క ఉపయోగాన్ని వివరిస్తూ విద్యా అనేది కేవలం విషయపరిజ్ఞానాన్ని తెలుసుకోవటానికే గాని సంపాదన మార్గంగా కాకూడదని, విద్యా విషయాలు తెలుసుకోవడం అనేది లైఫ్ లాంగ్ ప్రక్రియ అని చెపుతూ ఉన్నత విద్యా విధానం మరియు పరిశోధన పంటి విషయాలపై ప్రతి విద్యార్థి ఆలోచన చేసి తదనగుణంగా తన యొక్క విద్యను కొనసాగించాలని సూచించారు. కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ గుబ్బల తమ్మయ్య మాట్లాడుతూ తాను విద్యారంగానుండి రిటైర్ అయ్యి 20 సంవత్సరాలు అయినప్పటికీ ఉన్నత విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యల పట్ల కొంత అవగాహన ఉన్నదని అది- అధ్యాపకుల కొరత, కొన్ని కోర్సులు ప్రైవేటు విద్యా సంస్థలకు బదలాయించటం, మౌలిక సదుపాయాలు కల్పనలో సరియైన శ్రద్ధ లేకపోవడం వంటివి ముఖ్య సమస్యలను చెబుతూ, ఆంధ్ర విశ్వావిద్యాలయ మొదటి వైస్ ఛాన్సర్ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చెప్పినట్లుగా ఒక దేశ అభివృద్ధి క్లాస్ రూములలోనే నిర్మితమవుతుందని వక్కాణించారు. అంతేకాక భారతదేశ తొలి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ దేశ అభివృద్ధి రోడ్లపై కాదు క్లాస్ రూమ్ లోనే నిర్మితమవుతుందని తెలిపారు. నిజమైన గురువు సంతోషించేది తాను విద్యార్థి వద్ద విద్యా విషయాలలో ఓడిపోవడమే అందుకోసం విద్యాలయాలలో ఉన్నత విద్య మెరుగుపట్ల ప్రభుత్వం శ్రద్ధ పెట్టాలని సూచించారు. జాతీయ కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సర్ డాక్టర్ శ్రీనివాసన్ కీలకోపన్యాసం చేయటానికి ముందు నేను ఇదే కళాశాలలో చదువుకున్న విద్యార్థిగా గర్వపడుతున్నానని 1968 లో మొట్టమొదటి విద్యా విధానం కొఠారి కమిషన్ సూచించిన విద్యా విధానం నుండి 2020 జాతీయ విద్యా విధానం వరకు వచ్చిన మార్పులను సమగ్రంగా వివరిస్తూ 2020 జాతీయ విద్యా విధానంలో ప్రత్యేకంగా ఒకే విద్యా విషయంపై విద్యార్థులు జ్ఞానాన్ని సమపార్జన చేస్తే సరిపోదని వివిధ సబ్జెక్టులకు సంబంధించిన విషయ పరిజ్ఞానం కూడా నేర్చుకున్నప్పుడే ప్రస్తుత పోటీ ప్రపంచంలో ముందుకు సాగగలరని తెలుపుతూ అందుకే మేజర్-మైనర్ సబ్జెక్టులను ప్రవేశపెట్టడం, స్కిల్ కోర్సులను ప్రవేశపెట్టడం వ్యాల్యూ ఆడెడ్ కోర్సులను ప్రవేశపెట్టడం జరిగిందని చెప్పారు. 2020 జాతీయ విద్యా విధానం 10 సంవత్సరాల పాటు అమలులో ఉంటుందని ప్రస్తుతం ఐదు సంవత్సరాలు గడిచాయని దీనిలోని లోటుపాకులను సవరించుకుంటూ మరొక ఐదు సంవత్సరాలు ముందుకు సాగవలసి ఉంటుందని చెప్పారు. ఈ సదస్సుకు పూర్వ విద్యార్థులు అధ్యాపకులు హాజరు అయ్యారు. ఇంగ్లీష లెక్చరర్ శ్రీమతి మల్లేశ్వరి వందన సమర్పణ గావించారు. ఈ సదస్సు అనంతరం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథి తెలంగాణ హైకోర్ట్ అడ్వకేట్ ఇందుగపల్లి రామానుజారావు, సభాధ్యక్షులు విశ్రాంత తెలుగు విభాగ అధిపతి రంకిరెడ్డి రామ్మోహన రావు, కళాశాల పాలకవర్గ అధ్యక్షులు తాడి నాగిరెడ్డి, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ కె. రామచంద్రరాజు, ఉభయ కళాశాలల ప్రిన్సిపాల్స్ డాక్టర్ వై.వి.వి. అప్పారావు, కొల్లి వెంకట సూర్యనారాయణ గౌరవ అతిథులుగా వ్యవహరించారు. ఈ సమావేశానికి కళాశాల పూర్వ విద్యార్థులు అనేకమంది పాల్గొన్నారు.



# నిఘాలో మద్యం సేవనపై కేసులు భూతప్ప కనుమ వద్ద పోలీసుల ఆకస్మిక తనిఖీలు



**మడకశిర ఇంచార్జ్, (ప్రజా జ్యోతి) జనవరి 11:** పెనుకొండ డీఎస్పీ ఆధ్వర్యంలో మడకశిర సీఐ మరియు గుడిబండ ఎస్ఐలు తమ సిబ్బందితో కలిసి ఆదివారం భూతప్ప కనుమ వద్ద ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. డ్రోన్ కెమెరాల సహాయంతో ప్రదేశాన్ని పర్యవేక్షంచిన పోలీసులు, బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న వారిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేశారు.ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ, మండల పరిధిలో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు -- పేకాట, కోడిపందాలు, మద్యం సేవించడం వంటి చట్టవ్యతిరేక చర్యలు --- జరగకుండా ఉండేందుకు డ్రోన్ నిఘా కొనసాగుతుందని తెలిపారు. ఇటువంటి చర్యలు చేపట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.పౌరులందరూ చట్టాన్ని గౌరవించి, శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని వారు కోరారు.

# మాధవరాయ స్వామి సంక్రాంతి ఉత్సవ ఆహ్వాన పత్రిక విడుదల చేసిన మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా



**జనవరి 11 డాక్టర్ ప్రతాప్ ప్రజా జ్యోతి కడప స్టాఫ్ రిపోర్టర్ :** మైదుకూరు లో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న మాధవరాయ ఆంజనేయ స్వామి వారి సంక్రాతి ఉత్సవ ఆహ్వాన పత్రిక పుస్తకాన్ని ఆవిష్కరించిన మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్. సంక్రాంతి ఉత్సవాల్లో పాల్గొని స్వామి వారి ఉత్సవాలను ప్రారంభించాలని కోరిన టీడీపీ నాయకులు బెల్లం సుబ్బారాయుడు టీడీపీ పట్టణ అధ్యక్షుడు దాసరి బాబు నాయకులు బాల మునేయ్య తిరుమలేష్. ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ను ఘనంగా సత్కరించిన నాయకులు మైదుకూరు మాధవుడు ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని తెలిపిన ఎమ్మెల్యే. సంక్రాంతి ఉత్సవాల్లో అనేక సంస్కృతిక కార్యక్రమాలు ,కోలాటం ,పార్వేట ,స్వామి వారి ఊరేగింపు ఘనంగా నిర్వహిస్తున్నట్టు తెలిపిన కమిటీ నిర్వాహకులు.

# జాతరను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు

## – టిడిపి మండల నాయకులు



**ఎమ్మిగనూరు జనవరి 11(ప్రజా జ్యోతి):** శ్రీ నీలకంటేశ్వర స్వామి జాతరను విజయవంతం చేసిన ప్రజలందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామని టిడిపి మండలం అధ్యక్షులు కాసిం వలి, మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ వెంకటారామిరెడ్డిలు అన్నారు. ఆదివారం నందవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతర సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయ నాగేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎద్దుల బల ప్రదర్శన, క్రికెట్, కబ్బడ్డి, వాలీ బాల్, షెటిల్, వివిధ రకాల పోటీలు విజయవంతంగా నిర్వహించడం జరిగిందని, అందుకు ప్రజలందరూ సహకారం చాలా ముఖ్యమైనదని, వారి సహకారంతోనే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా జాతర జరిగిందనన్నారు. అలాగే గత రెండు రోజుల క్రితం రాష్ట్రవ్యాప్తంగా టిడిపి మండల కమిటీలకు అమరావతిలో శిక్షణ తరగతులు నిర్వహించడం జరిగిందని,గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపితం చేసేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని కూడా శిక్షణ తరగతులు తెలపడం జరిగిందన్నారు. అలాగే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి నారా చంద్రబాబు సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన తర్వాత సూపర్ సిక్స్ పథకాలైన తల్లికి వందనం, మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఫ్రీ బస్సు, రూ.4వేల పెన్షన్ ను అని ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజలకు టిడిపి పార్టీనీ మరింత దగ్గర చేశాయన్నారు. రాబోయే కాలంలో కూడా ప్రజలకు మరెన్నో సంక్షమ పథకాలు అందిస్తూ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలతో మమేకం అవ్వాలని, స్థానిక సంస్థల్లో విజయం దిశగా అడుగులు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గోపాల్ రెడ్డి, సామెల్, పెద్ద రాముడు, తిమ్మప్ప, మునిస్వామి, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

# జిన్నో సమ్మిట్ ను యువత సద్వినియోగం చేసుకోవాలి.

-ప్రత్తిపాడు వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు.



**కాకినాడ జిల్లా కిర్లంపూడి ప్రజా జ్యోతి రిపోర్టర్ స్వామి:** స్పార్క్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 25 వ తేదీన ఏలేశ్వరం వేదిక ఫంక్షన్ హాల్ లో నిర్వహించనున్న జిన్నో సమ్మిట్ కార్యక్రమాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని ప్రత్తిపాడు నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పిలుపునిచ్చారు.జిన్నో సమ్మిట్ ఎక్స్ట్రీమ్ ఇన్ ఇన్నోవేషన్?2026 కు సంబంధించిన అధికారిక పోస్టర్‌ను ముద్రగడ గిరిబాబు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ముద్రగడ గిరిబాబు మాట్లాడుతూ,"గ్రామీణ ప్రాంతాల్లో టెక్నాలజీ, ఇన్నోవేషన్‌ను ముందుకు తీసుకువెళ్లే లక్ష్యంతో నిర్వహిస్తున్న జిన్నో సమ్మిట్ 2026 లో ముఖ్య అతిథిగా పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు, యువ పారిశ్రామికవేత్తలు, ఇన్నోవేటర్లతో నేరుగా కలుసుకుని వారి ఆలోచనలను తెలుసుకోవడం కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నానన్నారు.ఈ భారీ సమ్మిట్‌ను గ్రామీణ ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించేందుకు ముందుకు వచ్చిన స్పార్క్ సంస్థను అభినందించారు.స్పార్క్ చైర్మన్ సందీప్,సంస్థ సి ఈ ఓ ప్రదీప్ ను గిరిబాబు ఈ సందర్భంగా అభినదించారు.గ్రామీణ యువతలో ఉన్న ప్రతిభను వెలికి తీసి, సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, స్టార్టప్స్ రంగాల్లో అవకాశాలను అందించే వేదికగా ఈ సమ్మిట్ నిలవనుందని నిర్వాహకులు తెలిపారు. ఏలేశ్వరం యువత అంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ముద్రగడ గిరిబాబు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్పార్క్ ఫౌండేషన్ ?ప్రతినిధులు నవనీత్, రమ్య, అంజితదితరులుపాల్గొన్నారు.

## బ్రహ్మంగారి మఠం మండల కేంద్రంలో నీటి కష్టాలు...!




**ప్రజాజ్యోతి – బ్రహ్మంగారి మఠం :** బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలో గత ఐదు రోజులుగా నీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు కూత వేటు దూరంలో అభివృద్ధి కార్యాలయం ఉన్నప్పటికీ ప్రజల ఇబ్బందులను పట్టించుకోకపోవడం పై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు, వినాయక నగర్ ప్రభుత్వ వైద్యశాల వీధి అయ్యప్పనగర్ ప్రభు నగర్ నీళ్ల లేక బైక్ లపై బిందెలు కట్టుకొని దూర ప్రాంతం నుండి తెచ్చుకోవలసిన పరిస్థితి ఏర్పడింది ప్రజలు ఇంత కష్టాలు పడుతున్న అధికారులలో చలనం రాకపోవడం చాలా బాధాకరమైన విషయం ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రజలు కోరుకుంటున్నారు


## ఎస్సీ కాలనీ వాసుల అవసరాన్ని తీర్చిన కండాపు శ్రీనివాస రావు

- క్రషర్ బొగ్గు అందించి కాలనీవాసులకు సహకారం



**పొందూరు , ప్రజాజ్యోతి న్యూస్ :**పొందూరు మండలం రాపాక గ్రామ ఎస్సీ కాలనీ వాసులు రోడ్డు నిర్మాణం సరిగ్గా లేకపోవడం తో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో తమ అవసరాన్ని టిడిపి తెలుగు యువత మండల అధ్యక్షులు కండాపు శ్రీనివాస్ రావు దృష్టికి తీసుకువచ్చారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించి కాలనీవాసులు సంక్రాంతి పండుగను ఆనందోత్సవాల మధ్య జరుపుకునేందుకు వీలుగా కాలనీ వాసుల కోరిక మేరకు క్రషర్ బొగ్గు ( డస్ట్ ) ను అందజేశారు. తమకు రోడ్డు వేసుకునేందుకు క్రషర్ డస్ట్ అందజేసిన శ్రీనివాస రావు పట్ల కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా అల్లూరి సూర్య ప్రకాశరావు 75వ జయంతి వేడుకలు



**తాళ్లపూడి, జనవరి 11 , ప్రజాజ్యోతి న్యూస్ :** తాళ్లపూడి మండలం అన్నదేవరపేట గ్రామానికి చెందిన జమిందారీ వంశీకులు అల్లూరి సూర్య ప్రకాశరావు 75వ జయంతి వేడుకను వారి తనయుడు టిడిపి సీనియర్ నాయకులు అల్లూరి విక్రమాదిత్య ఆదివారం ఘనంగా నిర్వహించారు. అజాత శత్రువుగా పేరు సంపాదించుకున్న ఆయన అన్నదేవరపేట సొసైటీ అధ్యక్షులుగా, డి సి సి బి చైర్మెన్, నవభారత్ నెంబర్ గా అదేవిధంగా గోపాలపురం సమితి అధ్యక్షులుగా 15 సంవత్సరాలు ప్రజలకు సేవలు అందించారని ఆయన చిరకాల మిత్రుడు కూచిపూడి సూర్యనారాయణ తెలిపారు. ఈ జయంతి కార్యక్రమంలో పైడిమెట్ట ఎత్తిపోతల అధ్యక్షులు ముళ్ళపూడి శ్రీరామచంద్రమూర్తి, బ్యాంకు శ్రీను, కుటుంబ సభ్యులు మరియు స్నేహితులు పాల్గొన్నారు

# వందేళ్ల ఘన చరిత్ర కలిగిన ఏకైక రాజకీయ పార్టీ సిపిఐ.

నియోజకవర్గ కార్యదర్శి గోపాల్.

వంద సంవత్సరాల వేడుకల ఖమ్మం బహిరంగ సభకు భారీగా తరలిరండి.

ప్రజా ఉద్యమాల గొంతుక ప్రజా నాట్యమండలి.



**కళ్యాణదుర్గం : జనవరి 11,(ప్రజా జ్యోతి),డివిజన్ ఇంఛార్జి శివశంకర్.**నేడు కళ్యాణదుర్గం చేరుకొని టీ సర్కిల్ ,గాంధీ చౌక్ లో కమ్యూనిస్టు పార్టీ విశిష్టతను వివరిస్తూ విప్లవ గేయాలు ఆలపించింది.ఆదివారం సిపిఐ 100 సంవత్సరాల వేడుకలు ప్రచారంలో భాగంగా మూడు రోజులుగా సాగుతున్న ప్రజానాట్యమండలి సాహిత్య జీపు జాత ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,భారతదేశం పురుడు పోసుకోవడంలో,జాతీయ ఉద్యమ పోరాటంలో సిపిఐ కీలకపాత్ర పోషించింది అన్నారు.వందేళ్ల ఘన చరిత్ర కలిగిన ఏకైక రాజకీయ పార్టీ సిపిఐ అని,జనవరి 18వ తేదిన ఖమ్మంలో జరిగే 100 సంవత్సరాల వేడుకల బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పార్టీ శ్రేణులకు సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి గోపాల్ సహాయ కార్యదర్శి నరసింహులు పిలుపునిచ్చారు.దున్నేవాడికే భూమి నినాదంతో లక్షలాది ఎకరాల భూమిని పేద ప్రజలకు పంచింది అన్నారు. రాజభరణాల రద్దు,బ్యాంకుల జాతీయకరణ సిపిఐ ఉద్యమ ఫలితమే అన్నారు.దేశంలో ప్రజాస్వామ్య,లౌకిక,సామ్యవాదం, సామాజిక న్యాయం లాంటి మౌలిక భావజాలం తీసుకురావడంలో కమ్యూనిస్టు పార్టీ కీలకపాత్ర పోషించింది అని దేశ ప్రజలకు ఇదే నేటి రాజ్యాంగ స్ఫూర్తి అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో నాలుగు వేల ఐదు వందల మంది ప్రాణాలు అర్పించి 10 లక్షల ఎకరాల భూమిని పేద ప్రజలకు పంచారు అన్నారు.రాయలసీమ కృష్ణ జలాల కోసం,పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి కోసం,నివేశన స్థలాలు పక్కా ఇల్లు కోసం అనేక ఉద్యమాలు నిర్మించిందదని తెలిపారు.భూస్వాములు,ముటాతత్వ ఆగడాలు ఫ్యాక్షన్ హత్య రాజకీయాలకు వ్యతిరేకంగా సిపిఐ అనేక ప్రజా స్వామిక ఉద్యమాలు నిర్మించింది అన్నారు.ఈ సందర్భంగా మతోన్మాద్,సామ్రాజ్యవాద,పెట్టబడిదారులకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలి అన్నారు.ప్రజా ఉద్యమాల గొంతుక ప్రజానా ట్యమండలి అని,అభ్యుదయ సాంస్కృతిక సాహిత్యాన్ని ప్రజలకు అందించిన ఘనత ప్రజానాట్యమండలి అన్నారు.ఈ కార్యక్రమంలో బ్రహ్మసముద్రం,సెట్టూరు మండల కార్యదర్శిలు నాగరాజు నాయక్,తిమ్మరాయుడు పట్టణ,బ్రహ్మ సముద్రం మండల సహాయ కార్యదర్శి లు బుడెన్,రాంబాబు వ్యాకాస అధ్యక్షులు బిసలప్ప జయ రాములు ప్రజానాట్య మండలి నాయకులు మల్లికార్జున,కుళ్లాయప్ప, నాగరాజు తిప్పేస్వామి, పుల్లయ్య ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

# బాపట్ల లో నేరాలకు చెక్ -రైల్‌పేటలో కఠిన కార్డన్ సెర్చ్

51 ద్విచక్ర వాహనాలు, ఆటో స్వాధీనం



**బాపట్ల జనవరి 11 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి):** జిల్లాలో శాంతి భద్రతలను మరింత పటిష్టం చేయాలనే లక్ష్యంతో బాపట్ల పట్టణంలోని రైల్‌పేట ప్రాంతంలో జిల్లా పోలీసులు విస్తృత స్థాయిలో కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, బాపట్ల డీఎస్పీ జి.రామాంజనేయులు ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 4 గంటల నుంచి 9 గంటల వరకు ఈ తనిఖీలు కొనసాగాయి.ఈ ప్రత్యేక ఆపరేషన్‌లో జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది కలిపి మొత్తం 90 మంది పోలీసులు పాల్గొన్నారు. బాపట్ల టౌన్ సీఐ రాంబాబు, రూరల్ సీఐలు శ్రీనివాసరావు, హరికృష్ణ, పట్టణ ఎస్ఐ విజయ్ కుమార్, ఉమెన్ ఎస్ఐ చంద్రావతి, రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ శ్రీనివాసరావు సహా కర్లపాలెం, పర్చూరు, చందోలు పోలీస్ స్టేషన్లకు చెందిన పీఎస్ఐలు, ఈగల్ టీమ్, సబ్ డివిజన్ సిబ్బంది ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.కార్డెన్ అండ్ సెర్చ్ సమయంలో ప్రతి ఇంటిని క్షణ్ణంగా తనిఖీ చేసి, నివాసితుల వివరాలు, ఆధార్ కార్డులను ఆన్‌లైన్‌లో ధృవీకరించారు. అలాగే రహదారులపై వాహన తనిఖీలు చేపట్టి, వాహనాలకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. సరైన ధ్రువపత్రాలు లేని 51 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఈ సందర్భంగా డీఎస్పీ జి.రామాంజనేయులు మాట్లాడుతూ, అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం ఉన్న ప్రాంతాలు, అనుమానితుల నివాసాలను ప్రత్యేకంగా గుర్తించి తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా ఈ తనిఖీలు చేపట్టామని స్పష్టం చేశారు. వాహనదారులు తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే ధ్రువపత్రాలు కలిగి ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై జిల్లా పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారని పేర్కొన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి తమ భవిష్యత్తును కాపాడుకోవాలని సూచించారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో పేకాట, కోడిపందాలు వంటి జూద క్రీడలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.అనుమానాస్పద వ్యక్తులు లేదా చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై సమాచారం ఉన్నట్లయితే వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని డీఎస్పీ తెలిపారు. అనంతరం స్థానికులతో గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రతిజ్ఞ చేయించారు.

# భక్తిగీతాలతో గ్రామంలో ఆధ్యాత్మికతను నెలకొల్పుతున్న మేలుకొలుపు

- పురవీధుల్లో పర్యటిస్తూ భక్తిగీతాలు ఆలపిస్తున్న శ్రీధర్మ శాస్త్ర బృందం
- భక్తితో మార్మోగిన శ్రీకృష్ణుని నామ స్మరణ



**పొందూరు ,ప్రజాజ్యోతి న్యూస్ :**పురాతన సంప్రదాయాలు అంతరించిపోకుండా శ్రీకాకుళం జిల్లా పొందూరు మండల కేంద్రంలో శ్రీధర్మ శాస్త్ర బృందం బృందం మేలుకొలుపు కార్యక్రమంతో గ్రామంలో ఆధ్యాత్మికతను నెలకొల్పుతున్నారు. .వేకువజామున నిద్రలేచి మేలుకో కృష్ణ ,మమ్ము యేలుకో అంటూ భక్తిగీతాలను ఆలపిస్తూ శ్రీకృష్ణుని లీలలు వివరిస్తూ గ్రామం అంతా భక్తిభావాన్ని నింపుతున్నారు. భగవంతుని నామస్మరణకు మించినది మరొకటి లేదంటూ ప్రతీ ఒక్కరూ భగవంతుని నామస్మరణ జపించేలా చైతన్యం కలిగిస్తున్నారు. ప్రతీ ఏడాది ధనుర్మాసం ప్రారంభం కాగానే నెలగంటు పెట్టిన నాటి నుండి పురవీధుల్లో తిరుగుతూ భక్తిగీతాలను ఆలపించడం ఆనవాయితీగా సాగిస్తున్నారు. శ్రీకృష్ణుని లీలలు ,భక్తి తత్వాన్ని చాటి చెప్పే పాటలతో ప్రజలను భక్తి మార్గంలో నడిపిస్తున్నారు. తెల్లవారుజామునే ఇంటి ముందుకు వచ్చి వారి వద్ద నుండి బియ్యాన్ని సేకరించి వారి పాప కర్మలను బియ్యం సేకరణ ద్వారా హరిస్తూ ప్రతీ ఒక్కరినీ మేల్కొల్పుతున్నారు.భవిష్యత్ తరాలకు మన సాంస్కృతిక సాంప్రదాయాలు తెలిసేలా ,ప్రతీ ఒక్కరిలో భక్తి భావం పెంపొందించేలా చేయడమే ప్రధాన ఉద్దేశంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. సంప్రదాయాన్ని , సంస్కృతిని నిలబెట్టేలా ఈ కార్యక్రమం గ్రామంలో ప్రశాంతతను నెలకొల్పింది.

# సైబర్ నేరాలకు యువత దూరంగా ఉండాలి

- మత్తు పదార్థాల వినియోగంతో జీవితం అంధకారం
- అక్రమ రవాణా నేపద్యంలో వాహనాలను తనిఖీ చేసిన ఎస్. ఐ సత్యన్నారాయణ






**పొందూరు , ప్రజాజ్యోతి న్యూస్:**సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ సత్యన్నారాయణ అన్నారు. పొందూరు మండల కేంద్రంలో లోలుగు గ్రామంలో సంకల్పం కార్యక్రమంలో భాగంగా మాదక ద్రవ్యాలు , సైబర్ నేరాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. వీటితోపాటు సంక్రాంతి పండుగ నేపథ్యంలో అక్రమ రవాణా పై వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని , మత్తు పదార్థాల వినియోగం వల్ల జీవితం అంధకారం అవుతుందని సూచించారు. మాదక ద్రవ్యాలను వినియోగించుకుని ,విక్రయించిన చట్టరీత్యా నేరమని తెలిపారు. సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని , గ్రూప్ లలో లేదా వ్యక్తిగత నెంబర్ లకు సామాజిక మాధ్యమాల ద్వారా వచ్చే లింక్ లను క్లిక్ చేయరాదని తెలిపారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో గంజాయి ,గుట్కా అక్రమ రవాణా చేయరాదని ,అటువంటి రవాణా చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# ప్రభుత్వ పథకాలు గడప దాటాలి

-- ఓబీసీ మోర్చా సంకల్పం

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యం ఓబీసీ మోర్చా పిలుపు.

పోలవరం నియోజకవర్గం ఓబీసీ మోర్చా ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా మాగంటి బలరాం కృష్ణ.



**జనవరి.. 11 (ప్రజాజ్యోతి పోలవరం ప్రతినిధి) :** బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి: ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు అగ్రహారపు వెంకటేశ్వరరావు?అశోక్ నగర్ జిల్లాలో భారతీయ జనతా పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు ఓబీసీ మోర్చా శ్రేణులు అంకితభావంతో కృషి చేయాలని ఆ మోర్చా జిల్లా అధ్యక్షుడు అగ్రహారపు వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం అశోక్ నగర్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు.?ఈ సందర్భంగా మోర్చా నూతన కమిటీని పోలవరం నియోజకవర్గం ఓబీసీ మోర్చా ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా మాగంటి బలరాం కృష్ణ ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్తులో పార్టీ చేపట్టబోయే సేవా కార్యక్రమాలు, కేంద్ర ప్రభుత్వ పథకాలు అర్హులైన వారందరికీ అందేలా కార్యకర్తలు బాధ్యత తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం వినయ్ కుమార్, మాగంటి బలరాం కృష్ణ, గోదావరి జోనల్ ఇంచార్జ్ బాలకృష్ణ, జిల్లా అధ్యక్షులు విక్రమ్ కిషోర్ తదితరులు పాల్గొని నూతన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు.

## లైఫ్ కేర్ క్లినిక్ & ఎం ఏ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న

టిడిపి నాయకులు డాక్టర్ మండిపల్లి లక్ష్మి ప్రసాద్ రెడ్డి

రాయచోటి నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ మయాన మహమ్మద్ అలీ పఠాన్



**రాయచోటి జనవరి 11 ప్రజా జ్యోతి :** ఆదివారం ఉదయం పట్టణంలోనే సుండుపల్లి రోడ్డు పాత మున్సిపల్ ఆఫీస్ దగ్గర నిర్వహించిన లైఫ్ కేర్ క్లినిక్ వెల్ఫేర్ సొసైటీ వారి ఆధ్వర్యంలో జరిగిన మెగా ఉచిత వైద్య శిబిరంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న నియోజకవర్గ టిడిపి నాయకుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మి ప్రసాద్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలోనే ప్రజలు ఇటువంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న స్వచ్ఛంద సంస్థలు మరియు డాక్టర్స్ కు ధన్యవాదాలు తెలిపారు. మారుమూల ప్రాంతాలలోనే ప్రజలకు మెరుగైన వైద్య సహాయం అందించాలని వైద్యులకు సూచించారు..పలువురు పట్టణ మైనార్టీ టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సంక్రాంతి వేడుకల్లో బండలాగుడు పోటి లు సరస్వతి పల్లె గ్రామంలో



**రామపురం జనవరి 11 ప్రజా జ్యోతి :** అన్నమయ్య జిల్లా రామాపురం మండలంలో సంకురాత్రి సంబరాలలో ఎద్దుల బండలాగుట పోటీ నిర్వహించేందుకు ఆర్గనైజర్ :- షేక్ మియా సాబ్ కుమారులు షేక్ ఖాదర్ వలీ షేక్ ఖాదర్ బాషా బండలాడు పోటీల్లో ప్రతి ఒక్కరు పాల్గొవాల్సింది గాకోరుతున్నాం.15వతేదీగురువారం మధ్యాహ్నం.12.00గంటలకు డ్రా తియడంజారుగుతుందిసరస్వతి గ్రామం లో 15.తేదిన సీనియర్ విభాగం బాహుమతులు

1.బహుమతి 20,000
2.బహుమతి 15,000
3.బహుమతి 10,000
4.బహుమతి 5,000

ఎడ్ల జత యజమానులు ఈ పోటిలో పాల్గొనవలసిందిగా కోరుతున్నము.అలాగే యాంకర్ గా శివ కమలాపురం సరస్వతి పల్లి గ్రామంరామాపురం మండలం ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరుతున్నాము.

## బంగ్లాదేశ్లో హిందువుల జీవితాలకు భద్రత లేదు

బంగ్లాలో హిందువుల వరుస హత్యలకు ఖండన-బిజెపి నేత మిడతల రమేష్.



**జనవరి 11 నెల్లూరు జిల్లా ప్రతినిధి (ప్రజా జ్యోతి ):** ఒక ప్రైవేట్ సంస్థ లో ఏజెంట్ల సమావేశం అరవిందనగర్ మన హాస్పిటల్ లో జరిగింది.అనంతరం బిజెపి నమామిగంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ ఆధ్వర్యంలో బంగ్లాదేశ్ లో హిందువులపై మారణకాండను ఖండిస్తూ నిరసన తెలిపారు. మూక దాడులలో20 రోజులలో ఆరుగురు హిందువులు హత్యలకు గురయ్యారు. ఒక్క యాడాదిలో హిందువులపై యాభైఒక్క దాడుల సంఘటనలు జరిగాయి. యదేచ్ఛగా హిందూ స్త్రీలపై అఘాయిత్యాలు అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయి. ఆస్తులు ఆలయాల ధ్వంసం జరుగుతూ ఉన్నాయి. బంగ్లాలో మైనార్టీలుగావున్న హిందువులు జీవించే హక్కును కోల్పోతుంటే బిజెపి తప్ప మనదేశంలో కాంగ్రెస్ లెఫ్ట్ పార్టీలు బంగ్లా లో మూక దాడులను ఖండించే పరిస్థితుల్లో కూడా లేవని. రమేష్ పేర్కొన్నారు. అయోధ్య రామ మందిరంలో నమాజ్ చదివేందుకు ప్రయత్నించిన సంఘటన ను రమేష్ ఖండించారు. ఈ కార్యక్రమంలో చింతగింజల సుబ్రమణ్యంలు . శ్రీధర్. కృష్ణ రావు. నాగేశ్వరావు. శ్రీనివాసులు తదితర ముక్యులు పాల్గొన్నారు.

## కోడి పందాలకు సిద్ధం చేసిన బరులు ధ్వంసం



**తాళ్లపూడి, జనవరి 11,ప్రజాజ్యోతి న్యూస్ :** సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందాల బరులను సిద్ధం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని తాళ్లపూడి ఎస్ ఐ. టి రామకృష్ణ హెచ్చరించారు. మండలంలో ఎక్కడైనా కోడి పందాల బరులు సిద్ధం చేసిన వెంటనే వాటిని ధ్వంసం చేసి సంబంధ వ్యక్తులు మీద బైండోవర్ కేసులు బుక్ చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ నేపథ్యంలోనే మండలంలో కోడిపందాలకు సిద్ధమవుతున్న పలు బరులను మండల తాసిల్దార్ లక్ష్మి లావణ్య మరియు పోలీస్ సిబ్బంది కలిసి బుధవారం పలు బరులను ధ్వంసం చేసినట్లు ఆయన తెలిపారు

# నెల్లూరు రూరల్ లో అభివృద్ధి పనుల జాతర

## తాజాగా 204 పనులకు సంబంధించి 27 కోట్ల నిధులు

**జనవరి 11 నెల్లూరు జిల్లా ప్రతినిధి (ప్రజా జ్యోతి ):**

ఎమ్మెల్యే కోటంరెడ్డి వైద్యం నిమిత్తం కేరళలో ఉన్న అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న గిరిధర్ రెడ్డి. నెల్లూరు రూరల్ కు పెద్ద ఎత్తున నిధుల కోసం కృషి. ఎమ్మెల్యే జిల్లా కేంద్రంలో లేకున్నా అభివృద్ధి పనుల జోరు తగ్గేదేలే అంటున్న గిరిధర్ రెడ్డి. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనుల జాతర కొనసాగుతోంది. నిరంతర అభివృద్ధి పనులతో నెల్లూరు రూరల్ నియోజకవర్గం రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలుస్తోంది. తాజాగా నెల్లూరు రూరల్ నియోజకవర్గానికి సంబంధించి మొత్తం 224 పనులకు సంబంధించి 27 కోట్ల రూపాయల నిధులు మంజూరయ్యాయి. రహదారులు, డ్రైన్లు, ప్రహరీ గోడలు, స్మశాన వాటికలు అభివృద్ధి, విద్యుత్ పనులతో అనేక రకాల అభివృద్ధి పనులు నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో పెద్ద ఎత్తున సాగుతున్నాయి. ఈ పనులను 60 రోజుల్లో పూర్తిచేసి స్థానిక ప్రజల చేత ప్రారంభింపజేయనున్నారు. వీటికి సంబంధించి త్వరలోనే ఒక తేదీని నిర్ణయించి శంకుస్థాపనలు ఒకే రోజు జరగనున్నాయి. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అనారోగ్యం దృష్ట్యా కేరళలో చికిత్స పొందుతూ జిల్లా కేంద్రంలో అందుబాటులో లేకపోయిన కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి మాత్రం నిరంతరం శ్రమిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను జోరును మాత్రం తగ్గించడం లేదు. రూరల్ లో ఆయన అభివృద్ధి పనుల కోసం నిరంతరం శ్రమిస్తున్నారు .నెల్లూరు రూరల్ నియోజకవర్గం లో గతంలో 339 అభివృద్ధి పనులకు సంబంధించి మొత్తం 40 కోట్ల రూపాయల పనులు ఇంతకుముందు మంజూరైన సంగతి తెలిసిందే. వీటిని కోటంరెడ్డి సోదరులు ప్రతిష్టాత్మకంగా తీసుకొని 60 రోజుల్లో పూర్తిచేసి ప్రజల చేత ప్రారంభింపజేసిన సంగతి తెలిసిందే.



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ దగ్గర నుంచి ప్రతి ఒక్కరు గతంలో 339 అభివృద్ధి పనులకు సంబంధించి కోటంరెడ్డి సోదరులకు అభినందనలు తెలియజేసిన సంగతి తెలిసిందే. అభివృద్దే ధ్యేయంగా పేద ప్రజల సంక్షమమే లక్ష్యంగా నిరంతరం కోటంరెడ్డి సోదరులు పడుతున్న కష్టానికి అనుగుణంగా రూరల్ నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి నిధులు మంజూరవుతున్నాయి. మంజూరైన ప్రతి పనిని పూర్తి అయ్యేలా కాంట్రాక్టర్లు అధికారులను సమన్వయ పరుస్తూ సకాలంలో వాటిని పూర్తి అయ్యేలా నిరంతరం శ్రమిస్తున్నారో కోటంరెడ్డి సోదరులు. నిరంతరం జనంలో ఉంటూ వరుసగా మూడుసార్లు హ్యాట్రిక్ విజయంసాధించారంటే వారి శ్రమ ఎలాంటిదో అర్థమవుతుంది.

## ప్రభుత్వం అండగా ఉంటుంది

నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి.



**ముత్తుకూరు, జనవరి 11 (ప్రజా జ్యోతి)** ప్రతి ఒక్కరికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి అన్నారు . ఆదివారం ఆయన తన చేతుల మీదుగా ఎస్ పి ఎస్ ఆర్ నెల్లూరు వన్యకులక్షత్రియ అగ్నికులక్షత్రియ సంఘం 2026 వ సంవత్సరం క్యాలెండరు ఆవిష్కరణ కార్యక్రమం చేసినట్లు సంఘం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి చైర్మన్ మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభివృద్ధి సంక్షమాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు గండవరం రవిచంద్రన్, ఉపాధ్యక్షులు తాండ్ర బాబురెడ్డి, కార్యదర్శి నెట్రంబాక వెంకటేశ్వర్లు, కోశాధికారి గండవరం దీక్షత్ బాబు, సంఘం నాయకులు నెట్రంబాకం రాజేంద్ర ప్రసాద్,మేనాటి మొలకయ్య, ముత్తుకూరు మండలం సంఘం శ్రేయోభిలాషులు దండు శ్రీనివాసులు, పాకం వెంకయ్య, నెల్లూరు నగరం 40 వ డివిజన్ తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు గండవరం రమేష్ బాబు, జిల్లాలోని వివిధ మండలాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలకు క్రమశిక్షణ, విలువలు నేర్పించండి.

పూర్వ విద్యార్థులకు గురువులు సూచన.



**ముత్తుకూరు, జనవరి 11 (ప్రజా జ్యోతి)** జీవితంలో ఎదగాలంటే పిల్లలకు క్రమశిక్షణతో పాటు విలువలు, విశ్వసనీయత, పెద్దలపట్ల గౌరవం, తరగతి గదుల్లో ఉపాధ్యాయులు పట్ల మంచి ప్రవర్తనతో కలిగి ఉండాలన్న విషయాన్ని తెలియజేయాలని పూర్వ విద్యార్థులకు గురువులు సూచించారు. ఆదివారం ముత్తుకూరు మండల కేంద్రం జడ్పీ హైస్కూల్ నందు2000-2001 విద్యా సంవత్సరం 10వ తరగతి పూర్వ విద్యార్థిని విద్యార్థుల బృందం సిల్వర్ జూబ్లీ సెలబ్రేషన్స్ వేడుకల కార్యక్రమాన్ని గురువుల మధ్య ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా గురువులకు ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని చేశారు. విద్యా దానం చేసిన గురువులకు పాదాభివందనం చేసి ఆశీస్సులు పొందారు. సన్మానం అనంతరం గురువులకు జ్ఞాపికలు ఇచ్చారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి జ్యోతిష శిరోమణి డాక్టర్ జి వి బి మురళీకృష్ణ మాట్లాడారు. పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి ఈ కార్యక్రమాన్ని చేసుకోవడం అభినందనీయమన్నారు. జీవితంలో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

## రాయచోటి ప్రత్యేక జిల్లా కోసం 5 వ రోజుకు చేరిన నిరాహార దీక్ష




**రాయచోటి జనవరి 11 ప్రజా జ్యోతి :** రాయచోటిని ప్రత్యేక జిల్లాగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 5 వ రోజుకు చేరుకున్నాయి.ఈ దీక్షలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతు సంఘం తమ సంపూర్ణ మద్దతును ప్రకటించింది.ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర సభ్యులు,జిల్లా కార్యదర్శి వంగిమల్ల రంగారెడ్డి మాట్లాడుతూ రాయచోటి చుట్టుపక్కల మండలాలను కలిపి దీనిని ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా జిల్లా కేంద్రాన్ని తరలించడం హేయమైన చర్య అని,కేవలం స్వార్థ రాజకీయాల కోసమే రాయచోటి అభివృద్ధికి నోచుకోకుండా చేస్తున్నారని ఆయన ప్రభుత్వంపై ధ్వజమెత్తారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు గాజుల భాస్కర్ పాల్గొని దీక్షలో ఉన్నవారికి అల్పాహారం,పానీయాలు అందించి తమ మద్దతు తెలిపారు.ఇంకా ఈ నిరసనలో డిసిసి చీఫ్ సెక్రటరీ అమీర్ భాష,కాంగ్రెస్ అధికార ప్రతినిధి మన్సూర్ అలీ ఖాన్,ఐయుఎంఎల్ జిల్లా అధ్యక్షులు ఎస్.ఎస్.భాష,టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మొహమ్మద్ అలీ,సహారా వెల్ఫేర్ సొసైటీకి చెందిన సయ్యద్ అమిర్ అలీ పాల్గొన్నారు.

## కాలువ పనులను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్



**బద్వేల్ జనవరి 11 (ప్రజా జ్యోతి న్యూస్):** బద్వేల్ పట్టణంలో 25 లక్షల రూపాయల 15వ ఆర్థిక సంఘం నిధులతో ఎన్జీవో కాలనీ మెయిన్ రోడ్డు దగ్గర నుండి మహమ్మద్ కాలనీ మీదుగా భాకరాపేట చెరువు లోకి వెళ్ళుటకు వర్షపు నీరు కాలువను నిర్మించే పనులను ఆదివారం నాడు మున్సిపల్ కమిషనర్ పరిశీలించి కాంట్రాక్టర్ శివా రెడ్డికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో వర్షం వచ్చినప్పుడు గాంధీనగర్ ,ఎన్జీవో కాలనీ మరియు సాయిబాబాగుడి సమీపం నుండి భారీఎత్తున వర్షపునీరు వచ్చి మహమ్మద్ కాలనీ లోని ఇళ్ళలోకి చేరడం జరిగేదని ఈ కాలువ పూర్తయితే మహమ్మద్ కాలనీ నందు వర్షపు నీరు నిలవకుండా ఉండటంతో పాటు డ్రైనేజ్ సమస్య కూడా పరిష్కారం అవుతుందని తెలిపారు.

# మార్టూరులో రైతులకు పట్టాదారు పాస్‌బుక్స్ అందజేత



**బాపట్ల జనవరి 11 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి) :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మీ భూమి -- మీ హక్కు కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాలతో మార్టూరు మండలం, మార్టూరు గ్రామంలో రైతులకు పట్టాదారు పాస్‌బుక్స్ పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమం ఆర్డిఓ పి గ్లోరియా సూచనల మేరకు మార్టూరు తాసిల్దార్ పి ప్రశాంతి అర్హులైన రైతులకు పట్టాదారు పాస్‌బుక్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ, భూమి హక్కులపై రైతులకు పూర్తి స్థాయి భద్రత కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. భూ సంబంధిత సమస్యలను శాశ్వతంగా పరిష్కరించి, రైతులకు స్పష్టమైన భూ హక్కులు కల్పించేందుకు మీ భూమి -- మీ హక్కు కార్యక్రమం ఎంతో ఉపయోగకరమని అన్నారు.భూమి రికార్డుల సరిదిద్దు, హద్దుల నిర్ధారణ, హక్కుల స్పష్టత వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ఇకపై రైతులు బ్యాంకు రుణాలు, ప్రభుత్వ పథకాలు సులభంగా పొందేందుకు ఈ పట్టాదారు పాస్‌బుక్స్ ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు రైతులు పాల్గొని పట్టాదారు పాస్‌బుక్స్ స్వీకరించారు. తమ భూములపై హక్కులు స్పష్టంగా లభించడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా రైతుల నమ్మకం మరింత బలపడుతుందని వారు అభిప్రాయపడ్డారు.కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, గ్రామ కార్యదర్శి, వీఆర్వోలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# వినోదం పేరుతో ప్రజలను నిలువ దోపిడీ చేస్తున్న సినిమా థియేటర్లపై చర్యలు తీసుకోవాలి


డివైఎఫ్ఐ కడప జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని.



**బద్వేల్ జనవరి 11 (ప్రజా జ్యోతి న్యూస్):** ప్రస్తుతం సంక్రాంతి పండుగ సందర్భంగా రాబోతున్న సినిమాల విడుదల లో ప్రజల వద్ద నుండి అధిక ధరతో టికెట్ల వసూలు చార్జీలు ఆపాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ కడప జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని తెలిపారు. ఆదివారం ఉదయం స్థానిక సుందరయ్య భవనం ఆవరణంలో డివైఎఫ్ఐ పట్టణ నాయకుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ కడప జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని మాట్లాడుతూ... పండగ పూట సామాన్య మధ్యతరగతి ప్రజలు కుటుంబాలతో కలసి ఆనందంగా సినిమాలకు రావాలంటే భయపడే పరిస్థితి నెలకొందని వారన్నారు టికెట్ ధరలు 500 నుండి 1000 వరకు రేట్లు నిర్ణయించి ప్రజల జేబులకు చిల్లు చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. భారీ బడ్జెట్ల పేరుతో సినిమా వాళ్లు టికెట్ రేట్లు పెంచుకునే దానికి ప్రభుత్వాల దగ్గరకు వస్తే ప్రభుత్వాలు కూడా సినిమా వాళ్ళ అవసరాల కోసం టికెట్ రేట్లు పెంచుకునే దానికి అవకాశాలు ఇస్తున్నారు సామాన్యుడు టికెట్ రేట్లు భరించలేక పైరసీ వైపు మొగ్గ చూపుతున్నాడు సినిమా థియేటర్ల యాజమాన్యాలు కూడా పార్కింగ్ ఫీజు వసూలు చేయకూడదని ఉన్న థియేటర్లలో తినుబండారాలు అధిక రేట్లకు అమ్మకూడదని నిబంధనలు ఉన్నా ఇవేమీ పట్టించుకోకుండా నిర్వహిస్తున్నారన్నారు ప్రభుత్వ అధికారుల సైతం పట్టించుకోవడం లేదన్నారు అధిక టికెట్ల రేట్లు ఆపాలని నిబంధనలో విరుద్ధంగా నడుస్తున్న సినిమా థియేటర్లో యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ అధికారులు సినిమా థియేటర్లలో తనిఖీలు నిర్వహించి నిబంధనలు విరుద్ధంగా నడుస్తున్న వాటిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు లేనిపక్షంలో రాబోవు రోజుల్లో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ అధ్యక్షుడు ఎస్కే మస్తాన్ షరీఫ్ రూరల్ అధ్యక్షుడు ముడమల ఓబుల్ రెడ్డి పట్టణ నాయకులు ఎస్ ప్రవీణ్ కుమార్ యువరాజ్ సుధాకర్ ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సుభాషిణి కి నివాళులు అర్పించిన ఎస్సీ కమిషన్ చైర్మన్ కె ఎస్ జవహర్





**తాళ్లపూడి,జనవరి11 ,ప్రజాజ్యోతి న్యూస్ :** కొవ్వూరు నియోజకవర్గం తాళ్లపూడి మండలానికి చెందిన కొడమంచిలి ఇమ్ము తల్లి అయిన కొడమంచిలి సుభాషిణి (వీఆర్వో) అనారోగ్య కారణంగా మరణించారు. మరణ వార్త తెలుసుకు ఆమె భౌతిక కాయానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పి ఆమె అంతిమయాత్రలో పాల్గొన్న రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కె ఎస్ జవహర్ చైర్మన్ వెంట వారి తనయుడు రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షలు, కొత్తపల్లి ఆశిష్ లాల్, జిల్లా తెలుగు యువత నాయకులు నామా సురేంద్ర కుమార్, బోడపాటి కాశీ విశ్వనాథం తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు

# మాజీ మంత్రి కాకాణి తో పాటు కిలివేటి,ఆనం విజయ్ కుమార్ రెడ్డి, నేదురుమల్లి తో పాటు పలువురు వైసీపీ నేతలు అరెస్ట్.





**జనవరి 11 నెల్లూరు జిల్లా ప్రతినిధి (ప్రజా జ్యోతి ):** ఇటీవల తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కృష్ణా జలాల పై చంద్రబాబు నాయుడుతో మాట్లాడి రాయలసీమ ఎత్తిపోతల పథకం లాంటి నీటి ప్రాజెక్టులు ఆపించామని చెప్పడం తో చెలరేగిన వివాదం,కూటమి రాయలు సీమ రైతులు, ప్రజలకు అన్యాయం చేస్తుందని వైసీపీ నాయకులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం. నెల్లూరు జిల్లా లోని సోమశిల,కండలేరు జలాశయాలు సందర్శన చేసి నిరసన తెలపాలని నిర్ణయం. నిన్న YCP నేతల సోమశిల పర్యటన ను అడ్డుకున్న పోలీసులు. నేడు కండలేరు ముఖ ద్వారం వద్ద రోడ్డుపై బైఠాయించిన వైసిపి నేతలు,ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు.మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి తో పాటు సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య,నెల్లూరు రూరల్,వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్తలు ఆనం విజయ్ కుమార్ రెడ్డి,నేదురుమల్లి రామకూర్ రెడ్డి ని అరెస్టు చేసి రాపూరు పోలీస్ స్టేషన్ కు తరలింపు.

# మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పరిరక్షణా పోరాటం విజయవంతం.

## కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నారపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి



**జనవరి 11 నెల్లూరు జిల్లా ప్రతినిధి (ప్రజా జ్యోతి ):**

నెల్లూరు గాంధీ బొమ్మ సెంటర్లో ఒకరోజు ఉపవాస ( నిరాహార) దీక్ష.నెల్లూరు అఖిల భారత కాంగ్రెస్ పిలుపుమేరకు దేశవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పరిరక్షణకై జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఒకరోజు ఉపవాస దీక్ష చేస్తున్నట్లు నెల్లూరు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నారపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు.గ్రామీణ పేద ప్రజల పనిచేసే హక్కుగా నరేగా పథకానికి 20 ఏళ్లు విజయవంతంగా నడుస్తుంటే, మోడీ ప్రభుత్వం గాంధీ మహాత్ముని పేరు తీసేసి వి బి జి రాంజీ అనే నూతన పేరుతో పేద బ్రతుకుల జీవితాలలో చీకటిని మిగిల్చబోతుందని అన్నారు.నరేగా చట్టం కనీస వేతనాల ప్రకారంగా పని చట్టబద్ధమైన హామీగా 15 రోజుల్లోపు పని కల్పించాల్సిన బాధ్యత ఉండేదని, పనిచుపలేక పోతే వారికి హక్కుగా వేతనం ఇచ్చే విధంగా చట్టంలో ఉండేది.రాష్ట్ర ప్రభుత్వాన్ని బలహీనపరుస్తూ ఆర్థిక భారం 40 శాతం రాష్ట్రాలు భరించేలా చట్టం రూపొందించడం వల్ల రాష్ట్రాలు ఆర్థిక భారం వలన పథకం నిర్వీర్యం చేసే ప్రమాదం ఉంది అన్నారు,దీనివల్ల రాష్ట్రంలో 70 లక్షల మంది ఉపాదిపై ప్రభావం ఏర్పడుతుందని అన్నారు.20 సంవత్సరాలుగా భారతదేశ కార్మికుల జీవనాధారమైన ఈ పథకం కరోనా సమయంలో అప్రకటిత లాక్ డౌన్ వలన కార్మికులు స్వగ్రామాలకు వెళ్తే 4.6 కోట్ల మందికి ఉపాధి కల్పించిందని, ఇప్పటివరకు 180 కోట్లకు పైగా పని దినాలు సృష్టించబడ్డాయని తెలిపారు.భారతదేశంలో అత్యంత ప్రభావితమైన విజయవంతమైన పథకాల్లో ఇది ఒకటిని అన్నారు.మోడీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకం పై దురుద్దేశాలను గత 11 సంవత్సరాల్లో వేతనాలు చాలా తక్కువగా పెంచి, 125 రోజులు నిబంధన అనేది బూచి గా చూపించి పథకాన్ని నిర్వీర్యం చేయడానికి పూనుకున్నారని అన్నారు. దీనివలన రాబోయే రోజుల్లో నిరుద్యోగం, వలసలు పెరుగుతాయని అన్నారు. పంచాయతీలు తమ అధికారాలు, హకులు కోల్పోతాయని వాపోయారు.కాంగ్రెస్ పార్టీ దేశవా ్యప్తంగా పేద ప్రజలకు అండగా ఎంజిఎన్ఆర్ఇజిఎ పరిరక్షణ పోరాటం చేస్తుందని, హామీతో కూడిన పని,హా మీతో కూడిన వేతనం,హామీతో కూడిన జవాబుదారితనం కల్పించాలని ఎన్జీఎన్ఆర్ఇజిఎ చట్టాన్ని యధాతథంగా రాజ్యాంగబద్ధ హక్కుగా పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.కనీస వేతనం 400 నిర్ణయించాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.కేంద్ర ప్రభుత్వ పెత్తన దారి వ్యవస్థను వ్యతిరేకిస్తూ ఫెడరల్ వ్యవస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని తెలిపారు.దీజీ అంటేనే బాబు, జగన్ పవన్ అనే విధంగా బీజేపీ పార్టీ చేసే అన్ని నల్ల చట్టాలకు ఈ ప్రాంతీయపార్టీలు కేంద్రంలో మద్దతు తెలపడం రాష్ట్ర ప్రజల దౌర్భాగ్యం.ఈ రాష్ట్రంలో ప్రజల పక్షన పోరాడే పార్టీ కాంగ్రెస్ పార్టీ, రాష్ట అధ్యక్షరాలు షర్మిలమ్మ గారి నాయకత్వంలో ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించే వరకు కాంగ్రెస్ నేతలు పోరాటాలు చేస్తాం. ఆంధ్రప్రదేశ్ పంచాయతీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ గారు మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టం కింద ఒకే రోజు అన్నీ పంచాయతీ లలో గ్రామ సభల తీర్మానం చేయడం చూశాం, కానీ ఈ పథకం నిర్వీర్యం అయిపోతుంటే కనీసం మాట్లాడక పోవడం బాధాకరం.అనంతరము మనుబోలు మండలంలోని అక్కంపేట గ్రామ సర్పంచ్ శ్రీమతి నారపరెడ్డి జాంబవతి గారు, ఉపాధిహామీ చట్టాన్ని పునరుద్ధరించాలని చేసిన గ్రామసభ తీర్మానంను తమ కుమారుడు జిల్లా పార్టీ అధ్యక్షులు నారపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి గారికి అందించి పోరాటానికి మద్దతు తెలిపారు. ఈ పోరాటానికి మద్దతు తెలిపిన వామపక్ష పార్టీ నేతలకు, రైతు సంఘం నాయకులకు ధన్యవాదాలు తెలియచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు డాక్టర్ యశోధర గారు, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్ఫాన్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అడ్వకేట్ కే సంజయ్ కుమార్, పార్టీ కార్యాలయం ఇంచార్జ్ అడ్వకేట్ సుధీర్ , రూరల్ నాయకులు మల్లికార్జున్ రెడ్డి, ఎన్ ఎస్ యు ఐ రాజా ,నియోజకవర్గాల కోఆర్డినేటర్లు సీనియర్ నాయకులు మైనార్టీ నాయకులు యువజన నాయకులు పాల్గొన్నారు.

# ఈనెల 12న సోమవారం కలెక్టరేట్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం)

అర్జీలను meekosam.ap.gov.in వెబ్సైట్ నందు నమోదు చేసుకోవచ్చు

అర్జీలపై సమాచారం కొరకు మీకోసం

కాల్ సెంటర్ నెంబర్ 1100 ను సంప్రదించగలరు

జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్



**మదనపల్లి, జనవరి 11 ప్రజా జ్యోతి :** ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు ఈనెల 12న సోమవారం ఉదయం 10.00గం.ల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని అన్నమయ్య జిల్లా కేంద్రం మదనపల్లి తో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.అర్జీదారులు వారి యొక్క అర్జీలను జిల్లా కలెక్టరేట్ కు వచ్చే అవసరం లేకుండా meekosam.ap.gov.in వెబ్సైట్ నందు నమోదు చేసుకోవచ్చని, వారి యొక్క అర్జీల నమోదు మరియు నమోదైన అర్జీల యొక్క ప్రస్తుత స్థితికి సంబంధించిన సమాచారాన్ని తెలుసుకునేందుకు 1100 నెంబర్ను సంప్రదించగలరని ఆ ప్రకటనలో పేర్కొన్నారు అర్జీదారులు తమ అర్జీలను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు.

# బుట్టా ఫౌండేషన్ అధినేత బుట్టా శివ నీలకంఠ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరుపుకున్నారు



**ఎమ్మిగనూరు జనవరి 11(ప్రజా జ్యోతి ):** వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు పార్లమెంట్ సమన్వయకర్త, మాజీ ఎంపీ బుట్టా రేణుక భర్త, పార్టీ సీనియర్ నాయకులు మరియు బుట్టా ఫౌండేషన్ అధినేత బుట్టా శివ నీలకంఠ 12-01-2026 పుట్టినరోజు సందర్భంగా, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ముందస్తుగా ఈరోజు ఎమ్మిగనూరు పట్టణంలో పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మిగనూరు పట్టణ ప్రధాన కార్యదర్శి గుడికల్ అల్తాఫ్, పట్టణ కార్యదర్శి గురువ మాభాష, ముస్లిం సంప్రదాయ పద్ధతిలో టోపీ దరింపజేసి, శాలువాలతో బుట్టా శివ నీలకంఠ గారిని సన్మానించి హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలిచింది.ఈ వేడుకల్లో ఎమ్మిగనూరు నియోజకవర్గ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగ అధ్యక్షులు ఎమ్మిగనూరు మునిసిపల్ వైస్ చైర్మన్ డి. నజీర్ అహమ్మద్, 31వ వార్డు ఇంచార్జ్ పాల శ్రీనివాస్ రెడ్డి, 5వ వార్డు నాయకులు ఇబ్రహీం, ఎమ్మిగనూరు మండల కార్యదర్శి తిమ్మాపురం బజారి, రామాంజినేయులు, ఉరుకుందు, కోట వీరేష్, తదితర వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను మరింత శోభాయమానంగా నిర్వహించారు.పార్టీ బలోపేతానికి, ప్రజాసేవకు నిరంతరం కృషి చేస్తున్న బుట్టా శివ నీలకంఠ నాయకులు, కార్యకర్తలు దీర్ఘాయుష్షు, ఆరోగ్యం, ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షంచారు.

## ఈ రోజు ఉదయం 10.17 నిమిషాల నుండి కొనసాగుతున్న

# పీఎస్ఎల్వీ-సీ62 రాకెట్ ప్రయోగం కౌంట్ డౌన్

**సోమవారం ఉదయం 10.17 నిమిషాలకు ప్రయోగం**

**తిరుమల శ్రీవారి తో పాటు శ్రీకాళహస్తి,చెంగాళమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఇస్రో చైర్మన్,సిబ్బంది**

**పీఎస్ఎల్వీ రాకెట్ ప్రయోగాల్లో ఇది 64వది. ఈ మిషన్ ద్వారా మన దేశానికి చెందిన EOS - చీ1 ఉపగ్రహం తో పాటు 8 విదేశీ ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపనున్న ఇస్రో**

**భారత సైనిక రక్షణ అవసరాలకోసం ఉపయోగ పడనున్న ఈఓఎస్-ఎన్1 ఉపగ్రహం**



**జనవరి 11 ప్రతినిధి (ప్రజా జ్యోతి ):** శ్రీహరికోట అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుంచి సోమవారం ఉదయం 10.17 గంటలకు పీఎస్ఎల్వీ సీ-62 రాకెట్ ను ఇస్రో ప్రయోగించనుంది. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. రాకెట్ ప్రయోగానికి 24 గంటల ముందు ఆదివారం ఉదయం 10.17కు కౌంట్ డౌన్ ప్రారంభం కానుంది. న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్ (ఎన్ఎస్ఐఎల్) రూపొందించిన తొమ్మిదో పూర్తిస్థాయి వాణిజ్య ఉపగ్రహమిది. ఈ ప్రయోగం నేపథ్యంలో ఇస్రో చైర్మన్ డాక్టర్ వి. నారాయణన్, శాస్త్రవేత్తలు శనివా రం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీకాళహస్తి ముక్కంటి, సూళ్లూరుపేట చెంగాళమ్మ ఆలయాల్లోనూ పూజలు చేశారు. రాకెట్, ఉపగ్రహ నమూనాలను శ్రీవారి పాదాల వద్ద ఉంచి పూజలు చేయించారు. ఇస్రో చైర్మన్ నారాయణన్ తిరుమలలో మీడియాతో మాట్లాడారు. 'పీఎస్ఎల్వీ సీ-62 రాకెట్ ద్వారా ఈఓఎస్-ఎన్1 ఉపగ్రహాన్ని కక్ష్యలోకి పంపనున్నాం. దేశ రక్షణ రంగానికి ఇది అత్యంత కీలకం. 2026లో ఇస్రో చేపడుతున్న తొలి ప్రయోగమిది. పీఎస్ఎల్వీ రాకెట్ ప్రయోగాల్లో ఇది 64వది. ఈ మిషన్ ద్వారా 8 విదేశీ ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపుతున్నాం. ఇప్పటి వరకు 442 విదేశీ ఉపగ్రహాలను ఇస్రో ప్రయోగించింది' అని వివరించారు.

# రాయచోటి జిల్లా కేంద్రాన్ని మార్పుచేసే విషయంలో నోటిఫికేషన్ ఇవ్వకుండానే నిర్ణయం తీసుకోవడం దారుణం

**జిల్లా కేంద్రాన్ని లేకుండా చేసి రాయచోటి ప్రజల గుండెలపై తన్నిన చంద్రబాబు ప్రభుత్వం**

**జిల్లా కేంద్రంలేని లోటును మాయమాటలతో కప్పిపుచ్చలేరు**

**రాయచోటి ప్రజల ఆవేదనను ఇకనైనా పట్టించుకుని యథతథంగా జిల్లా కేంద్రంగా రాయచోటిని కొనసాగించాలి**

**రాయచోటి ప్రాంత రైతులు, యువత, వ్యాపారస్తులు,ఉద్యోగుల ను కోలుకోకుండా దెబ్బ తీశారు**

**లక్షల కోట్ల రూపాయల పెరిగిన సంపదను రాయచోటి ప్రజలకు దక్కకుండా దగా చేశారు**

**రాయచోటిలో నిర్వహించిన మీడియా సమావేశంలో వైఎస్ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి**




**రాయచోటి జనవరి 11 ప్రజా జ్యోతి :** రాయచోటి జిల్లా కేంద్రాన్ని మార్పుచేసే విషయంలో నోటిఫికేషన్ ఇవ్వకుండానే నిర్ణయం తీసుకోవడం దారుణమని వైఎస్ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి అన్నారు.ఆదివారం రాయ చోటి పట్టణం ఎస్ ఎన్ కాలనీలోని వైఎస్ఆర్ సిపి కార్యాల యం లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ఎంత ఆందోళన చెందినా, తమ ఆవేదనను వెలిబుచ్చుకున్నా, ముందుగా ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వకుండా, ఒక్క రోజులోనే నిర్ణయం తీసుకుని నిర్ధాక్షణంగా లక్షలాది మంది ప్రజల గొంతు కోసారన్నారు.నియోజక వర్గ ప్రజల ఆవేదనను చెప్పాలనుకున్నా, మా ఆలోచనలును పరిశీలన చేయకుండా గతంలో నేను జరుగుతున్న పరిణా మాలను వివరిస్తున్నా, ఈ ప్రభుత్వం చేస్తున్న చాలా మందికి కుట్రలు, మోసాలును పసిగట్టలేకపోయారని, ప్రజలచే ఏర్పడిన ప్రభుత్వం ప్రజాస్వామ్యంలో అంత పెద్ద మోసం చెయ్యరు అనుకున్న పరిస్థితుల్లో నిర్దాక్షణంగా రాయచోటి ప్రాంతాన్ని దారుణంగా విచ్ఛిన్నం చేశారన్నారు. చెప్పుకుంటే పోయే బాధ కాదన్నారు.ఎక్కడ త్వరగా ప్రజల నుంచి తిరుగు బాటు వస్తుందనో, న్యాయపరంగా చిక్కులు ఎదురవుతా యోనన్న భయంతో పక్కా ప్రణాళికలుతో, మోసపూరితనంగా జిల్లా కేంద్ర మార్పుకు నిర్ణయం తీసుకున్నారన్నారు.

**144 పేజీల పిల్ -- ప్రభుత్వ తప్పిదాలపై బలమైన ఆధారాలు**

రాయచోటి ప్రాంతానికి జరిగిన అన్యాయానికి మేలు జరగడం కోసం న్యాయస్థానాల ద్వారా పోరాడితే న్యాయం జరుగుతుందన్న నమ్మకంతో జిల్లా కేంద్రాన్ని యధాతథంగా కొనసాగించాలన్న లక్ష్యంతో, ప్రభుత్వ తీరును ప్రశ్నిస్తూ, మా శక్తి కొద్దీ గౌరవ హైకోర్టు నందు తమ వాదనలను వినిపించామన్నారు. రాయచోటి ప్రాంత ప్రజల ఆవేదనను, ప్రభుత్వం ప్రొసీజర్ పాలో కాకుండా మోసం చేసిన విషయాలను, నోటిపికేషన్ లో పూర్తి విషయాలను తెలపకుండా, ఏక పక్షంగా తీసుకున్న నిర్ణయంపైనా, ప్రజా స్వామ్య స్ఫూర్తిని దెబ్బతీసిన నిర్ణయాలపై ప్రశ్నిస్తూ గౌరవ న్యాయస్థానం లో తాము వేసిన పిటిషన్ పైన,తమ తరపున ఏర్పాటుచేసుకున్న న్యాయవాది అద్భుతంగా వాదనలును ఇరవై ఐదు నిమిషాల పాటు రాయచోటి ప్రాంత ప్రజల ఆవేదనను న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లారన్నారు. ఫైల్ అయిన పిల్ 144 పేజీల పిల్ డాక్యుమెంట్ ను మీడియా సోదరులందరికీ పంపించడం జరిగిందన్నారు.తాము దాఖలు చేసిన పిల్ లీగల్ గా, పర్ఫెక్ట్ గా ఉందన్నారు. జిల్లా కేంద్ర మార్పులో ప్రభుత్వం వారు సరైన విధానాన్ని పాటించలేదన్నారు.ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తప్పు అని నిరూపించే అవకాశం ఖచ్చితంగా అందులో ఉందన్నారు. అన్ని విషయాలును విన్న గౌరవ న్యాయమూర్తి గారు ఇప్పుడున్న పరిస్థితుల్లో , పరిపాలనా విధానమైన నిర్ణయాలలో వెంటనే స్టే ఇవ్వలేమని, 8 వారాలపాటు గడువు ఇస్తామని న్యాయమూర్తి గారు చెప్పడంతో, ఇక్కడున్న జిల్లా ప్రభుత్వ కార్యాలయాన్నింటి నీ తరలిస్తున్నారని తమ తరపున పోరాడుతున్న న్యాయవాది వాదనలు వినిపించారని, దాంతో 4 వారాలకు వాయిదా వేశారన్నారు. కానీ న్యాయస్థానంలో మనకు న్యాయం జరుగుతుందని నమ్మకం ఉందన్నారు.

**కాలరాత్రి జిల్లా కేంద్రం మార్పు -- పక్కా కుట్రతో రాయచోటి ప్రజలకు వెన్నుపోటు**

2026 జనవరి 1 నుంచి కులగణన ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రాంతాల సరిహద్దులు కూడా మార్చకూడ దన్న నిబంధనలు ఉన్నాయన్నారు. అయితే జనవరి 1 వ తేదీ కి ముందుగానే, డిసెంబర్ 29 న జిల్లా కేంద్రాన్ని మార్పు నిర్ణయాన్ని తీసుకుని , కాలరాత్రి గా మార్చారన్నారు. అవకాశం లేకుండానే జి ఓ ఇచ్చి, 31 వ తేదీనే ఇక్కడ ఉన్న ప్రభుత్వ కార్యాలయాలలోని రికార్డులును, ఫర్నీచర్ ను ట్రక్కులలో తరలింపులు చేపట్టడం చూసిన ప్రతిఒక్క రాయచోటి ప్రాంత వాసి కన్నీరు పెట్టుకున్నారన్నారు. సాధించుకున్న జిల్లా కేంద్రాన్ని తీసేసే హక్కు ఈ ప్రభుత్వానికి లేదని ఆయన స్పష్టం చేశారన్నారు.మా మనోభావాలును ఎందుకు దెబ్బతీసారని, ఎందుకు మోసం చేసారనిఆయన ప్రశ్నించారు. ఎన్నికలు మూడేళ్ళకు పైగా ఉన్నాయని, ఈ విషయాన్ని అప్పటికి ప్రజలు మరచిపోతారులేనన్న అధికార పార్టీ నేతలు వ్యవహరిస్తున్నారన్నారు. మీరు తన్నింది రాయచోటి ప్రాంత ప్రజల గుండెల పైన.. మమ్ములను గుండె కోతకు గురి చేశారు..ఈ ప్రాంత ప్రజలను కోలుకోకుండా దెబ్బకొట్టాలన్న కుట్రలతో, ప్రణాళికలతో , మోసపూరితనంగా జిల్లా కేంద్రాన్ని మార్పు చేశారన్నారు.

**జిల్లా కేంద్రంలేని లోటును మాయమాటలతో కప్పిపుచ్చలేరు**

జిల్లా కేంద్రం మార్పుపై మీరు కప్పిపుచ్చే మాటలు ఎన్ని మాట్లాడినా ఆ లోటును పూడ్చలేరన్నారు .గతంలో అన్నమయ్య జిల్లాలో ఆరు నియోజక వర్గాల నుంచి, జిల్లా కేంద్రంలో రాయచోటిలో 84 ప్రభుత్వ ప్రధాన జిల్లా కార్యాలయాలలో వివిధ పనులు నిమిత్తం రోజూ మూడు,నాలుగు వేల మంది ప్రజలు వచ్చి వెళ్ళేవారన్నారు. ఇక్కడ అన్ని రకాల వ్యాపారాలు బాగా జరిగేవన్నారు. సంపద సృష్టిస్తామని చెప్పే చంద్రబాబు నాయుడు గారి నిర్ణయం వల్ల రాయచోటి కి 30 కిలోమీటర్ల చుట్టుపక్కల భూముల రేట్లు పూర్తిగా తగ్గిపోయా యన్నారు .అన్నివ్యాపారాలు పూర్తిగా పడిపోయాయన్నారు.

**రాయచోటి ప్రజల ఉసురు తగులుతుంది**

రాయచోటి ప్రాంత ప్రజల లక్షల కోట్ల రూపాయల సంపదను నష్టం చేసిన చంద్రబాబు నాయుడు చరిత్ర హీనుడిగా నిలుస్తారన్నారు. మేము ఏమి తప్పు చేశాం..మా ఉసురు నీకు తగులుతుంది.. మీ పార్టీ కూడా ఇక్కడ విజయం సాధించింది.. చెప్పుకుంటే తీరే బాధ కాదిది..ప్రభుత్వ జిల్లా ప్రధాన కార్యాలయాలను ఒకొక్కటిగా తరలిస్తుంటే మమ్ములను గుండెలపైన తన్ని..మమ్ములను కత్తులతో పొడిచి తీసుకువెళ్తున్నట్లుగా ఉందన్నారు. మేము తిరుగుబాటు చేసి ఉండక పోవచ్చు గానీ, మా బాధను తెలియపరుచుకోలేక కూడా పోతున్నామన్నారు. నిర్దాక్షణ్యంగా చేయాల్సిన అవసరం ఏమొచ్చిందన్నారు. డిసెంబర్ 31 వ తేదీలోగా జిల్లా కేంద్రాన్ని మార్పు చేసి, మేము తిరిగి పోరాడాలన్నా ,మా భావాలు చెప్పాలన్నా అవకాశం లేకుండా చేయడానికి కులగణన చేయడానికి రెండేళ్లు పడుతుందని, ఇంకేమి చేయలేమని చెప్పి తప్పించుకోవడానికే కుట్రలు చేయడం సమంజసమా అని ఆయన ప్రశించారు. అన్ని వర్గాల ప్రజలు,రైతులు, యువతను, వ్యాపారులను మోసం చేశారన్నారు. ప జిల్లా కేంద్రం రాయచోటికి చుట్టుప్రక్కల పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులకు హెచ్ ఆర్ ఏ 4 శాతం అదన ంగా అందేదని, ఇప్పుడు ఈ ప్రాంతంలోని ప్రతి ఉద్యోగికి రూ 4 వేలనుంచి రూ 7 వేల వరకు జీతాలు తగ్గుతాయన్నారు.

**రాయచోటి ప్రజల భవిష్యత్ ను నాశనం చేసే హక్కు మీకెవరు ఇచ్చారు?**

ఈ ప్రాంతప్రజల భవిష్యత్తును నాశనం చేసే హక్కు మీకెవరు ఇచ్చారని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. రానున్న భవిష్యత్తు తరాలకు అందే లబ్ధి,ప్రయోజనాలను ఎందుకు మీరు తీసేసారని ఆయన ప్రశించారు. మీ చేతిలో ప్రభుత్వం ఉందని, ఏమి చేసినా చెల్లుబాటు అవుతుందని మీరు అనుకుంటున్నారేమో..ఈ ప్రాంత ప్రజల ఉసురు తగులుతుందన్నారు. ఈ ప్రాంత ప్రజా ప్రతినిధిగా 2009 డిసెంబర్ 9 న ఉమ్మడి రాష్ట్ర విభజన నిర్ణయాన్ని ప్రకటించిన సమయంలో 8 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేశారన్నారు. 2014 వరకూ పోరాడుతూ నిలిపామన్నారు.ఆ రోజు నిర్దాక్షణ్యంగా రాత్రికి రాత్రే రాష్ట్రాన్ని చీల్చి, ప్రజలను గుండె కోతకు గురిచేసిన ఒక పార్టీ కాలగర్భంలో కలిసిపోయిందని,ఈ రోజు మీకూ అదే గతి పడుతుందన్నారు.తామూ ఏ ప్రాంతానికి వ్యతిరేకం కాదని ఎన్నో సార్లు చెప్పామన్నారు. మాకు వచ్చిన జిల్లాను, ఎందుకు తీసేసారని, మాకు జరుగుతున్న మంచిని ఎందుకు లేకుండా చేస్తున్నారని ఆయన ప్రశించారు.

**ఏవో అభివృద్ధి పనులు చేస్తే అవి జిల్లా కేంద్రానికి సమానంగా సరిపోతాయా?**


జిల్లా కేంద్ర స్థానంలో ఏవో అభివృద్ధి పనులు చేస్తామని చెప్పితే, అది జిల్లా కేంద్రానికి సమానంగా సరిపోతాయా అని ప్రశించారు. ఎన్నో తరాలకు ఉపయోగపడే జిల్లా కేంద్రాన్ని తీసేస్తే మళ్లీ ఇలాంటి మాటలు మాట్లాడడం సమంజసమా అని ఆయన నిలదీశారు.కులగణన సర్వే జిఓ ఈ వారంలోనే వచ్చిందని, కులగణన సర్వే అయిన తరువాత పెరిగిన జనాభా ప్రకారం నియోజక వర్గాల పునర్విభజన తరువాత జిల్లాల విభజన జరిగివుంటే బాగుండేదన్నారు. రాజధాని అమరావతి నిర్మాణంలో లక్షల కోట్ల రూపాయలను రాష్ట్రం లోని అన్ని జిల్లాల సొమ్మును ఖర్చు పెడుతుంటే తామేమీ మాట్లాడడం లేదన్నారు. రాష్ట్రానికి కదా అని త్యాగం చేస్తున్నారన్నారు.

# మడకశిరలో టీడీపీ నేతల ఆత్మీయ సమావేశాలు

## పార్టీ బలోపేతానికి నేతల పర్యటన

**మడకశిర, జనవరి 11 (ప్రజా జ్యోతి): మడకశిర ఇంచార్జ్:** మడకశిర నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలతో ఆత్మీయ సమావేశాలు సోమవారం (జనవరి 12)న నిర్వహిం చనున్నారు. ఈ సమావేశాల్లో మడకశిర శాసనసభ్యుడు, టీటీడీ బోర్డు సభ్యుడు, జిల్లా టీడీపీ అధ్యక్షుడు ఎం.ఎస్.రాజు మరియు మాజీ శాసనమండలి సభ్యుడు, టీటీడీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి పాల్గొననున్నారు.అధికారిక సమాచారం ప్రకారం, మడకశిర పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి నేతల పర్యటన ప్రారంభమవుతుంది. మధ్యాహ్నం 12 గంటలకు రొళ్ల మండలం, గుడ్డుగుర్కి గ్రామ పంచాయతీ పరిధిలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం జరగనుంది. అనం తరం మధ్యాహ్నం 2 గంటలకు అదే మండలంలోని కాకి గ్రామపంచాయతీలో మరో ఆత్మీ య సమావేశం నిర్వహించనున్నారు.ఈ సమావేశాల ద్వారా పార్టీ శ్రేణులతో నేరుగా మమేక మవుతూ, స్థానిక సమస్యలు, పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. కార్యకర్తల ఉత్సాహాన్ని పెంపొందించేందుకు, పార్టీ పునాదులను మరింత బలపరిచేందుకు ఈ సమావేశాలు దోహదపడతాయని భావిస్తున్నారు

# వివాహ వేడుకలలో పాల్గొన్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, డాక్టర్ లక్ష్మ ప్రసాద్ రెడ్డి



**రాయచోటి, జనవరి 11 ప్రజా జ్యోతి :** రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, టిడిపి నాయకులు డాక్టర్ లక్ష్మ ప్రసాద్ రెడ్డి గారు, ఆదివారం రాయచోటి పట్టణం, చిత్తూరు రింగ్ రోడ్డు సుధా ఫంక్షన్ హాల్ నందు జరిగిన షేక్ యాసిన్, నూర్ ఆయిన్ ల నిఖా వేడుకలలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.సాంప్రదాయబద్ధంగా వివాహం చేసుకొని ఒక్కటైన నూతన జంట నిండు నూరేళ్లు, సుఖసంతోషాలతో జీవించాలని మంత్రివర్యులు ఆకాంక్షంచారు.ఈ సందర్భంగా పెళ్లి వారు మంత్రివర్యులకు పూల బొకేలతో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రజకులకు కేటాయించిన ధోబి ఘాటు స్థలాన్ని రజకులకే ఇవ్వాలి




## - సిపిఐ నాయకులు డిమాండ్

**బద్వేల్ జనవరి 11 (ప్రజా జ్యోతి న్యూస్) :** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ బద్వేల్ పట్టణ సమితి ఆధ్వర్యంలో స్థానిక శివాలయం దగ్గర ఉన్న ధోబి గాట్ ను ఆదివారం నాడు పరిశీలించారు. ఈ సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ బద్వేల్ పట్టణ కార్యదర్శి పి.బాలు మాట్లాడుతూ..ప్రభుత్వ అధికారులు బద్వేలు మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 150 కుటుంబాల రజకులకు జీవనోపాధి కోసం దోబీ ఘాటును అప్పటి కలెక్టర్ గారు స్థానిక ఎమ్మార్వో గారు ఎకరా 20 సెంట్లు స్థలాన్ని కేటాయించి అక్కడ దోబీగాట్ ఏర్పాటు చేసి ఇవ్వడం జరిగిందని నేడు దాన్ని అధికారులు ఇతర అవసరాల కోసం ఉపయోగిస్తామని చెప్పడం సిగ్గుచేటని ధోబిగాట్ లేకుండా ఇతర అవసరాల కోసం చేయడం వల్ల 150 కుటుంబాలు వీధిలో పడతాయని పట్టణంలో రజకులు బట్టలు ఉతకడానికి వేరే ప్లేస్ లేదని ఉన్నదాన్ని అధికారుల నిర్లక్ష్యం వల్ల ఉపయోగంలో లేదని తక్షణమే అధికారులు ఆ దోబిగాట్ ను అభివృద్ధి చేసి రజకుల జీవనోపాధిని దృష్టిలో పెట్టుకోవాలని అధికారులకు సూచించడం జరిగింది . కాదు కూడదు అంటే మాత్రం రజక సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టాల్సి వస్తుందని వారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి పొంగూరు నాగరాజు, మాడపూర్ వెంకటసుబ్బయ్య, వెంకటరమణ, గొడ్లవీటి పెద్ద వెంగమ్మ తదితర రజక సంఘ నాయకులు మరియు చేతి వృత్తిదారుల సంఘ నాయకులు వెంకటరామయ్య, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

# అసాంఘిక కార్యక్రమాల పై కఠిన చర్యలు.. సిఐ గంగాధర్



**ఆత్మకూరు జనవరి 11,ప్రజా జ్యోతి:** ఆత్మకూరు సర్కిల్ పరిధిలో సంక్రాంతి పండుగ సందర్భంగా కోడిపందాలు, పేకాట, ఇతర రకాల జూదాలు ఆడడం నిషేధమని ఆత్మకూరు సిఐ గంగాధర్ తెలిపారు.. సంక్రాంతి పండుగలు సాంప్రదాయ బద్ధంగా సంతోషంగా నిర్వహించుకోవాలని అసాంఘిక కార్యక్రమాలపై దృష్టి సారిస్తే కఠిన చర్యలు చేపడతామని సీఐ తెలిపారు. గ్రామాలలో ఎటువంటి అసాంఘిక కార్యక్రమం జరగకుండా ముందస్తుగా తమ సిబ్బందితో నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు..

# తిమ్మాపురం క్రాస్ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం

### రోడ్డు ప్రమాదంలో విద్యార్థిని దుర్మరణం
### కుడికాలు తొడ వరకు విరిగి పక్కన పడిన సంఘటన
### సంక్రాంతి పండుగకు ఇంటికి రమ్మంటే
### శవమై వచ్చావా తల్లి -భోరుణ వినిపిస్తున్న తండ్రి



**పీలేరు జనవరి 11 ప్రజా జ్యోతి :** కారు ద్విచక్ర వాహనంను ఢీకొన్న ప్రమాదంలో విద్యార్థిని కి కుడికాలు తొడ వరకు విరిగి పక్కన పడిగి దుర్మరణం చెందిన హృదయ విదారక ఘటన కె.వి పల్లి మండల పరిధిలో చోటుచేసుకుంది.వివరాలు సంబేపల్లి మండలం, రెడ్డివారి పల్లి పంచాయతీ నడిమి రాజు వారి పల్లి హరిజనవాడకు చెందిన ఇసుకపల్లి కృష్ణయ్య కుమార్తె శివరాణి (17) తిరుపతిలోని శ్రీ చైతన్య కళాశాలలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతోంది సంక్రాంతి సెలవులు రావడంతో సంక్రాంతి సెలవులకు ఇంటికి రావడం కోసం తిరుపతిలోనే ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తున్న తన అన్న మల్లేశ్వర, శివరాణి ఇద్దరు ద్విచక్ర వాహనంలో తమ స్వగ్రామమైన దేవపట్ల సమీపంలోని రెడ్డివారి పల్లి గ్రామం నడిమి రాజు వారి పల్లికి వస్తూ ఉండగా శనివారం మధ్యాహ్నం సుమారు 2;30 గంటల ప్రాంతంలో కేవీ పల్లి మండల పరిధిలోని కర్నూలు చిత్తూరు జాతీయ రహదారి పై మహల్ రాజు పల్లి సమీపంలో కడప నుండి చిత్తూరుకు వెళుతున్న ఎస్ఆర్ పురం మండలం కు చెందిన ఓ కుటుంబం కారులో వస్తూ ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది దీంతో ద్విచక్ర వాహనం వెనుక భాగంలో కూర్చుని ఉన్న శివరాణి కుడికాలు తొడ భాగం వరకు విరిగి రోడ్డుపై పడింది మల్లేశ్వర కు చేతులు స్వల్ప గాయాలయ్యాయి దీంతో సంఘటనా స్థలం నుండి స్థానికులు108 లో పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తూ ఉండగా మార్గమధ్యంలో శివరాణి మృతి చెందింది. ఈ మేరకు కేవీ పల్లి సబ్ ఇన్స్పెక్టర్ వెంకట శివకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మట్టిలో బంగారాన్ని పండించండి

### రైతులకు పంటల మెలుకువలపై లీడ్ క్రాఫ్ట్ అవగాహన సదస్సు



**కూనవరం,జనవరి 11 (ప్రజాజ్యోతి):** కూన వరం,వి.ఆర్.పురం మండలాలకు చెందిన రైతాంగానికి లీడ్ క్రాఫ్ట్ సంస్థ తెలుగు రాష్ట్రాల డెవలప్‌మెంట్ ఆఫీసర్ పద్మ వ్యవసాయంలో తీసుకోవాల్సిన కీలక మెలుకువలను వివ రించారు. పంట పొలాల్లో తప్పనిసరిగా అం దించాల్సిన 16 రకాల పోషకాలు, వాటిని ఏ దశలో ఎంత మోతాదులో వినియోగి ంచాలి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి రైతులకు సవివరంగా అవగాహన కల్పించారు .ప్రధా నంగా పంటలను తీవ్రంగా నష్టం చేసే ఎల్ల మజాక్ బొబ్బ తెగులు నివారణ కోసం తీసుకో వాల్సిన ముందస్తు చర్యలు, సరైన మందుల వినియోగ విధానం గురించి రైతాంగానికి సూచనలు అందించారు. సమతుల్య పోష కాలు అందించినప్పుడే పంట దిగుబడి పెరిగి, రైతుకు లాభదాయకంగా ఉంటుందని పద్మ తెలిపారు.ఈ అవగాహన కార్యక్రమంలో ఆచంట శ్రీను, దీకొండ గంగాధర్, డి. రాంబాబుతో పాటు అధిక సంఖ్యలో రైతులు పాల్గొని, తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

# వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర మైనార్టీ సంయుక్త కార్యదర్శిగా షేక్ నవాజ్ అలీ



**రాయచోటి జనవరి 11 ప్రజా జ్యోతి :** వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర మైనారిటీ జాయింట్ సెక్రెటరీ గా బాధ్యతలు కల్పించిన రాష్ట్ర అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వర్యులు శ్రీ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారికి, రాష్ట్ర మైనారిటీ చైర్మన్ వికె ఖాదర్ భాషా గారికి, రాజంపేట ఎంపీ శ్రీ మిథున్ రెడ్డి గారికి మరియు పెద్దన్నలా అన్నీ అంశాల్లో నాకు వెన్నుదన్నుగా నిలిచి, నాకు రాష్ట స్థాయి పదవి అలంకరించిన వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడి కోట శ్రీకాంత్ రెడ్డి గారికి, గౌరవనీయులైన పెద్దాయన ఎమ్మెల్యే శ్రీ పెద్ది రెడ్డి రామ చంద్రా రెడ్డి మరియు అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్యే శ్రీ అమర్నాథ్ రెడ్డి గారికి, వైఎస్ఆర్ సీపీ పార్టీ అన్ని విభాగాల అధ్యక్షలకు, పార్టీ గౌరవ కార్యకర్తలు ప్రతిఒక్కరికీ నా కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు పేరు పేరున ప్రత్యేక కృతజ్ఞతాభివందనాలు వైఎస్ఆర్ సీపీ పార్టీ లో సామాన్య కార్యకర్తగా మొదలైన నా ప్రస్థానం నేడు రాష్ట్ర స్థాయి పదవి లో అవకాశం రావడం ఎంతో గర్వకారణం. ఈ పదవీ బాధ్యతలను పూర్తి క్రమశిక్షణ తో పాటిస్తూ మైనారిటీ విభాగం ను బలపరుస్తూ , మైనారిటీలకు సేవ చేస్తూ, పార్టీ పేరును కూడా ఎంతో ఉన్నత స్థాయిలో తీసుకువెళతాను అంటూ తెలిపారుస్తున్నాను.నవాజ్ క్రిష్
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనారిటీ జాయింట్ సెక్రెటరీ.

# రోడ్డు పోయిందండి మహా ప్రభో.. ఏళ్ళు గడుస్తున్న కనపడని అభివృద్ధి

**వేలేరుపాడు : 11 జనవరి వేలేరుపాడు :ప్రజాజ్యోతి రిపోర్టర్ (శివరామ్ ) :** వేలేరుపాడు మండలంలోని మల్లారం, జిన్నెలగూడెం రహదారి పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది, ఈయొక్క రహదారి భూదేవిపేట నుండి జిన్నెలగూడెం వరకు అక్కడ నుండి గొల్లగూడెం వరకు సుమారు నాలుగు కిలోమీటర్ల మేర రహదారి అస్తవ్యస్తంగా మారిపోయింది, ఈ యొక్క మూడు గ్రామాల ప్రజలు నిత్యం ఈ రహదారి మీద రాకపోకలు నిర్వహిస్తూ నరకం అనుభవిస్తున్నారు, సుమారు పది సంవత్సరాల నుండి ఈ యొక్క రహదారి పరిస్థితి ఇలాగే ఉంది అంటే అర్థం చేసుకోవచ్చు, ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే అంబులెన్సు రావాలి అన్నా ఇబ్బందిగా ఉంటుంది అని ఈ గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, జిన్నెల గూడెనికి గొల్లగూడెం కి మధ్యన వాగు ఉండటం వలన ప్రతి సంవత్సరం వర్షా కాల సమయంలో ఇబ్బందిగా ఉంటుందని దానికి ప్రత్యా న్మయంగా వారధిని నిర్మిస్తే బావుంటుంది అని ఈ గ్రామాల ప్రజలు కోరుతున్నారు,ఈ లోపు ఏదైనా జరిగితే అంతే సంగతులు, ఈ యొక్క సమస్యను ప్రభుత్వం పట్టిం చుకుని రహదారిని పునర్నిర్మించాలని ప్రజలు కోరుకుం టున్నారు.






# పరిషత్ ఎన్నికల్లో ధర్మారంలో సత్తా చాటేందుకు సమిష్టిగా కృషి



రాంబాబును సన్మానించిన పార్టీ నాయకులు

**ధర్మారం :** రానున్న స్థానిక మండల పరిషత్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే ప్రధాన ధ్యేయంగా సత్తా చాటడానికి పార్టీ శ్రేణుల సమిష్టి కృషి చేస్తానని పెద్దపల్లి జిల్లా ధర్మారం బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు తుమ్మల రాంబాబు స్పష్టం చేశారు. రాష్ట్ర మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ రాంబాబును ధర్మారం పార్టీ పట్టణ అధ్యక్షుడిగా నియమించిన విషయం తెలిసిందే. కాగా ధర్మారం మండల కేంద్రం లోని ఆర్బీఎస్ జిల్లా మాజీ సభ్యుడు రామారావు స్వగృహంలో ఆయనను పార్టీ నాయకులు ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి తనను పార్టీ పట్టణ అధ్యక్షుడిగా రెండో సారి నియమించినందుకు పార్టీ అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, సహకరించిన పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్, ఇతర పార్టీ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మాజీ మంత్రి ఈశ్వర్ ఆదేశానుసార నడుచుకొని స్థానిక కమిటీ పార్టీ మాజీ ప్రతినిధులు, స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తల సహకారంతో ధర్మారంలో పార్టీని బలోపేతం చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. పార్టీకి పూర్వ వైభవం తీసుకువస్తానని ఆయన పేర్కొన్నారు. గత పది సంవత్సరాల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి ఈశ్వర్ చేసిన అభివృద్ధి పనులను వివరించి రాబోయే మండల పరిషత్ ఎన్నికల్లో ప్రజలను ఓట్ల అడిగి పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. స్థానిక ఎంపీటీసీ రెండు స్థానాల్లో పార్టీ అభ్యర్థుల విజయం కోసం సమిష్టిగా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. మాజీ మంత్రి ఈశ్వర్ ఆదేశాల మేరకు త్వరలో పార్టీ పట్టణ కమిటీని ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంల పార్టీ మండల అధ్యక్షుడు రాచూరి శ్రీధర్, ఏఎంసీ మాజీ చైర్మన్లు కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, గుర్రం మోహన్ రెడ్డి, ధర్మారం మాజీ సర్పంచ్ పూస్కురు జితేందర్ రావు, ఆర్బీఎస్ జిల్లా మాజీ సభ్యుడు పూస్కురు రామారావు, మండల పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ రఫీ, నంది మేడారం మాజీ ఎంపీటీసీ మిట్ట తిరుపతి, ధర్మారం మాజీ ఉప సర్పంచ్ ఆవుల లత, పార్టీ సోషల్ మీడియా మండలాధ్యక్షుడు దేవి నళినికాంత్, పార్టీ మండల ఉపాధ్యక్షులు గాజుల రాజు, నాడెం శ్రీనివాస్, వార్డు సభ్యుడు నార ప్రేమ్ సాగర్, మహిళ నాయకురాళ్లు కాంపల్లి అపర్ణ, రేగుల లక్ష్మి, పార్టీ నాయకులు పాక వెంకటేశం, సల్వాజీ మాధవరావు, అర్ధవెల్లి రాము, రాగుల మల్లేశం, ఎండీ షరీఫ్, అయిత వెంకటస్వామి, గోగు దేవేందర్, కాంపల్లి చందు, బోయిని మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# అక్రమాల పుట్ట



**ఆదిలాబాద్:** సర్వే భూరికార్డుల శాఖలో అక్రమాల పుట్ట పగులుతోంది. అధికారం అడ్డుపెట్టుకొని అడ్డగోలుగా అదనపు సేత్వార్లు (సప్లిమెంటరీ సేత్వార్) జారీ చేయడం, అసలు హక్కుదారుల వివరాలు నామరూపాలు లేకుండా చేయడంలో ఈ శాఖ సర్వేయర్లు, అధికారులు రియల్టర్లతో కలిసి నడిపిన అక్రమ భూ దందా ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. గతేడాది అక్టోబర్‌లో జిల్లా కేంద్రంలోని 65 సర్వే నంబర్‌లో కోట్ల విలువైన 2.10 ఎకరాల భూమికి సంబంధించిన వ్యవహారంలో సప్లిమెంటరీ సేత్వార్ జారీతోనే భూ అక్రమార్కులకు పని సులువైంది. ఈ వ్యవహారంపై బాధి తులు జిల్లా పోలీసులకు ఫిర్యాదు ఫిర్యాదు చేయడంతో బడా రియల్టర్లు, వ్యాపారులపై కేసు నమోదైన విషయం తెలిసిందే. ఓ సర్వేయర్‌పై కూడా పోలీసులు కేసు నమోదు చేసి రిమాం డ్‌కు తరలించిన విషయం విధితమే. తాజాగా మావల పరిధి లో జరిగిన మరో ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందింది.

**గతేడాదిలో..**

గత అక్టోబర్‌లో 65 సర్వే నంబర్‌లో 2.10 ఎకరాల భూమాఫియాకు సంబంధించిన వ్యవహారంలో పోలీసులు కేసు నమోదు చేయడం సంచలనం కలిగించింది. ఈడీ ఆధీనంలో, ఎస్బీఐ మార్టిగేజ్‌లో ఉన్న భూమికి సంబంధించి రియల్టర్లు కుమ్మక్కై మొదట తహసీల్దార్ కార్యాలయంలో అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకొని, ఎలాగైనా ఈ భూమిని ఆక్రమించాలనే ఉద్దేశంతో సర్వే అధికారుల ద్వారా సప్లిమెంటరీ సేత్వార్ తీసుకున్నారు. ఇలా భూములకు సంబంధించి అసలు హక్కుదారుల వివరాలను నామరూపాలు లేకుండా చేసి అదనపు సేత్వార్ జారీ ద్వారా అక్రమార్కులకు రెవెన్యూ, సర్వే, భూరికార్డుల శాఖ అధికారులు వంతుపాడుతూ వస్తున్నారు. తద్వారా ఏళ్లుగా ఒకే దగ్గర పనిచేస్తున్న ఈ శాఖలోని ఉద్యోగుల్లో కొంత మంది కోట్లకు పడగలెత్తారనే ఆరోపణలు లేకపోలేదు.

**తాజాగా మావలలో..**

మావలలో కోట్ల విలువైన 16 గుంటల భూమికి సంబంధించి జరిగిన భూమాఫియాపై బాధితులు 2018లో పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పట్లో కేసు నమోదు చేశారు. విచారణ ముందుకు సాగలేదు. తాజాగా ఆ బాధితులు మళ్లీ పోలీసులను ఆశ్రయించడం, జిల్లా పోలీసులు తిరిగి ఈ కేసుపై దృష్టి సారించడం సంచలనం కలిగిస్తోంది. మావల గ్రామ సర్వేనం.181/4లో అదనపు సేత్వార్ అక్రమంగా జారీ చేయడం, ఫోర్జరీ ఆరోపణలపై పోలీసులు మావల తహసీల్దార్‌ను కొన్ని వివరాలు ఇవ్వాలని వివరణ కోరడం సంచలనం కలిగిస్తుంది.

**భూమిపై హక్కును హరించివేశారు..**

మావలలో కోట్ల విలువైన ఈ భూమికి సంబంధించి ఓ బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. దీంతో పోలీసులు ఆ భూమికి సంబంధించి అదనపు సేత్వార్ జారీ విధానంపై వివరాలు కోరుతూ మావల తహసీల్దార్‌ను వాటిని పంపించాలని కోరడం ఇప్పుడు సంచలనం కలిగిస్తోంది. సర్వే రికార్డులను మార్చివేసి కొంత మంది అధికారులతో కలిసి అక్రమంగా ఆ భూమిని పొందారని, తద్వారా ఆ భూమిపై తన హక్కును హరించారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఇది ఓ భూమికి సంబంధించిన వ్యవహారమే అయినప్పటికీ జిల్లాలో రెవెన్యూ, సర్వే భూరికార్డుల శాఖల అధికారులు ఇటు రిజిస్ట్రేషన్, అటు అదనపు సేత్వార్లు జారీతో ఎలా అక్రమాలకు పాల్పడుతున్నారు.. అసలు హక్కుదారుల వివరాలను నామరూపాలు లేకుండా చేసి రియల్టర్లకు ఎలా వంతు పాడుతున్నారనేది తేటతెల్లం అవుతుంది.

**అదనపు సేత్వార్ జారీ విధానంపై ఆరా..**

అదనపు సేత్వార్ జారీలో జరుగుతున్న అక్రమాలపై పోలీసులు నిశితంగా దృష్టి సారించారు. ఈ సప్లిమెంటరీ సేత్వార్ జారీలో సర్వేయర్లు ఫీల్డ్ పరిశీలన నిర్వహించారా..? ప్రభావిత పట్టాదారులందరికి (పిటిషనర్‌తో సహా) నోటీసులు జారీ చేశారా..? అనే విషయాలపై స్పష్టతనివ్వాలని రెవెన్యూ అధికారులను పోలీసులు కోరడం జరిగింది. ఇదీ ఈ ఒక్క కేసు విషయంలోనే అనుకుంటే పొరపాటే. ఆదిలాబాద్ చుట్టుపక్కల అనేక భూములకు సంబంధించి సప్లిమెంటరీ సేత్వార్ల జారీలో జరిగిన అనేక మోసాలకు ఈ సేత్వార్ జారీ విధానంలో సర్వేయర్లు ప్రభుత్వ నిబంధనల ప్రకారం వ్యవహరించారా లేదా అనేది స్పష్టమవతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



## చైల్డ్ ఆర్టిస్ట్ నుంచి బోల్డ్ నిర్ణయాల వరకు.. తేజస్వి మదివాడ చెప్పిన జీవిత పాఠాలు

చిన్న వయసులోనే సినిమాల్లో అడుగుపెట్టి, క్రమంగా హీరోయిన్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి తేజస్వి మదివాడ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు, హార్ట్ అటాక్, పండగ చేస్కో వంటి విజయవంతమైన సినిమాల్లో కీలక పాత్రల్లో కనిపించిన ఆమె, ఆ తర్వాత కేరింత, ఐస్ క్రీమ్ లాంటి చిత్రాలతో హీరోయిన్‌గా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. ముఖ్యంగా రామ్ గోపాల్ వర్మ దర్శకత్వంలో వచ్చిన ఐస్ క్రీమ్ సినిమాలో ఆమె చేసిన డిఫరెంట్ రోల్ అప్పట్లో పెద్ద చర్చకే దారి తీసింది.కొన్ని సినిమాలు, వెబ్ సిరీస్‌లు, టాక్ షోలతో బిజీగా కనిపించిన తేజస్వి ఇటీవల పెద్దగా తెరపై కనిపించకపోయినా, ఆమె గతంలో చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. ఒక ఇంటర్వ్యూలో ఆమె తన కెరీర్‌తో పాటు వ్యక్తిగత జీవితానికి సంబంధించిన అనుభవాలను చాలా ఓపెన్‌గా పంచుకుంది. 33 ఏళ్ల వయసులోనూ ఫిట్‌నెస్‌పై ప్రత్యేక దృష్టి పెట్టానని, జిమ్‌లో కష్టపడి తనను తాను మార్చుకున్నానని తేజస్వి చెప్పింది. విదేశీ ట్రిప్స్‌లో బికినీ ఫోటోషూట్లు చేయడం, కిస్సింగ్ సన్నివేశాల్లో నటించడం వంటి విషయాలు తన ప్రొఫెషన్‌లో భాగమే తప్ప వ్యక్తిగతంగా వేరే అర్థం లేదని స్పష్టం చేసింది. తాను అమాయకురాలిని కాదని, తన జీవితం గురించి స్పష్టత ఉన్న వ్యక్తినని కూడా ఆమె పేర్కొంది. అలాగే, బిగ్ బాస్ షోపై కూడా ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. 2017లో ఆ షోలో పాల్గొనడం తన కెరీర్‌కు పెద్దగా ఉపయోగపడలేదని, అప్పటి మానసిక ఒత్తిడి వల్ల దాదాపు రెండేళ్ల పాటు సినిమాలకు దూరంగా ఉండాల్సి వచ్చిందని వెల్లడించింది. ఆ దశలో తన మెంటల్ స్టేట్‌ను ఎవరూ అర్థం చేసుకోలేదని, ఆ ప్రభావం వ్యక్తిగత జీవితంపై కూడా పడిందని చెప్పింది. పరిస్థితులు ఇంత తీవ్రంగా మారడంతో ఇండియా వదిలి వెళ్లాలనే ఆలోచన కూడా వచ్చినట్టు తేజస్వి భావోద్వేగంగా చెప్పుకొచ్చింది. ఇక పరిశ్రమలో కమిట్‌మెంట్స్ అంశంపై మాట్లాడిన తేజస్వి, తనను నేరుగా ఎవరూ అడగలేదని తెలిపింది. అయితే కెరీర్ ప్రారంభ దశలో కొన్ని అసౌకర్యకర పరిస్థితులను ఎదుర్కొన్నానని, కానీ తన స్పష్టమైన వ్యక్తిత్వం, ధైర్యంగా మాట్లాడే స్వభావమే తనను ఇలాంటి వాటి నుంచి కాపాడిందని చెప్పింది. ఇలాంటి సమస్యలు సినిమా పరిశ్రమకే పరిమితం కాదని, ఏ రంగంలోనైనా ఉంటాయని, వాటిని ఎదుర్కొనే బాధ్యత ప్రతి ఒక్కరిదేనని ఆమె అభిప్రాయపడింది. మొత్తంగా చూస్తే, తేజస్వి మదివాడ జీవితం కేవలం సినిమాలకే పరిమితం కాకుండా, అనుభవాలతో నిండిన ఒక ప్రయాణంలా కనిపిస్తోంది. కెరీర్‌లో వచ్చిన ఎత్తుపల్లాలు, వ్యక్తిగత పోరాటాల గురించి ఆమె చెప్పిన మాటలు ఇప్పుడు చాలా మందికి ప్రేరణగా మారుతున్నాయి.



## ‘ఖైదీ 150‘ తర్వాత ‘మన శంకర వరప్రసాద్ గారు‘ రికార్డ్

మెగాస్టార్ చిరంజీవి నటించిన ‘మన శంకర వరప్రసాద్ గారు’ ప్రీమియర్ షోల విషయంలో దుమ్మురేపుతున్నాడు. హైదరాబాద్‌లో ఏకంగా 200 స్క్రీన్స్‌లలో ప్రీమియర్స్ ప్రదర్శించనున్నారు. రూ. 600 టికెట్ ఉన్నప్పటికీ దాదాపు అన్ని థియేటర్స్ హౌస్‌ఫుల్ అయ్యాయి. ఆపై నార్త్ అమెరికాలో కూడా టికెట్స్ బుకింగ్ జోరు కనిపిస్తుంది. ఈ క్రమంలో తాజాగా చిత్ర యూనిట్ ఒక పోస్టర్‌ను విడుదల చేసింది. అమెరికాలో కేవలం ప్రీమియర్స్ ద్వారానే 9 లక్షల డాలర్లు (రూ. 8.12కోట్లు) కలెక్ట్ చేసినట్లు ప్రకటించారు. 1మిలియన్ మార్క్ కూడా చేరవచ్చని తెలుస్తోంది. దీంతో చిరంజీవి కెరీర్‌లో మరో అతిపెద్ద ఓవర్సీస్ ఓపెనింగ్‌గా ఈ మూవీ రికార్డ్ క్రియేట్ చేసింది. ‘మన శంకర వరప్రసాద్ గారు’ అమెరికా ప్రీమియర్స్‌లో సత్తా చాటుతున్నాడు. ప్రీమియర్స్ కలెక్షన్స్ పరంగా చిరు కెరీర్‌లో రెండో చిత్రంగా నిలిచింది. మొదటి స్థానంలో ఖైదీ 150 మూవీ ఉంది. చిరు రీఎంట్రీ మూవీ కావడంతో కేవలం ప్రీమియర్స్ ద్వారా 1.25 మిలియన్ డాలర్స్ వచ్చాయి. ఆ తర్వాత అంతటి రేంజ్ ఓపెనింగ్స్ కలెక్షన్స్ ‘మన శంకర వరప్రసాద్ గారు’ మూవీకి దక్కింది. అయితే, చిరు హిట్ సినిమా వాల్తేరు వీరయ్య కూడా 6 లక్షల డాలర్ల వద్దే ఆగిపోయింది. సంక్రాంతి పండుగ కాబట్టి చిరు సినిమాకు పాజిటీవ్ టాక్ వస్తే తన కెరీర్‌లోనే బిగ్గెస్ట్ కలెక్షన్స్ రాబట్టిన చిత్రంగా ‘మన శంకర వరప్రసాద్ గారు’ నిలిచే ఛాన్స్ ఉంది.

## ‘నారీ నారీ నడుమ మురారి‘ అదిరిపోయేలా ట్రైలర్




శర్వానంద్ నటిస్తున్న ‘నారీ నారీ నడుమ మురారి‘ మూవీ ట్రైలర్ తాజాగా విడుదలైంది. సంక్రాంతి కానుకగా జనవరి 14న సాయంత్రం 5:49 గంటలకు థియేటర్లలో విడుదలకానుంది. ఈ మూవీని దర్శకులు రామ్ అబ్బరాజు తెరకెక్కించగా.. అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మించారు. ఇందులో సంయుక్త, సాక్షీ వైద్య హీరోయిన్లుగా నటించారు. వివాహ భోజనంబు, సామజవరగమన వంటి సినిమాలకు దర్శకుడిగా పనిచేసిన రామ్ అబ్బరాజు తొలిసారి సంక్రాంతి రేసులో ఉన్నారు. ఈ మూవీలో శ్రీవిష్ణు అతిథి పాత్రలో కనిపించనున్నారు.

## నవీన్ పోలిశెట్టికి ‘అనగనగా ఒక రాజు’ అగ్ని పరీక్ష .. సినిమా సినిమాకి అంత గ్యాప్ ఎందుకు అంటే..!



తెలుగు సినిమా రంగంలో తనదైన స్టైల్‌తో దూసుకెళ్తున్న యువ నటుడు నవీన్ పోలిశెట్టి, “తక్కువ సినిమాలు ఎక్కువ ప్రభావం” అనే విధానంతో ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నాడు. ఒక్కో సినిమా మధ్య ఎక్కువ విరామం తీసుకున్నా, వచ్చిన ప్రతీసారి ప్రేక్షకులను కొత్తదనంతో పలకరించడం అతని బలంగా మారింది. ‘ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ’తో వినూత్నమైన క్రైమ్‌కామెడీని పరిచయం చేసిన నవీన్, ‘జాతిరత్నాలు’తో మాస్ ప్రేక్షకులను ఉర్రూతలూగించాడు. ఆపై ‘మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి’తో క్లాస్ ఆడియెన్స్‌ను ఆకట్టుకుని తన పరిధిని మరింత విస్తరించాడు.ఇప్పుడు సంక్రాంతి కానుకగా జనవరి 14న విడుదలకు సిద్ధమైన ‘అనగనగా ఒక రాజు’పై అంచనాలు పెరిగిపోతున్నాయి. కళ్యాణ్ శంకర్ దర్శకత్వంలో, మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో గోదావరి ప్రాంతానికి చెందిన యువకుడిగా నవీన్ కనిపించనున్నాడు. ట్రైలర్‌లో కనిపించిన స్థానిక యాస, సహజమైన హాస్యం, టైమింగ్ ప్రేక్షకుల్ని ఆకట్టుకోవడంతో సినిమాపై ఆసక్తి మరింత పెరిగింది. ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూలో నవీన్ తన కెరీర్ దృష్టికోణాన్ని స్పష్టంగా వివరించాడు. సినిమాల మధ్య గ్యాప్‌లపై వస్తున్న ప్రశ్నలకు సమాధానంగా, ప్రేక్షకుడు థియేటర్‌లో పెట్టే ప్రతి రూపాయి విలువైనదేనని, అందుకే కథల ఎంపికలో చాలా జాగ్రత్తగా ఉంటానని చెప్పాడు. ముంబయిలో అవకాశాల కోసం తిరిగిన రోజుల్లో సినిమా చూడటానికీ డబ్బులు లేక ఇబ్బంది పడ్డ అనుభవాలు తనలో ఇప్పటికీ ఉన్నాయని, అప్పటి బాధే తనను ఇంకా బాధ్యతాయుతంగా ఆలోచించేలా చేస్తుందని తెలిపాడు. తన మొదటి రోజుల గురించి మాట్లాడుతూ, నటనను కెరీర్‌గా ఎంచుకున్నప్పుడు ఇంట్లో అభిప్రాయ భేదాలు వచ్చాయని, ముఖ్యంగా నాన్నతో జరిగిన చర్చలు కష్టంగా అనిపించాయని గుర్తు చేసుకున్నాడు. అవకాశాలు దొరకని సమయంలో ఆ ఒత్తిడి ఎక్కువైందని, కానీ ఆ దశలో అమ్మ తనకు అండగా నిలిచిందని భావోద్వేగంగా చెప్పాడు. “ఆమెనే నా ఎనర్జీ” అంటూ తల్లికి కృతజ్ఞతలు తెలిపాడు. సినిమాల విషయానికి వస్తే, ఎస్.ఎస్. రాజమౌళి, రాజ్‌కుమార్ హిరానీ, జోయా అక్తర్ లాంటి దర్శకులతో పనిచేయాలన్న కోరిక ఉందని చెప్పిన నవీన్, తనకు ప్రేరణనిచ్చే వ్యక్తులుగా ఎంఎస్ ధోనీ, లియోనెల్ మెస్సీలను ప్రస్తావించాడు. ఒత్తిడిని ప్రశాంతంగా ఎదుర్కొనే వారి తత్వమే తనకు ఇష్టమని అన్నాడు. ఒక సినిమా ఒప్పుకున్నాక స్క్రిప్ట్ నుంచి డాన్స్ వరకు ప్రతి అంశంలో పూర్తిగా లీనమవుతానని, అదే సమయంలో పని మీద మునిగిపోవడం వల్ల వ్యక్తిగత జీవితంలో కొన్ని దూరాలు పెరిగాయని కూడా నిజాయితీగా ఒప్పుకున్నాడు.

Printed by Sree Seshasai Enterprises Published by Vaddi Srinivas Reddy on behalf of Sai Krishna Publications, printed at # 3-88, Chandra Theater, Main Road, Gosala, Krishna District - 521151 Andhra Pradesh and published at D.No. 6-121, 1st Floor, Sphurthy Building, Gosala Villae, Urdu School Street, Vijayawada, Krishna District-521151 Andhra Pradesh. Editor Vaddi Srinivas Reddy- 94402 31967 . PRGI Registration No. APTEL/26/A0119,